Pubilshed from Eluru PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com

ఏలురు ELURU | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 94 Issue No : 94 | గురువారం Thursday | మార్చి 5, 2026 5 MARCH 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.

వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

# శభాష్ నాయకులారా..?





- ప్రజాప్రతినిధులకే కొత్త అర్థాన్ని తెచ్చారు...
- ఇదంతా కులం కోసమా...అహం కోసమా...
- ఆది నుంచి ఇరువురిది అధిపత్యమే
- పట్టు వస్త్రాల కోసం ఎన్ని ఫీట్లు...
- తలంబ్రాల బియ్యం కోసం తోపులాటలా...
- పూజల కోసం ఇన్ని పడరాని పాట్లా
- మీకు పూజ ముఖ్యం కాదు పెద్దరికం ముఖ్యం
- ముఖ్యమంత్రి గారు ఈ ముష్టి యుద్ధం చూసారా...
- అంతా మనవాళ్లే తన్నుకు చచ్చేది తాంభూలం కోసమే...
- కూటమిలో ఈ కల్లోలంకు కళ్ళెం వేయలేరా...
- ఓ ప్రజాప్రతినిధి ఇదేనా మీ పనితీరు....
- తప్పు ఎవరిది..వీరిని ఎన్నుకున్నవారిదా...
- వీరిని ఎంచుకున్న వారిదా...!
- వీరు ప్రజా సేవకులు..వీరిది ప్రజా సేవ...
- తిరువూరులో గిర గిరా తిరుగుతున్న రాజకీయాలు...
- పార్టీకి కొరకరాని కొయ్యగా మారిన కేశినేని, కొలికపూడి..
- అధిష్టానం కింకర్తవ్యమేమిటో మరి..?

(రామమోహన్ రెడ్డి)

నిజమైన నాయకుడు నిస్వార్థపరుడై, ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తూ, ధైర్యసాహసాలతో నిర్ణయాలు తీసుకుంటూ, అందరికీ ఆదర్శంగా ఉండాలి. అతను నిజాయితీ, సమగ్రత, కరుణ, మరియు ఉత్తమ నైపుణ్యాలు కలిగి, సమష్టి లక్ష్యాల సాధన కోసం బృందాన్ని ప్రేరేపించే విధంగా ఉండాలి.నాయకత్వం అంటే ఒక ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి ఇతరులను ఉత్తేజపరచడం, ప్రభావితం చేయడం ,సరైన దిశలో నడిపించే సామర్థ్యం. ఇది ఒక వ్యక్తి యొక్క స్థానం కంటే, బృందాన్ని ఒకే తాటిపైకి తెచ్చి, నిర్ణయాలు తీసుకుంటూ, క్లిష్ట సమయంలో బాధ్యత వహించేలా ఉండాలి.ప్రజాప్రతినిధులు అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన నాయకులు.

2 వ పేజీలో



## శ్రీలంక దక్షిణ తీరంలో మునిగిన ఇరాన్ నౌక..

### 101మంది గల్లంతు

కొలంబో : శ్రీలంక దక్షిణ తీరంలో బుధవారం జరిగిన జలాంతర్గామి దాడిలో ఇరాన్ యుద్ధ నౌక 'ఐరిస్ దేనా' మునిగిపోయినట్లు జాతీయ మీడియా తెలిపింది. ఈ దాడిలో సుమారు 101మంది సైనికులు గల్లంతయ్యారు. సుమారు 78మంది గాయపడగా, వీరిలో 32మంది తీవ్రంగా గాయపడినట్లు వెల్లడించింది. ఐరిస్ దేనా ఇరాన్ కొత్త యుద్ధ నౌకల్లో ఒకటి. ఇటీవల విశాఖ తీరంలో నిర్వహించిన విన్యాసాల్లో పాల్గొని, తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.180మందితో కూడిన ఐరిస్ దేనా నౌక ప్రమాదంలో ఉందని శ్రీలంక నేవీకి సమాచారం వచ్చిందని విదేశాంగ మంత్రి విజిత హెరాత్ తెలిపారు. మునిగిపోతున్న ఇరాన్ నౌక నుండి 79మందిని రక్షించామని, 101మంది గల్లంతయ్యారని తెలిపింది. గాయపడిన 32మందికి చికిత్స అందిస్తున్నామని ఆయన ప్రకటించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఏడుగురికి అత్యవసర చికిత్స అందిస్తున్నామని చెప్పారు.



## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు

- నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్
- హోంమంత్రి అనిత

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

- మిగతా 2లో..

## దేవుడు మిమ్మల్ని వదిలి పెట్టడు

### కల్తీ జరగలేదని చెప్పడానికి సిగ్గుండాలి



- దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం
- గత పదేళ్లుగా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలో అన్నదానం చేస్తున్నాం
- అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారు
- మీ నాయకుడు జగన్ రెడ్డి డిక్లరేషన్ పై కనీసం సంతకం పెట్టలేదు
- తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ ఛార్జిషీట్ లో స్పష్టంగా చెప్పారు
- మండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలపై నిప్పులు చెరిగిన మంత్రి లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం ఉంది. గత పదేళ్లుగా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలో అన్నదానం చేస్తున్నాం. అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ అంశంపై మండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. మండలిలో వైసీపీ నేతల తీరుపై మంత్రి నారా లోకేష్ నిప్పులు చెరిగారు. నెయ్యి కల్తీ అంశంపై శాసనమండలిలో చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీపై తీవ్ర ఆరోపణలు చేశారు.

2 లో

## శ్రీవారి భక్తుడిగా ఆవేదన కలుగుతోంది

### శ్రీవారి విశ్వాసాలపై వైసీపీ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదు

- కల్తీ అంశం నుంచి వైసీపీ తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని మండిపాటు
- హిందువులను బాధపెడుతున్న జగన్...వైసీపీ సభ్యులు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కల్తీ నెయ్యి అంశంపై మండలిలో ఎన్ని రోజులు అయినా చర్చకు రెడీ అంటూ బహిరంగ సవాల్ విసిరిన మంత్రి అచ్చెన్న

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి విశ్వాసాలపై వైసీపీ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిలిలో మండిపడ్డారు. కల్తీ నెయ్యి అంశం నుంచి తప్పించుకునేందుకే వైసీపీ పాకులాడుతోందని ఆరోపించారు.



- మిగతా 2లో..



## ఉపాధి పథకాన్ని రద్దు చేసే కుట్ర బిజెపి చేస్తుంది

- రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి

వివరాలు 2 లో

## కొండలనూ తవ్వేస్తున్నారు..!



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం : ప్రత్తిపాడునియోజక వర్గం లోని ఏలేశ్వరం మండలం లో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని ఈ మాఫియా చాప కింద నీరులా మొదలై ఇప్పుడు ఏకంగా కొండలను, గుట్టలనే మింగేస్తోందని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్లు గప్పి యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ తవ్వకాలు ఇప్పుడు నియోజకవర్గం లో హాట్ టాపిక్ గా మారాయి.



- పట్టించుకోని అధికారుల యంత్రాంగం..
- అన్ని అక్రమాలకు ఎమ్మెల్యే సత్య ప్రభ మాత్రమే అండ అని విమర్శలు....!

### నిషేధిత ప్రాంతంలోనే దోపిడీ!

ఏలేశ్వరం పట్టణానికి అతి సమీపంలో ఏలేరు ప్రాజెక్టుకు ఉంది. దీనికి సమీపంలో ఉన్నా 51వ సర్వే నంబర్ అడ్డు కొండ ప్రాంతం అత్యంత కీలకమైనది. ప్రాజెక్టు రక్షణ దృష్ట్యా 34 క్వారీ లను ప్రభుత్వం సీజ్ చేసి అక్కడ మట్టి గుట్టలను భద్ర పరిచారు. అయితే వీటిపై ఏలేరు ప్రాజెక్ట్ అధికారులు మాత్రమే కాక మైనింగ్ అధికారులకు కూడా అధికారం ఉంది. ఇప్పుడు ఆ గుట్టలే అక్రమార్కులకు కాసుల వర్షం కురి పిస్తున్నాయి.

2 లో

## సంపాదకీయం

# ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా ?



వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ప్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ప్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్గానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్‌తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పలు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి. దేశీయంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. దేశీయ వస్తువులను వాడాలనడం కాదు..

దేశీయ ఆహారాలనే వాడలనే నినాదం రావాలి. ఈ యుద్ధంతో అయినా పాలకుల ఆలోచనా తీరు మారాలి. లేకుంటే సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. కారణం అవి సరిగా లేకపోవడం లేదా, అమలులో లోపాలు ఉండడమే కారణంగా చూడాలి. ప్రపంచ యుద్ధాలతో మనం మారాలి. స్వయం సమృద్ధి దిశగా నడవాలి. సంక్షోభాలను ఎదుర్కొనేలా నిలబడగాలి. అప్పుడే దేశం ఆర్థికంగా నిలబడుతుంది.

# 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు

ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.



# కొండలనూ తవ్వేస్తున్నారు ...!



ఎటువంటి అనుమతులు లేకుండానే, రోజుకి అధిక సంఖ్యలో లారీలు మట్టిని అక్రమంగా తరలిస్తున్నాయి. ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని పదుల ఎకరాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ఒక్కో ట్రిప్పర్ మట్టిని స్థానిక ప్రైవేట్ వెంచర్లకు రూ. 6 వేల 500 రూపాయల నుండి రూ. 8 వేల రూపాయల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అండదండలు ఉన్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

**నేత అనుచరుడి హల్చల్?**

**ఈ అక్రమ రవాణా వెనుక రాజకీయ అండదండలు...**

ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేరు ప్రముఖంగా వినబడుతోంది. ఆమె పేరు చెప్పుకుంటూ, ఆమెకు అత్యంత సన్నిహితుడిని, మరియు దగ్గరి బంధువుని అని ప్రచారం చేసుకుంటున్న ఒక వ్యక్తి ఈ మాఫియాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్థానికులు బాహాటం గానే వెల్లడిస్తున్నారు. రాబోయే ఐదేళ్లు నాదే హవా.. ఈ మట్టి తోలకాలు అన్నీ నా కనుసన్నల్లోనే జరుగుతాయి అంటూ సదరు నేత బహిరంగంగానే సవాల్ చేస్తున్నట్లు సమాచారం. ఇంత అవినీతి జరుగు తున్నప్పటికీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కనీసం అటువైపు చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి సమీపంలోని వెంచర్లకే మట్టి తరలిపోతున్నా, అధికారులు పట్టించు కోకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ప్రాజెక్టుకు ముప్పు**

ఏలేరు ప్రాజెక్టుకు రక్షణ కోసం వేసిన మట్టి గుట్టలను తవ్వేయడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కోట్లాది రూపాయల దోపిడీ ప్రభుత్వ సంపదను కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల పేరుతో దందా ఎమ్మెల్యే పేరు వాడుకుంటూ సామాన్యులను, అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వైనం.

**నియోజకవర్గ ప్రజల డిమాండ్**

వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, సర్వే నంబర్ 51 లో జరుగుతున్న అక్రమ తవ్వకాలను అరికట్టాలని, ప్రభుత్వ భూములను మరియు ఏలేరు ప్రాజెక్టును సమరక్షించాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటి అంటే ఏలేశ్వరం నగర పంచాయతీలో అధికార పార్టీ లోని మోటా,చోట నాయకులను కూడా పక్కన పెట్టి,ఇక్కడ కాంట్రాక్టులన్నీ ముఖ్యంగా మట్టి మాఫియాను తన చేతుల్లోకి తీసుకొని, పెత్తనం చలాయిస్తున్నారనే ఆ పార్టీలోనే నాయకులు గుసగుసలాడుతున్నారు.లోగడ వైసిపి ప్రభుత్వం లో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ నాలుగు మండలాలకు నలుగురు ఇన్చార్జిలను నియమించి, ఏ మండలంలో వాళ్ళని ఆ మండలంలోనే అధికారం చలాయించుకునే లాగా వారితోనే అక్కడి వ్యవహారాలన్నీ చేసే వారని, అందువలన ఆ మండలంలో ఉన్న స్థానిక నాయకులకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదని, కానీ ఇప్పుడు నియోజకవర్గమంతా ఒకే వ్యక్తి చేతుల్లోకి తీసుకొని, అధికారం చలాఇస్తున్నారని, మండల స్థాయి నాయకులు సైతం ఇక్కడ డమ్మీలుగా మిగిలిపోతున్నారని, ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు మాత్రమే కాకుండా ప్రజలు కూడా విమర్శించడం గమనార్హం.

# శభాష్ నాయకులారా..?

వీరు పార్లమెంట్, అసెంబ్లీ లేదా స్థానిక సంస్థలలో ప్రజల తరపున బాధ్యత వహిస్తూ, వారి ఆకాంక్షలను, సమస్యలను పరిష్కరించడానికి చట్టాలు చేయడానికి ఎన్నుకోబడినవారు.వారే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానిక సంస్థల ప్రతినిధులు.మరి ఇన్ని గొప్ప గొప్ప లక్షనాలు కలిగి ఉండాల్సిన నేటి ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు పళ్లెం కోసం పడిన పాట్లు చూస్తుంటే ఫక్కున నవ్వుతున్నారు ప్రజానీకం.

మంగళవారం తిరువూరు నియోజకవర్గ నెమలి వేణుగోపాల్ స్వామి కల్యాణోత్సవం లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, స్థానిక శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాస రావు ల మధ్య జరిగిన స్వామి పట్టువస్త్రాల సిగపట్లు సభ్యసమాజం తలదించుకునేల ఉన్నాయి.ఓకే పార్టీ కి చెందిన ఇరువురు ప్రజాప్రతినిధులు ప్రజల సమక్షంలో వేణుగోపాల స్వామి కల్యాణ పట్టువస్త్రాలు సమర్పణలో జరిగిన తీరు చాలా బాధాకరం. సాధారణంగా ప్రోటోకాల్ వివాదం అనేది అధికార ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య రావడం సహజం. కానీ ఇక్కడ స్వపక్షం లోనే విపక్షము తయారు కావడమన్నదే అసలు సమస్య.

ఇక్కడ ప్రధానంగా చెప్పవలసిన అంశం ఏమిటంటే ఇరువురు ప్రజాప్రతినిధులు కూడా గత సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ఆరెంగ్రేట్రం చేసిన వారే. అయితే కొలికపూడి శ్రీనివాస రావు ఎమ్మెల్యే గా గెలిచిన మొదటి నుండి కూడా వివాస్పద అంశాలపై




నే ఎక్కవగా పయనం సాగించడం పరిపాటిగా మారింది. జేసీబీ ఎక్కి ప్రత్యర్థులు ఇల్లు కూలగొట్టడం ,అనేక పార్టీ కార్యక్రమాలలో కార్యకర్తలపైనే బూతులతో రెచ్చి పోవడం ఆయన నైజం గా మారిపోయింది. రేషన్ బియ్యం ,మట్టి మాఫియా లాంటి వ్యవహారం లో గత ప్రభుత్వం లో ఏలుబడి సాగించిన వారికే మద్దతు పలికి ఆఖరికి ఏ కొండూరు తహసీల్దార్ ను కార్యాలయంకు రాకుండా చేసి బదిలీపై వెళ్లేలా చేసిన ఘనత కూడా కొలికపూడికే దక్కుతుంది. అంటే కాకుండా ఏకంగా ఒక ప్రముఖ ఛానెల్ లోనే ఎంపీ చిన్ని పై చేసిన ఆరోపణలు ఆరోజు అంతా తీవ్ర చర్చనీయాంశంగా మారడం అధిష్టానం పిలిచి అనేక మార్లు మందిలింపు చేసినా కాస్త సర్దుబాటు అయ్యిందని అనుకుంటూ ఉన్న నేపథ్యంలో నెమలి వేణుగోపాల స్వామి కళ్యాణ ఉత్సవాలలో మళ్ళీ విభేదాలు భగ్గుమని విమర్శలు తారాస్థాయికి చేరుకున్నాయని చెప్పవచ్చు.

అయితే ఇక్కడ తప్పు ఎవరిదా అన్న విషయం ప్రక్కన పెడితే ఇరువురు నేతలు ప్రజా క్షేత్రం లో వేలాది మంది భక్తుల సమక్షంలో ఇలా పట్టు వస్త్రాల సమర్పణ విషయంలో బాహాబాహి దిగడం అనేది సంస్కారం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ ఆ నియోజకవర్గ పరిధిలో కొలికపూడి నాయకత్వం సహించేది లేదన్న నిజం లేకపోలేదు. కులాల ఆధిపత్య విషయం లో కొలిక పూడి సామాజిక వర్గానికి కొంత ఎక్కువ ఉన్నా చిన్ని సామాజిక వర్గం వారిని ఎమ్మెల్యే చూస్తున్న తీరుతో అక్కడ ఏదో ఒక అంశం వివాదాస్పదంగా తయారు అవుతూనే ఉన్నాయి. అయితే ఇలాంటి సంఘటనలు చూస్తున్న మెజార్టీ ప్రజలు తప్పు వీరిదేనా వీరిని ప్రజాప్రతినిధులు గా ఎంచుకున్న వారిదా లేక వీరిని ప్రజాప్రతినిధులు గా చేసిన పార్టీలదా అన్న అనేక రకాల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరి అధిష్టానం ఈ ఇరువురి ప్రజాప్రతినిధుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్నది వేచిచూడక తప్పని పరిస్థితి

# ఉపాధి పథకాన్ని రద్దు చేసే కుట్ర బిజెపి చేస్తుంది

**ప్రజాభూమి ప్రతినిధి, చీరాల :** పేదలకు అనుకూలంగా ఉపాధిపరంగా ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శించారు. బుధవారం ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్ లో ఉపాధి హామీ పథకం గురించి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సభలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు పలువురితో ముందుగా వారి అభిప్రాయాలన్ని బహిరంగంగా తెలిపారు. సభలో వారు చెప్పిన సమస్యలు విన్న అనంతరం షర్మిలా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ .... కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర కొనసాగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా ముందుగా మహాత్ముని పేరు తొలగించి విబి జి రాంజీ ఉపాధి హామీ పథకం అని నామకరణం చేశారన్నారు. తదుపరి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే విధంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పొడిగించామన్నారు. గతంలో వందరోజులకే పని కల్పించిన ఈ పథకాన్ని పేరుకు 125 రోజులు పని దినాలు కల్పించాము అని చెబుతున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో గ్రామంలో పేద ప్రజలే తమకు పనిలేదని ఉపాధి కోసం గ్రామంలో పెద్దలను అధికారులను సంప్రదిస్తే వారికి ఉపాధి చూపించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేవారన్నారు. అయితే ప్రస్తుత నూతన విధానంతో అందుకు అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఎంతో మంచి గొప్ప పథకాన్ని తొలగించే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు. పథకాన్ని గుండు సున్నా చుట్టేలా చేస్తుందన్నారు. ఇది బిజెపికి డబ్బులు వచ్చే పథకం కాదని అందువలన తొలగించారని అన్నారు.



# దేవుడు మిమ్మల్ని వదిలిపెట్టడు

వైసీపీ సభ్యుల ఆరోపణలపై మంత్రి లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఆరోపణలు చేయాలంటే ఆధారాలతో సభకు రావాలి. గత పదేళ్లుగా మా బాబు పుట్టినరోజు మార్చి 21 తిరుమలలో అన్నదానం చేస్తున్నాం. అలాంటి మాపై ఆరోపణలు చేస్తున్నారు. టెండర్ లో ఎల్-3 వస్తే రాదు.. ఎల్-1 వారికి మాత్రమే వస్తుంది. కామన్ సెన్స్ ఉండాలి. లడ్డూలో కల్తీ అంశం తప్ప వైసీపీ సభ్యులు అన్నీ మాట్లాడతారు. సీబీఐ ఇచ్చిన రిపోర్ట్ లో కల్తీ జరిగిందని చాలా స్పష్టంగా చెప్పింది. వైవీ సుబ్బారెడ్డి కూడా కల్తీ జరిగిందని ఒప్పుకున్నారు. ఇప్పుడు నెయ్యి మార్కెట్ ధర పెరిగింది. కల్తీ చేసి రూ.300కి నెయ్యి సప్లై చేయమంటారా? వైసీపీ కల్తీ చేసినట్లు చేయమంటారా? మార్కెట్ ప్రైస్ ఎంతుందో ఈ రోజు కామన్ సెన్స్ తో గూగుల్ లో చెక్ చేసుకోవచ్చు. కావాలని ఆరోపణలు చేస్తున్నారు. దేవుడంటే మా కుటుంబానికి అపారమైన గౌరవం. మాకు రైట్ ఉన్నా తిరుమలలో ఏనాడూ ముఖద్వారం నుంచి వెళ్లలేదు. క్యూ కాంప్లెక్స్ నుంచి వెళ్లిన ఘనత మాది. మీ నాయకుడు జగన్ రెడ్డి డిక్లరేషన్ పై కనీసం సంతకం పెట్టలేదు. మీరా మాట్లాడేది అంటూ నిలదీశారు. కల్తీ జరగలేదని చెప్పడానికి సిగ్గుండాలని, దేవుడు మిమ్మల్ని వదిలిపెట్టడని మండిపడ్డారు.



# శ్రీవారి భక్తుడిగా ఆవేదన కలుగుతోంది



గతంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సీఎం నారా చంద్రబాబు నాయుడు చీణఓదీ రిపోర్ట్‌లో ఉన్న అంశాలనే సభలో చదివారని స్పష్టం చేశారు. దీనిని వక్రీకరించి ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటైందని మండిపడిన ఆయన, ఇండిపెండెంట్ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి చేసిన విమర్శలను ఖండిస్తూ, ప్రజలు ఛీ కొడతారని అసలు అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే హెరిటేజ్ అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. బట్ట కాల్చి మీద వేయడం వైసీపీ నేతలకు కొత్త కాదు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మండలిలో వైసీపీ సభ్యుల ప్రసంగానికి అడ్డుపడుతున్నారన్న తోట త్రిమూర్తులు వ్యాఖ్యలపై కౌంటర్ ఇస్తూ, చర్చను ఇందాపూర్ ప్రస్తావనతో డైవర్ట్ చేస్తున్నది వైసీపీయేనని తెలిపారు. శ్రీవారి భక్తుడిగా తనకు తీవ్ర వేదన కలుగుతోందని పేర్కొంటూ, జగన్‌కు వెంకటేశ్వరస్వామిపై నమ్మకం లేదని, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇంత కక్ష ఎందుకో వైసీపీ సభ్యులు చెప్పాలని ప్రశ్నించారు. అయితే తన వ్యాఖ్యలపై మండలి చైర్మన్ మోషేన్ రాజు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాటిని ఉపసంహరించుకుని సభకు క్షమాపణ తెలిపారు. తన వివరణతో చైర్మన్ సంతృప్తి చెందినట్లు తెలిపారు. ఎవరి మత విశ్వాసాలు వారివి. నా వ్యాఖ్యల్లో ఏమైనా తప్పుంటే చెప్పండి అని స్పష్టం చేశారు. అదే సమయంలో జగన్ క్రిస్టియన్ అనేందుకు నా వద్ద ఆధారాలు ఉన్నాయి, నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాను అని స్పష్టం చేస్తూ, హిందువులను బాధపెడుతున్న జగన్ తరపున వైసీపీ సభ్యులే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వాయిదా తర్వాత కూడా వైసీపీ సభ్యులు నినాదాలతో సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారని విమర్శించిన మంత్రి, తాను ఎన్ని రోజులైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

# కుంభాభిషేక మహా క్రతువుకు ఘన ఏర్పాట్లు





**ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా సౌకర్యాల కల్పన**
**ఆధునిక సాంకేతికతతో భక్తుల భద్రతకు భరోసా**
**అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదానికి అదనపు ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ద్వాదశ వర్ష నియమం ప్రకారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే అత్యంత పవిత్రమైన కుంభాభిషేకం మహా క్రతువుకు ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నామని.. గౌరవ ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికా రులు, ట్రస్టు బోర్డు, భక్తులు సమష్టి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామ ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధ వారం కలెక్టర్ లక్ష్మీశ.. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, ఈవో వీకే శీనానాయక్ తదితరులతో కలిసి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కుంభాభిషేక కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా విమాన గోపురం వద్ద చేసిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. తుది మెరుగులు దిద్దేందుకు ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ఘాట్‌రోడ్డు, యాగశాల, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు తదితరాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని.. గౌరవ సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర ప్రముఖులు వచ్చేందుకు అవకాశమున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం ది లేకుండా క్యూలైన్లు, ప్రసాదాల కౌంట ర్లు, పార్కింగ్, సామాన్లు భద్రపరుచు కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు వంటి ఏర్పాట్లు చేస్తున్నా మని.. వీటిని సద్వినియోగం చేసుకొని అమ్మవారిని దర్శించుకొని, భద్రంగా వెళ్లాలని సూచించా రు. డ్రోన్లు, ఏఐ సాంకేతికతను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

**సమష్టి కృషితో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం: ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)**

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో జరిగే మూడు రోజుల మహా ఆధ్యాత్మిక క్రతువుకు ఎంతమంది వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని.. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యంతో కార్యక్ర మాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దామని ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) అన్నారు. మంచినీరు, పాలు, మజ్జిగ, బిస్కట్లు వంటివాటిని ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏర్పాట్లు చివరిదశకు చేరుకున్నాయన్నారు. కార్యక్రమానికి సంబంధించి గౌరవ సీఎంతో పాటు ప్రముఖులకు శుభ ఆహ్వానాలు అందించామని రాధాకృష్ణ తెలిపారు.

**1,500 సిబ్బందితో పటిష్ట భద్రత: సీపీ ఎస్వీ రాజశేఖరబాబు**

మూడు రోజుల పాటు రోజుకు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తులు వచ్చే అవకాశ ముందన్న అంచనాలతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు తెలిపారు. దాదాపు 1,500 మంది సిబ్బందితో భద్రతకు చర్యలు తీసుకుంటు న్నా మని.. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ ) కూడా ఈ నెల 5వ తేదీ నుంచి పనిచేస్తుందని వివరించారు. ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం సహాయంతో అన్ని శాఖల అధికా రులను సమన్వయం చేసు కుం టూ కార్య క్రమాన్ని విజయవంతం చేసేం దుకు కృషిచే స్తామని రాజశేఖరబాబు తెలిపారు.

**ఆలయ ఈవో వీకే శీనానాయక్ మాట్లాడుతూ..** భక్తుల రద్దీనిబట్టి నిరంతర పర్యవేక్షణతో పటిష్ట ప్రణాళికతో దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నా మని.. మూడో రోజు మాత్రం అంతరాలయం దర్శనాన్ని పూర్తిగా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్జిత సేవలను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. భక్తులకు ఎలాం టి లోటుపాట్లు లేకుండా ఏర్పా ట్లు చేస్తున్నామని ఈవో శీనా నాయక్ అన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్, డీసీపీ జి.రామకృష్ణ, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు ఎల్.రమ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి కార్యాలయ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

ముఖ్యమంత్రి కార్యాలయ సి ఎం ఓ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న ఐఏఎస్ తన కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని (కనకదుర్గమ్మ ఆలయం) సందర్శించారు.దర్శనం: కుటుంబ సమేతంగా విచ్చేసిన ఐఏఎస్ అధికారికి ఆలయ అర్చకులు మరియు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆశీర్వచనం: దర్శనానంతరం వేద పండితులు 'వేదాశీర్వచన మండపం'లో వారికి వేదాశీర్వచనం అందజేశారు.అమ్మవారి ప్రసాదం & చిత్రం: ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో వి.కె. సీనా నాయక్ మరియు పాలకమండలి ఛైర్మన్ ఐఏఎస్ అధికారికి అమ్మవారి శేషవస్త్రం, జ్ఞాపిక (ఫోటో) మరియు తీర్థ ప్రసాదాలను అందజేశారు.కుంభాభిషేక ఆహ్వానం: మార్చి 6 నుండి 8 వరకు జరగనున్న మహా కుంభాభిషేక మహోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని ఆహ్వానించారు.

## కృష్ణాజిల్లా కలెక్టర్ మరియు ఎస్పీని అవమానించిన ఐఏఎస్ కార్తికేయను విధులు నుంచి తప్పించాలి....

**మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్**

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి



నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీని మరియు శాంతి భద్రతల పరిరక్షణలో ముందస్తులో ఉన్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ను గన్నవరం ఎయిర్పోర్ట్ లో అవమానించిన ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ ఐఏఎస్ ను తక్షణమే విజయం నుంచి తప్పించి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. బుధవారం మచిలీపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్తికేయ చర్యలను బాలాజీ తీవ్రంగా ఖండించారు. బాధ్యతగల పదవిలో ఉన్న వ్యక్తి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని బాలాజీ సూచించారు. జిల్లా కలెక్టర్ డ్రెస్ కోడ్ గురించి మాట్లాడే హక్కు కార్తికేయకు లేదని బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ కొరియర్ లో బూట్లు పంపడం కార్తికేయ ఆహంభావానికి పరాకాష్ట అని బాలాజీ అన్నారు. ప్రతిరోజు అన్ని రంగాలలో జిల్లాలో అభివృద్ధి పదంలో నడిపిస్తున్న నిజాయితీ అధికారి డీకే బాలాజీ అని బాలాజీ అన్నారు. జిల్లా ఎస్పీగా పదవి స్వీకరించిన నాటి నుండి జిల్లాలో శాంతి పద్ధతులు కాపాడుతూ ప్రజలకు కొండంత ధైర్యాన్ని ఇస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ను అవమానించడం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. కార్తికేయ అసభ్యకర పదజాలం జిల్లా ప్రజలను అవమానించినట్లు నని బాలాజీ అన్నారు తక్షణమే కార్తికేయ బేషరతుగా జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ కు క్షమాపణలు చెప్పాలని, కార్తికేయను పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను బాలాజీ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో థైరాయిడ్ పరిక్షా యూనిట్

ప్రజాభూమి ప్రతినిధి,మచిలీపట్నం :




మచిలీపట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో థైరాయిడ్ మెషిన్ పనిచేయడం లేదని మీడియాలో కథనాలు రావడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన మెషిన్ ను రెడీ చేస్తున్నారు. ఈ మెషిన్ కొన్ని టెక్నికల్ సమస్యల వలన దాదాపు రెండు సంవత్సరాలుగా రోగులకు సేవలు అందించడంలో విఫలం అయ్యింది. కొద్ది రోజులక్రితం చార్జ్ తీసుకున్న కొత్త ఇంచార్జ్ లు డిప్యుటిలు, సూపర్నెంటు చొరవతో అడుగు ముందుకు పడింది.ఈ పరిక్షలు చేయించుకోవడానికి సుమారు రెండు సంవత్సరాలుగా పేదలు రోగులు 400 వందల రూపాయలు ఖర్చు చేసి ప్రయివేటు ల్యాబ్ ల వద్ద చేయించుకుంటున్నారు. ఇకపై ఎలాంటి సమస్య రాకుండా నిత్యం రోగులకు సేవ చేయడానికి అందరం నిబద్ధతతో పనిచేస్తామని అధికారులు తెలిపారు.



## రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

(మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి)

మచిలీపట్నం కృష్ణా జిల్లా మచిలీపట్నం నార్త్ మండలం బొర్రపోతుపాలెం గ్రామంలో రీసర్వే పూర్తయిన 525 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గోపు సత్యనారాయణ రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.గత ప్రభుత్వ తీరుపై గోపు సత్యనారాయణ ధ్వజంఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో రైతుల పాస్ పుస్తకాలపై వ్యక్తిగత ముద్రలు (జగన్ బొమ్మ) వేసి రాజ్యాంగ విలువులను పక్కన పెట్టారని విమర్శించారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా కేవలం ప్రభుత్వ రాజముద్రను మాత్రమే ముద్రించి రైతులకు గౌరవప్రదంగా పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రైతుల ఆస్తి హక్కు పత్రాలపై రాజకీయ నాయకుల బొమ్మలు ఉండకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో సత్యనారాయణ తో పాటు పలువురు కీలక నేతలు మరియు అధికారులు పాల్గొన్నారు. కుంచె దుర్గప్రసాద్ (మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మన్), కాగిత వెంకటేశ్వరరావు (మచిలీపట్నం మండలం పార్టీ అధ్యక్షులు), తలారి సోమశేఖర్ (మచిలీపట్నం క్లస్టర్ ఇంచార్జ్), లంకే శేషగిరి , గ్రామ అధ్యక్షులు సునీల్, నీటి సంఘం అధ్యక్షులు రామస్వామి, లంకే హరి.రెవెన్యూ విభాగం నుండి ఆర్.ఐ జనార్దనరావు , వి.ఆర్.ఓ మోహనరావు మరియు స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది ఈ పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి ఈ పంపిణీ జరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## జగన్‌ను భార్యతో కలిసి గుడికి తీసుకురాగలవా?

**జ్వాలాపురపు శ్రీకాంత్‌కు ఫణి కుమార్ సవాల్**



మచిలీపట్నం (ప్రజాభూమి ప్రతినిధి)

ప్రభుత్వంలో దేవాదాయ శాఖ సలహాదారుగా పనిచేసిన జ్వాలాపురపు శ్రీకాంత్ తన నాయకుడు జగన్మోహన్ రెడ్డిని భార్యతో కలిసి దేవాలయాలకు తీసుకువచ్చి, హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు చేయించగలరా అని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ సూటిగా ప్రశ్నిం చారు. బుధవారం మచిలీపట్నంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది..బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ కె. బుచ్చి రాంప్రసాద్‌పై జ్వాలాపురపు శ్రీకాంత్ చేసిన విమర్శలను ఫణి కుమార్ తీవ్రంగా ఖండించారు. "పదవుల కోసం క్షుద్ర పూజలు చేసే వారి పక్కన జగన్ నిలబడ్డారని శ్రీకాంత్ మాట్లాడటం చూస్తుంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది" అని ఎద్దేవా చేశారు. శ్రీకాంత్‌కు దమ్ముంటే జగన్ తన భార్యతో కలిసి ఎప్పుడైనా ఆలయాలకు వచ్చిన దాఖలాలు ఉన్నాయేమో నిరూపించాలని సవాల్ విసిరారు.కూటమి ప్రభుత్వమే హిందూ ధర్మ రక్షకహిందూ ధర్మం పట్ల తమ నాయకులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లకు ఉన్న భక్తిని ఎవరూ శంకించలేరని ఫణి కుమార్ పేర్కొన్నారు. సంప్రదాయం: తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేటప్పుడు మా నాయకులు భార్యాసమేతంగా విచ్చేసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. వైసీపీ వైఫల్యం: గత వైసీపీ ప్రభుత్వంలో ఆలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం, రథాల దహనం జరిగినప్పుడు సలహాదారుగా ఉండి శ్రీకాంత్ ఏం చేశారని మండిపడ్డారు. నాడు అర్చకులపై దాడులు జరుగుతుంటే తన స్వార్థం కోసం మౌనంగా ఉన్నారని విమర్శించారు. అభివృద్ధి: కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి దేవాలయ కమిటీలో అర్చకుడితో పాటు ఒక బ్రాహ్మణుడికి చోటు కల్పించామని, అర్చకుల జీతాలు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.రుజువు చేయగలవా?నారా లోకేష్ పదవుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్నారన్న శ్రీకాంత్ వ్యాఖ్యలు అవివేకమని, ఆరోపణలను నిరూపించగలరా అని ప్రశ్నించారు. కేవలం జగన్ దగ్గర మెప్పు పొందేందుకే శ్రీకాంత్ ఇలాంటి అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో తిరుమల పట్టువస్త్రాల సమర్పణ సమయంలో జగన్‌కు హిందూ సంప్రదాయాలు ఎందుకు గుర్తు చేయలేదని నిలదీశారు.ఈ విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు సింగరాజు గోవర్ధన్, లొల్లా కుటుంబ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణతోనే మహిళలకు రక్షణ - అడిషనల్ ఎస్పీ వి.వి.నాయుడు

మచిలీపట్నం (ప్రజాభూమి ప్రతినిధి)

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక నిర్మల హైస్కూల్‌లో విద్యార్థినులకు 'సెల్ఫ్ డిఫెన్స్' (ఆత్మరక్షణ) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.వి. నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముఖ్య అంశాలు: మానసిక దృఢత్వం ముఖ్యం: ఆత్మరక్షణ అనేది కేవలం శారీరక శక్తికి సంబంధించింది మాత్రమే కాదని, అది మానసిక ధైర్యాన్ని పెంచుతుందని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం కోల్పోయిన రోజే అపజయం మొదలవుతుందని ఆయన విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.అప్రమత్తత అవసరం: అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా ఆపద కలిగితే వెంటనే కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియాలో జరిగే నేరాల పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

శిక్షణ ద్వారా రక్షణ: శిక్షకుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు చిన్న చిన్న టెక్నిక్స్‌తో ఆపద నుండి ఎలా తప్పించుకోవాలో ప్రయోగాత్మకంగా చూపించారు. చదువుతో పాటు శారీరక దృఢత్వంపై పట్టు సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ఇటువంటి శిక్షణ తరగతులు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖలో పారదర్శక విప్లవం: అసెంబ్లీలో మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి,ప్రజాభూమి ప్రతినిధి



గత ప్రభుత్వ హయాంలో అవినీతికి నిలయంగా మారిన ఎక్సైజ్ శాఖను, కూటమి ప్రభుత్వం పారదర్శకతకు కేంద్రంగా మార్చిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అసెంబ్లీలో ప్రకటించారు. బుధవారం ఎక్సైజ్ శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.మంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు: * గత ప్రభుత్వ దోపిడీ: జగన్ రెడ్డి తన సొంత బ్రాండ్లను ప్రజలపై రుద్ది, ఐదేళ్లలో ఎక్సైజ్ శాఖను భ్రష్టు పట్టించారు. రూ. 98 వేల కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే, డిజిటల్ పేమెంట్లు కేవలం 0.6% మాత్రమే జరగడం వెనుక భారీ కుట్ర ఉందని మండిపడ్డారు. రూ. 3200 కోట్ల స్కాం: గత ఐదేళ్లలో సుమారు రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణం జరిగినట్లు సిట్ విచారణలో తేలిందని మంత్రి వెల్లడించారు. నూతన మద్యం పాలసీ: కొత్త పాలసీ ద్వారా 89 వేల దరఖాస్తులు రాగా, ప్రభుత్వంకు రూ. 1800 కోట్ల ఆదాయం సమకూరింది. గీత కార్మికులకు 10% రిజర్వేషన్ కల్పిస్తూ, లైసెన్స్ ఫీజులో 50% సబ్సిడీ ఇచ్చామన్నారు. సాంకేతికతతో నిఘా: మద్యం బాటిళ్లను ట్రాక్ చేసేందుకు 'ట్రాక్ అండ్ ట్రేస్' విధానాన్ని, ప్రజల కోసం 'ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. డిజిటల్ చెల్లింపులను 40 శాతానికి పెంచాం. కల్తీ మద్యంపై ఉక్కుపాదం: 'నవోదయం 2.0' ద్వారా నాటు సారాను, 'ఈగిల్ టీమ్స్' ద్వారా గంజాయిని అరికడుతున్నాం. ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైసీపీ నేతలు కల్తీ మద్యం కుట్రలకు పాల్పడుతున్నారని, దోషులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.విచారణ వేగవంతం చేయాలి: స్పీకర్ అయ్యన్నపాత్రుడుమద్యం కుంభకోణం విలువ ప్రభుత్వం చెబుతున్న రూ. 3,200 కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ. 10 వేల కోట్లు ఉండే అవకాశం ఉందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై సమగ్రమైన, పారదర్శకమైన విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## మచిలీపట్టణం ప్రభుత్వ ఆసుపత్రి -వైద్యం కన్నా.. వింతలే ఎక్కువ!

మచిలీపట్నం
(ప్రజా భూమి ప్రతినిధి)



పారిశుధ్య కార్మికులే పాలకులు.. సెక్యూరిటీ గార్డులే వైద్య సహాయకులు!మచిలీపట్టణం: జిల్లా ప్రధాన ఆసుపత్రి సమస్యల నిలయంగా మారింది. అర్హత గల నిరుద్యోగులను పక్కన పెట్టి, పైరవీల తో వచ్చిన వారికే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఆసుపత్రిలో అరాచక పాలన - ప్రధానాంశాలు: వైద్య పనుల్లో సెక్యూరిటీ సిబ్బంది: పోస్టుమార్టం నుంచి రోగులకు కట్లు కట్టడం, కుట్లు వేయడం వరకు సెక్యూరిటీ సిబ్బందే నిర్వహిస్తుండటం గమనార్హం.

అడ్మినిస్ట్రేషన్‌లో శానిటేషన్ వర్కర్లు: ఓపీ రిజిస్ట్రేషన్లు, ఆఫీసు కంప్యూటర్ పనులు, చివరికి టీచింగ్ కళాశాల అడ్మిన్ పనుల వరకు పారిశుధ్య కార్మికులే పెత్తనం చెలాయిస్తున్నారు. అర్హతకు పాతర: డిగ్రీలు చదివిన వారు సఫాయి పనులు చేస్తుంటే, కనీసం పదవ తరగతి కూడా పూర్తి చేయని వారు సూపర్వైజర్లుగా చలామణీ అవుతున్నారు. సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగితే అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.అధ్వాన్నంగా మౌలిక వసతులు:నెలకు సుమారు 50 వేల మంది రోగులు వచ్చే ఈ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. టాయిలెట్ల కటకట: ఎమర్జెన్సీ విభాగం వద్ద రెండు టాయిలెట్లు ఉంటే, ఒకటి ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. స్కానింగ్ కోసం వచ్చే వందలాది మంది రోగులు గంటల తరబడి వేచి చూసి, టాయిలెట్ కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.పత్తాలేని రివ్యూ మీటింగ్ లు - నిమ్మకు నీరెత్తిన అధికారులు:రాష్ట్రంలోనే బెస్ట్ ఆఫీసర్ అని పేరు తెచ్చుకున్న జిల్లా అధికారి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఆసుపత్రి సమస్యలపై ఒక్క రివ్యూ మీటింగ్ కూడా నిర్వహించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (HDS) లేకపోవడం వల్ల చిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు.

# వరుపుల రాజాకు ఏలేశ్వరంలో ఘన నివాళి



ప్రజాభూమి ప్రతినిధి – ఏలేశ్వరం

దివంగత ప్రతిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్, ఆప్కాబ్ వైస్ చైర్మన్ వరుపుల రాజా మూడో వర్ధంతిని ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో టిడిపి శ్రేణులు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఏలేశ్వరం పట్టణములో బొదిరెడ్డి గోపి బోదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా బొదిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ దివంగనత వరుపుల రాజా పేద ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని అన్నారు అంతేకాక ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతిపాడు గ్రామంలో పేద ప్రజలకు వైద్య సహాయం నిమిత్తం ప్రత్యేక కార్యక్రమాలతో పాటు వారికి అత్యున్నత వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులతో సహా అందించే వారన్నారు. అలాగే ప్రముఖ కంటి వైద్య నిపుణులతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేదలకు కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించే వారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ మోదీ నారాయణస్వామి మాట్లాడుతూ వరుపుల రాజా తనకు అత్యంత సన్నితుడని ఆయన లేని లోటు వర్ణించలేదని అన్నారు ఆయన ప్రతి సంవత్సరం విద్యార్థులకు జరిగే వార్షిక పరీక్షలకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు పెన్నులు పెన్సిళ్లు అందించే వారన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు రాజాకు ఆత్మ శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి అనంతరం స్థానిక ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పాలు పంచారు. అదేవిధంగా ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ వైభోగుల సుబ్బారావు ఆధ్వర్యంలో దివంగత నేత వరుపుల రాజా చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వరుపుల రాజా ప్రత్తిపాడు నియోజవర్గంలో శంఖవరం ఏలేశ్వరం రౌతులపూడి ప్రత్తిపాడు మండలాల పరిధిలో ఉన్న పేద ప్రజలకు ప్రతి సంవత్సరం చేసే సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా స్మృతించుకున్నారు. ఆయన చేసిన అనేక సేవా కార్యక్రమాలలో ప్రజలు ఎంతో మంది లబ్ధి పొందాలని వైభోగుల వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన వాకాడ కనకరాజు అప్పారావు కోరాడ శివ రేఖ గంగాధర్ సుంకర రాజు ముప్పల ముప్పల గంగరాజు కాటమస్వామి పి సోమరాజు షేక్ సత్తార్ బాబు వాకాడ రాజా కేసును గుర్తు వీరబాబు కూరకూర చంటి పెనుగొండ శ్రీను సేనాపతి సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## చంద్రగ్రహణ ప్రభావం... బుధవారం రంగుల హోలీ సందడి



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

హోలీ పండుగ హిందువుల ముఖ్య పండుగలలో ఒకటి. వసంత ఋతువుకు స్వాగతంగా చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకునే ఉత్సవం ఇది. చంద్రగ్రహణం ప్రభావంతో మంగళవారం హోలీ పండుగ రోజు అయినప్పటికీ ఆగిరిపల్లి మండలంలో ఎవరూ పెద్దగా వేడుకలు నిర్వహించలేదు. స్థానికులతో పాటు పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు కూడా గ్రహణాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం పండుగను జరుపుకోలేదు. అంతేకాక ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతుండటం, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యం లో ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు పండుగకు దూరంగా ఉన్నారు. అయితే బుధవారం ఆగిరిపల్లి గ్రామ సమీపంలోని శోభనాపురం వెళ్లే దారిలో ఉన్న ప్లైవుడ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకుంటూ ఆట పాటలతో ఉత్సాహంగా రోజంతా సందడి చేశారు.

## హెల్మెట్ దరిద్దాం.. ప్రాణాలను కాపాడుదాం: ఎస్ఐ శుభ శేఖర్



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆగిరిపల్లి ఎస్సై శుభ శేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి నుండి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం నిర్వహించిన హెల్మెట్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదం జరిగినా తీవ్ర గాయాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై వివరాలు తెలియజేసి, రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, కుటుంబ సభ్యుల భద్రత కోసం అయినా హెల్మెట్ ధరించే అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రోజా రమణికి ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు

పాలకొల్లు పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, టిడిపి రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి కి ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆ వివరాలను స్థానిక విలేకరులకు అవార్డు గ్రహీత రోజా రమణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలకు స్త్రీ శక్తి పురస్కారంగా ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. అంతర్ జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకుని విజయవాడ విశ్వ సాహితీ కళావేదిక వ్యవస్థాపకురాలు కొల్లి రమాదేవి సారధ్యంలో ఈ అవార్డు ఎంపిక జరిగినట్టు తెలిపారు. అవార్డును అవార్డును ప్రముఖ గజల్స్ గాయకుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందు కున్నట్లు అవార్డు గ్రహీత రోజా రమణి తెలిపారు. కాగా రోజారమణి కి అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగులకు బాకీ ఉన్న రూ 35 వేల కోట్ల చెల్లింపునకు రోడ్డు మ్యాప్ ప్రకటించాలి



ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు

ఎస్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఫ్యాప్టో చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ ఈరోజు పాలకొల్లు పట్టణంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలలను సందర్శించి వివిధ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ అకౌంట్ లో కేటాయించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీలలో అర్బన్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులను నియమించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో పాటు సమానంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు ఏప్రిల్ మే నెలలోనే చేపట్టాలని ఉపాధ్యాయ ఉద్యోగులకు బాకీ ఉన్న 35 వేల కోట్ల రూపాయల చెల్లింపుకు రోడ్డు మ్యాప్ ప్రకటించాలని 12వ పిఆర్సి కమిటీని నియమించాలని పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టియు జిల్లా అధ్యక్షులు సాయి వర్మ .ప్రధాన కార్యదర్శి డి.రాజకుమార్ పాలకొల్లు పట్టణశాఖ కార్యవర్గ సభ్యులు డి .రాంబాబు, ఎం. విక్రాంత్ విజయ్,జె . నాగేశ్వరరావు,టీ. చిన బాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు

## అన్నవరం గ్రామంలో పర్యటించిన ముద్రగడ

### ఏబీఎన్ విలేకరి డేగల చిన్నబాబు కి ముద్రగడ గిరిబాబు ఘన నివాళి



ప్రజాభూమి ప్రతినిధి – అన్నవరం

శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఏబీఎన్ న్యూస్ ప్రముఖ విలేకరి డేగల చిన్నబాబు ఇటీవలే గుండెపోటుతో అకాల మరణం చెందడం పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం వారి నివాసానికి వెళ్లిన ముద్రగడ గిరిబాబు చిన్నబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శంకవరం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరాల శ్రీనివాస్ యాదవ్ స్థానిక వైసీపీ నాయకులు,కార్యకర్తలు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## పోతులూరు గ్రామంలో రేఖ సూర్యారావు కుటుంబాలను పరామర్శించిన వై సి పి నాయకుడు మురళిరాజు



ప్రజాభూమి ప్రతినిధి – ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామంలో రేఖ సూర్యారావు ఇటీవల కాలం లో అకాల మరణం చెందినారు సూర్యారావు భార్య సత్యవతి ని,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి ఆ నిరుపేద కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి ఆ నిరుపేద కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వైసిపి నాయకులు ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి కృష్ణంరాజు బుధవారం భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని మురళీకృష్ణం రాజు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పోతులూరు సర్పంచ్ బొండి రాంబాబు శెట్టి సత్తిబాబు ,ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు ,చెక్కపల్లి నాగేశ్వరరావు ,ఎలుగుబంటి బాబ్జి ,మాజీ ఉప సర్పంచ్ పంచాది చంటిబాబు మాజీ ఎంపీటీసీ రేఖ కృష్ణ ,చీప్సి నాగేశ్వరరావు ,ముప్పిడి కృష్ణ ,మాది నాగేశ్వరరావు గ పలివెల రామ్మోహన్ ,కోలా తాతబాబు ,యాళ్ల ఏసు దాడి పుత్రయ్య అంబటి గణేష్ వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తాళ్లపూడిలో అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి

తాళ్ళపూడి మండల కేంద్రంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి జయంతి సందర్భంగా నేయి, పాలాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుండి ఆలయ ప్రాగణమంతా అయ్యప్ప శరణు ఘోష తో మారుమ్రోగింది. ఆలయ అర్చకులు మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం, అయ్యప్ప స్వామి జననం తమిళ మాసం పంగుని లో పవిత్రమైన రోజు అయిన పంగుని ఉథిరం పౌర్ణమి రోజు అయ్యప్పస్వామి జయంతి జరుపుకుంటారన్నారు. ఈరోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని, అనంతరం అన్నప్రసాత వితరణ జరిగిందన్నారు.

## రావులపాలెం మండలంలో అక్షరాంధ్ర ప్రీ-ఫైనల్ పరీక్షలు నిర్వహణ



ప్రజాభూమిప్రతినిధి – కొత్తపేట

మండలంలోని అక్షరాస్యత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అక్షరాంధ్ర సెంటర్లలో బుధవారం ప్రీ–ఫైనల్ పరీక్షలు విజయవం తంగా నిర్వహించబడ్డాయి. రావుపాలెం మండలం పరిధిలోని మొత్తం 230 అక్షరాంధ్ర సెంటర్ల లో 2300 మంది లెర్నర్స్ ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈతకోట, వెదిరేశ్వరం గ్రామాల్లో నిర్వహించిన పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా, లెర్నర్స్‌కు అవసరమైన సదుపాయాలు ఉన్నాయా అనే అంశాలను ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చిన ఎంపీడీఓ, అక్షరాస్యత ద్వారా ప్రజల్లో విద్యా చైతన్యం పెరుగుతుందని తెలిపారు. మండలంలో అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా మరింత మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో లెర్నర్స్ ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది. స్థానిక అధికారులు, సిబ్బంది పరీక్షల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాభూమిప్రతినిధి – కొత్తపేట

రావులపాలెం మండలం రావులపాడు గ్రామ పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక సమాచారం ఆధారంగా తనిఖీలు నిర్వహించిన పోలీసులకు ఏపీ39టిజే8358 నంబరు గల బడా దోస్తు వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో సోదా నిర్వహించారు. సోదాలో భాగంగా వాహనంలో సుమారు 2,000 కిలోల అక్రమ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు ఆ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వీరేంద్ర సిద్దుపై కేసు నమోదు చేసినట్లు రావులపాలెం ఎస్సై జి. చంటి తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ ఘటనతో ప్రాంతంలో అక్రమ రేషన్ బియ్యం రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిసింది.

# కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్‌లో జెసి నిశాంతి




ప్రజాభూమి ప్రతినిధి – అమలాపురం

క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాదని, అవి ఆరోగ్యకరమైన జీవన శైలికి, సమన్వయానికి, నాయకత్వ లక్షణాలకు ప్రతీకలని జిల్లా జాయింట్ కలెక్టర్ .టి నిశాంతి అన్నారు. డాక్టర్ కార్తీక్ రెడ్డి ,జిల్లా వైద్య సేవలసమన్వయ అధికారి ఆధ్వర్యంలో కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్ 2026 కోనసీమ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందితో గత నెల 15, 16 అంబాజీపేట కేంద్రంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు అదేవిధంగా గత నెల 21, 22 తేదీల్లో స్థానిక జిఎంసి బాల యోగి స్టేడియం నందు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను విజేతలకు పంపిణీ చేశారు. అమలాపురం నుండి డా కారెం రవితేజ మరియు టీమ్ క్రికెట్ మరియు షటిల్ లో ప్రథమ స్థానం పొందారు టీ కొత్తపల్లి నుండి డా విజయ్ మనోజ్ గారు అండ్ టీమ్ షటిల్ మరియు ఆయన కెప్టెన్సీ లో క్రికెట్ లో రన్నర్స్ గా నిలిచి బహుమతులు గెలిచారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ హెల్త్ వారియర్స్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహు మతులు అందజేయడం నాకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని కలిగించింద న్నా రు. క్రీడారంగంలో ప్రతిభను చాటడంతో పాటుగా ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న హెల్త్ వారియర్స్ ప్రతి రోజూ సమాజ ఆరోగ్యం కోసం కృషి చేస్తూ ఆరోగ్య కర సమాజ స్థాపన దిశగా ముందుకు సాగాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢ త్వాన్ని, మానసిక ఉల్లాసాపెంపొందించుకోవడం ఎంతో శ్రేయస్కర మన్నారు ఈ స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహ కులకు ప్రత్యేక అభినందనలు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేత లేనని బహుమతులు పొందిన వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మీ కృషి, క్రమశిక్షణ, పట్టు దల అందరికీ ఆదర్శం కావాలన్నారు. ముమ్ముందు కూడా ఇలాంటి క్రీడా కార్య క్రమాలు మరింత ఉత్సా హంగా నిర్వహించి, ఆరోగ్య వంతమైన కోనసీమ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు ఆరోగ్యం క్రీడల కోనసీమ సంస్కృతిని కలగలిపి ఈ హెల్త్ వారియర్ ఈవెం ట్ను నిర్వహించిన అధికారులు, స్పోర్ట్స్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలను ప్రత్యేకంగా ఆమె అభినందిచారు. ఈ క్రీడా మీట్ ద్వారా కోనసీమ లోని ప్రతి గ్రామం, ప్రతి మండలం, ప్రతి కుటుంబం ఆరోగ్య కరమైన జీవనశైలి కి, క్రీడా స్ఫూర్తికి, సమైక్యత కు ప్రాధాన్యత ఇస్తు న్నామ నే విషయం సంతృప్తికరం గా ఉందన్నారు. హెల్త్ వారియర్లు అందరూ ఈ కార్యక్రమంలో ప్రత్యేక స్థానం పొందడం గర్వంగా ఉంది. ఈ కార్యక్రమం కేవలం ఠీవీ ప్రదర్శన కాదని కానీ ఆరోగ్యం, క్రీడలు, సమాజప్రేమ, సేవాభావం అనే విలువలను సమూహంగా ఇంటింటి వద్దకు తీసుకెళ్లే ప్రయత్నమన్నారు ఈ బహుమతులు పొందే ప్రతి క్రీడాకారుడు, ప్రతి హెల్త్ వారియర్, ప్రతి స్వయం సేవకుడు కోనసీమ యువతకు స్ఫూర్తి దాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య సేవలు సమన్వయ అధికారి డాక్టర్ కే కార్తీక్ రెడ్డి, డాక్టర్ దయానా మరియు ఇతర వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు,

# వైభవంగా శ్రీరామచంద్రుడు పెళ్ళికొడుకు అయిన వేళ

**ప్రజాభూమిప్రతినిధి-వి.ఆర్.పురం**

శ్రీరామచంద్రుడే పెండ్లికొడుకు, శిరులోలికే సీతమ్మే పెళ్ళికూతురు, అందాల రాముని పెళ్లి కుమారునిగా, అపురూప జానకిని పెళ్లికూతురుగా చేసిన శుభదినం బుధవారం మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శబరీ గోదావరి సంఘము తీరంలో శ్రీరామగిరి గ్రామం వద్ద గల కొండపైన వెలసియున్న శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి ఆలయం వద్ద, ఆలయ చైర్మెన్ పెందుర్తి సుదర్శన రావు మరియూ కమిటీ సభ్యుల ఆద్వర్యంలో భక్తుల హాశద్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున, శాస్త్రోత్తంగా ప్రతి ఏటా ఈ వేడుకను నిర్వహిస్తారు, మంగళవారం చంద్రగ్రహణం రావటంతో, మరుసటి రోజు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు సౌమ్యత్రి పురుషోత్తమాచార్యులు వేద మంత్రాలతో శ్రీరామచంద్రస్వామిని పెళ్ళికొడుకుగా, సీతమ్మ తల్లిని పెళ్లికూతు





రును చేశారు. అనంతరం అందాల రామునికి, అపురూప జానకి లకు వసంతోత్సవాన్ని, డోలోత్సవాన్ని, ఉయ్యాల సేవ తదితర కార్యక్రమాలను భక్తుల హర్షద్వానాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు మహోత్సవం సందర్భంగా మండలంలోని భక్తజనులు అందరూ వేకుజామున శబరి గోదావరి సంఘము తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించి శ్రీరామగిరి గ్రామంలోని రాములవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అనంతరం ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రధాన అర్చకులు దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ భక్తుల రామ నామ స్మరణల మధ్య అంగరంగ వైభవంగా రామయ్యను పెళ్ళికొడుకు గాను, సీతమ్మను పెళ్లికూతురు చేసి ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగ నిర్వహించారు. ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సౌమితి పురుషోత్తమా చార్యులు మాట్లాడుతూ శ్రీరామచంద్ర స్వామిని పెళ్ళికొడుకు గాను, సీతమ్మ తల్లి కూతురు గాను చేయటం పూర్వకాలం నుండి వస్తున్న ఆచారం అని, ఈరోజున పెళ్లి స్వామివారిని కొడుకుగాను, సీతమ్మతల్లి నీ పెళ్లి కూతుర్ని చేసి పెళ్లి పనులను ప్రారంభిస్తారని, పసుపు దంచుడు, పందిరి రాటలు వేయటం, ఆలయానికి వెల్లలు వేయటం తదితర కార్యక్రమాలను ఈరోజునే చేస్తామని ఆయన తెలిపారు.

## లక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మించాలి



**ప్రజాభుమి ప్రతినిధి-ఏటపాక**

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ లేక పశువులు ఆసుపత్రి ప్రాంగణంలోకి వెళ్లి ఆసుపత్రి వాతావరణాన్ని పాడు చేస్తున్నాయని చింతూరు ఐ టి డి ఏ పి ఓ కు వినతి పత్రం అందించడం జరిగింది. తక్షణమే స్పందించి ఆస్పత్రి గోడ నిర్మాణం ఏర్పాటు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి కనితి మధు , మాజీ సర్పంచ్ పెనుబల్లి సీతయ్య, కురుసం ముత్తులు, పెనుబల్లి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాదన సమితి లక్ష్యం వారిది సాధన.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

వారిది సాధనే ప్రధాన ధ్యేయంగా బిజెపి లక్ష్యంగా పనిచేస్తుందని వారధి సాధన సభ్యులు పేర్కొన్నారు.వారధి సాధనా సమితి అధ్యక్షులు సలాది సతీష్ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జగన్నాయకులుపాలెం గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ గ, వేలంపాలెం గ్రామ సర్పంచి టేకుమూడి సుజాత వీర వెంకటసత్యనారాయణ లను కలిసి ఆయా పంచాయతీలలో వారధి నిర్మాణానికి అనుకూలంగా తీర్మానం చేయించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో హసన్ బాధ గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు , రామచంద్రపురం బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ , బిజెపి సీనియర్ నాయకులు వాడ్రేవు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సర్పంచ్లు మాట్లాడుతూ ఈ వారధి ప్రజలకు చాలా అవసరమైనదని కావున పంచాయతీ ప్రెసిడెంట్లు అంతా తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు జగన్నాయకుల పాలెం సర్పంచ్ అని శెట్టి రామకృష్ణ కూడా తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ, తప్పక తీర్మానం చేయిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు . ఈసందర్భంగా వీరికి బిజెపి వారిది సాధన సమితి ధన్యవాదాలు తెలిపింది.

# కొమరాజులంకలో విజిబుల్ పోలీసింగ్ పల్లె నిద్ర

### పాల్గొన్న పట్టణ సిఐ శేఖర్ బాబు, ఎస్సై చంటి.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

పోలీసులు జిల్లావ్యాప్తంగా 'విజిబుల్ పోలీసింగ్' పల్లె నిద్ర కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిరంతరంగా అమలు చేస్తు న్నారు. రావులపాలెం మంగళవారం కొమరాజులంక గ్రామం నందు జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో రావులపాలెం పట్టణ సిఐ శేఖర్ బాబు, ఎస్ఐ చంటి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ శేఖర్ బాబు మాట్లాడుతూ కొమరాజులంక గ్రామంలో ప్రజలు ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నారని, ఇలాంటి విధానాన్ని కొనసాగించాలని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఎదుర్కొంటున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి మోటార్ సైకిల్ నడపవద్దని, మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వవద్దని అన్నారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరు. విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. అలాగే సోషల్ మీడియా వేదికగా యువత కులాలు, మతాలు మధ్య రెచ్చగొట్టే విధముగా పోస్టులు పెద్దవద్దన్నారు. అలా చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. రహదారి ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. శాంతి భద్రతలు



మరింత పటిష్టంగా కొనసాగాలంటే ప్రజల సహకారం అవసరమని పట్టణ సిఐ శేఖర్ బాబు తెలిపారు. భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు లేదా, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే 9440796567 నెంబరు గానీ లేదా డయల్ 112 కు గానీ సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జీలుగుమిల్లి మండలంలో ట్రాన్స్ఫార్మరుల దొంగల హల్చల్

**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

ఏజెన్సీ ప్రాంతంలో తరసు ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. రైతులు విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. దొంగలు మాత్రం తమ పని దివ్యంగా పూర్తి చేసుకుంటున్నారు. చేతి కొచ్చిన పంట నేల పాలవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఎవరికి వారే ట్రాన్స్ఫార్మర్లు కాపాడు కోవలసిన పరిస్థితి నెలకొంది. జంగారెడ్డిగూడెం డివిజన్లో పలువురు దొంగలను పట్టుకుని కేసులు నమోదు చేయించి అరెస్టులు కావించిన యధావిధిగా దొంగతనాలు జరుగుతున్నాయి అంటే ఏజెన్సీ ప్రాంతంలో పరిస్థితి ఎంత



గడ్డుగా ఉందో అర్థం అవుతుంది. నేటి రాత్రి రాచన్నగూడెం గ్రామ లో ట్రాన్స్ఫార్మర్లు ఎత్తుకెళ్లడంతో ఎవరికి వారే చేదోడువాదోడుగా విన్నపాలు చేస్తున్నారు. ప్రజలకు విన్నపం మనచుట్టుపక్కల ఉన్నాపొలాలలో కరెంట్ ట్రాన్స్ఫుర్మార్ లో వున్న వైర్లను దొంగలించడానికి దొంగలు వచ్చివున్నారు. కామయ్యపాలెంలో రెండు ట్రాన్స్ఫుర్మార్లు దొంగిలించబడినవి కాబట్టి రైతులు దీనిని గమనించి కొంచం మీ ట్రాన్స్ఫార్మర్ లను మీ అబ్జార్వేషన్లో వుండండి. కొత్తవారు ఎవ్వరైనా తిరుగుతున్నారో గమనించండి. మన కరెంట్ ట్రాన్స్ఫార్మర్లను మనమే కాపాడుకుందాం, జరగరానిది ఏదైనా జరిగేతే వెంటనే విద్యుత్ వారికి సంప్రదించండి. ఈ ట్రాన్స్ఫార్మర్ ముఠాలను పట్టుకొని మా పంటలను కాపాడాలంటూ గిరిజనులు ఏకరు పెడుతున్నారు.

### ప్రత్తిపాడులో వరుపుల రాజా

# మూడవ వర్ధంతి సందర్బంగా పలు సేవా కార్యక్రమాలు

**ప్రజా భూమి ప్రతినిధి-ప్రత్తిపాడు**

దివంగత టీడీపీ నేత,ఆప్కాబ్ మాజీ వైస్ చైర్మన్ వరుపుల రాజా 3 వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూటమి నాయకులు ,రాజన్న అభిమానులు బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి లో ఆయన స్మృతి ఘాట్ వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, వారి తనయుడు చిరంజీవి సాయి తర్షిత్, కుటుంబ సభ్యులతో,టీడీపీ నాయకులు కార్యకర్తల తో కలిసి ఘన నివాళులు అర్పించారు. ,ప్రత్తిపాడులో ఉన్న రాజా విగ్రహానికి కూటమి శ్రేణులతో కలిసి రాజా తనయుడు సాయి తర్షిత్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో రాజన్న యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సాయి తర్షిత్ ప్రారంభించి పేదలకు భోజనం వడ్డించారు.అలాగే 200 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా యువ నాయకులు



వెలుగుల నాని,అంబటి బుజ్జి, బొండాడ నారాయుడు,శెట్టిబత్తుల వీరబాబు మాట్లాడుతూ పేదలకు అన్నదానం,విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ,ఉచిత మెగా వైద్య శిబిరాలు,రక్తదాన శిబిరాలు వంటి పలు సేవా కార్యక్రమాల ద్వారా పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు.

రాజన్న ఆశయాలే లక్ష్యంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా నియోజ కవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నారన్నారని తెలిపారు .రాజన్న ఆశయాలు పూర్తిగా నెరవేరాలన్నా, నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందాలన్నా సుదీర్ఘ కాలం పాటు సత్యప్రభ రాజా ఎమ్మెల్యేగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ఏలేరు ప్రాజెక్ట్ చైర్మన్ బస్వా వీరబాబు,సిబిఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,యువ నాయకులు బొల్లు చిన్నోడు,బొండాడ నారాయుడు,సీనియర్ నాయకులు మంతెన వెంకట రమణ,యర్రాబత్తుల గోవిందు నాయుడు, లొండ లోవరాజు,మిరియాల శ్రీను,అడ్డాల త్రిమూర్తులు,ఇళ్ల అప్పారావు,పోల్నాటి భగవాన్,ముప్పనబోయిన ఏసుబాబు, శెట్టిబత్తుల నాని తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో గాంధీ మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం, రక్త దాన శిబిరం సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పాలకొల్లు లోని అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వచ్చి ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొని, పేదలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ముందుగా గాంధీ మెగా ఫౌండేషన్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ప్రారంభించారు. అదేవిధంగా రక్తదాన శిబిరం లో సిఐ కోల రజని కుమార్, సిబ్బంది పాల్గొని స్వయంగా రక్తదానం చేశారు.

**ఉచిత కళ్ళజోళ్ళు అందిస్తాం:: గాంధీ భగవాన్ రాజు::**

గాంధీ మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షల్లో పేదలకు కళ్ళజోళ్ళు అవసరమైతే కళ్ళజోళ్ళు తమ ఫౌండేషన్ తరపున ఉచితంగా అందజేస్తామని గాంధీ మెగా ఫౌండేషన్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభవన్రాజు తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రామస్తులను ఆయన కోరారు.

**గాంధీ మెగా ఫౌండేషన్ సేవలు అభినందనీయం: సి ఐ రజిని కుమార్**

గాంధీ మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవని పాలకొల్లు పట్టణ సీఐ కోలా రజిని కుమార్ అన్నారు. గాంధీ మేఘ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తసంబంధం శిబిరంలో ఆయన పాల్గొని స్వయంగా రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి పాలా శ్రీనివాస్, ఎస్సైలు జి జె ప్రసాద్, జి పృద్వి, గ్రామ పెద్దలు, గొట్టు ముక్కల శ్రీనివాసరాజు, వేగేసిన శ్రీహరి రాజు, ఉనికిల నాగేశ్వరరావు, జెపి, నున్న బోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



### ఈతకోటలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి

## రక్షణ గోడ నిర్మించాలని విజ్ఞప్తి



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి సమీపంలోని కొత్త సెంటర్లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద రక్షణ గోడను నిర్మించాలని భక్తులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆలయానికి ఆనుకుని రక్షణ గోడ ఏర్పాటు చేస్తే భక్తులకు మరింత భద్రత కలుగుతుందని వారు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఉగాది, దసరా, విజయదశమి నవరాత్రుల సమయంలో ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ప్రక్కన రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణం స్పందించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు.

## మల్లికార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు

**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**

ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని సుప్రసిద్ధ శ్రీ శోభనాచలుని గట్టు పై ఉన్న స్వయంభూ శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయంలో బుధవారం స్వామివారికి విశేష పూజలు ఘనంగా నిర్వహించబడినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. సాయి తెలి పారు.పాల్గొన్న మాసం బహుళ పాడ్యమి సందర్భంగా ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, పంచామృత ఫలాభిషేకం, స్నపన అలంకరణ, సహస్రనామార్చన వంటి ప్రత్యేక ఆర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆలయ అర్చ కులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



## మంగళగిరి శిక్షణా తరగతులకు తరలివెళ్లిన టీడీపీ పార్టీ శ్రేణులు


### -జెండా ఊపి వాహానాన్ని ప్రారంభం.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు బయలుదేరి వెళ్లే వాహనాన్ని వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపు, ప్రభుత్వ పథకాలపై స్పష్టమైన అవగాహన, ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచడం లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక రాజకీయ పరిస్థితుల్లో సోషల్ మీడియా వినియోగం, బూత్ స్థాయి బలోపేతం, ఎన్నికల వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు అందజేయబడతాయని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డుకు చేర్చే బాధ్యత క్లస్టర్ ఇన్చార్జిలదేనని, శిక్షణ ద్వారా వారికి మరింత స్పష్టత, ధైర్యం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు పాల్గొనడం పార్టీ పట్ల ఉన్న అంకితభావాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.శిక్షణా తరగతులకు హాజరవుతున్న వారిలో నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ,కంచుమర్తి బాబురావు,పెంకె సాంబశివరావు చెల్లి గోపాలకృష్ణ, పలివెల ప్రకాష్,వనుం వీరబ్రహ్మం,పలివెల రాజు,సలాది సాయిబాబా,సలాది పట్టాభిరామయ్య,మరివాడ సూరిబాబు, ఉండవల్లి శివ, చందమామ వాసు, కవల నానాజీ, గేదల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక




**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

బాల్య వివాహాలు నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చైల్డ్ మారేజి ఫ్రీ ఇండియా 100 రోజుల కార్యక్రమంలో భాగంగా తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఐ.సి.డి.ఎస్ అద్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన లీగల్ ప్రొటెక్షన్ అధికారిణి శ్రీగౌరీ, జిల్లా ప్రొటెక్షన్ అధికారి అనంత్ ప్రదీప్, సీడీపీవో నాగలక్ష్మి తదితరులు మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు గ్రామ స్థాయిలో కమిటీలు వేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఫోక్స్ యాక్ట్, గృహహింస చట్టం, చైల్డ్ మ్యారేజి యాక్ట్ గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలు, మాతృ మరణాలు, శారీరక, మానసిక ఇబ్బందులు గురించి వివరించారు. వివాహ వయస్సు రాకుండానే సాంప్ర దాయాల పేరుతో చుట్టరికాలని వంకతో బాల్యంలోనే వివాహాలు జరిపే పరిస్థితులను గుర్తించి చట్టం దృష్టిలోకి తీసుకు రావాలని, చిన్న పిల్లలను మాయ మాటలు చెపి మోసం చేసే సంఘటనలను గుర్తించి ప్రొటెక్షన్ సెల్ దృష్టికి తీసుకు రావా లని తెలిపారు. బాల్య వివాహాలు లేని సమాజం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసు కుంటుందని, దానిలో భాగంగానే అందరికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు కేంద్రాల టీచర్లు ఆయాలు, ఉమెన్ పోలీస్ రమాదేవి, మలకపల్లి, తాళ్లపూడి సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# సడ్లపల్లి చెరువులో అర్ధరాత్రి మట్టి దందా

### -అడ్డుకున్న మహిళలు - నిరసన -తరలింపుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఎస్. సడ్లపల్లి చెరువు వద్ద మంగళవారం అర్ధరాత్రి వేళ పెద్ద ఎత్తున టిప్పర్లు, లారీలతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం స్థానికుల్లో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మహిళలు భారీగా చెరువు వద్దకు చేరుకుని వాహనాలకు అడ్డంగా నిలిచి మట్టిని తరలించకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆరోపించారు. ఎటువంటి అనుమతులు లేకుండా లక్షల రూపాయల విలువైన మట్టిని రాత్రివేళల్లో తరలిస్తూ కొందరు అక్రమార్జనకు పాల్పడుతున్నారని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ వ్యవహారానికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాగా మట్టి తరలింపు కారణంగా తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వందలాది టిప్పర్లు, లారీల రాకపోకలతో భారీ శబ్దాలు వస్తున్నాయని, దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారని మహిళలు తెలిపారు. అదేవిధంగా మట్టి తవ్వకాల వల్ల ఎగిసే దుమ్ము, ధూళి ఇళ్లల్లోకి చేరి శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.





"తక్షణమే నిలిపివేయాలి" : చెరువుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, తక్షణమే అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను ఆపాలని మహిళలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అధికారుల స్పందనపై ఎదురుచూపు : ఈ ఘటనపై రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు, పోలీస్ శాఖ స్పందించి చెరువు వద్ద పరిస్థితులను సమీక్షించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఇలాంటి అక్రమ తవ్వకాలను కఠినంగా అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రైవేటు రంగ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

### -రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్టార్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఈపీఎఫ్ 95 పెన్షనర్స్ కు అనుకూలంగా తీర్పు చెప్పినా ప్రభుత్వాలు వాటి అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా పెన్షనర్లను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్ లో పెరిగిన నిత్యవసరాలకు అనుగుణంగా డీఏ పెంచాలని కోరారు. అదేవిధంగా ఈపీఎఫ్ 95 పెన్షన్ దారులకు నెలకు కనీసం రూ.9 వేలు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, ఉచిత వైద్య సేవల సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా బకాయి ఉన్న అరియర్స్ పెన్షన్లు చెల్లించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు రైళ్ల ప్రయాణంలో రాయితీలు కల్పించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఇస్మాయిల్, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభ

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండల కేంద్రంలోని పాద సచివాలయం వద్ద బుధవారం 18వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డిఆర్పి భారతి మాట్లాడుతూ 2024 25 26 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ ద్వారా చేసినటు వంటి హార్టికల్చర్, ఫారం పాండు, ఫారెస్ట్ నర్సరీ, బౌండరీ ప్లాంటేషన్, చెరువు, కాలువలలో పూడికతీత, కందిక కందకాలు, పశువుల షెడ్లు, సీసీ రోడ్లు వివిధ పనులను వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏపీఓ తులసి ప్రసాద్, పంచాయతీ సెక్రెటరీ మల్లికార్జున, కంప్యూటర్ ఆపరేటర్ రహంతుల్లా, బి ఎఫ్ టి రామాశీజుల రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు వి రామతుల సమ్మ, నాగ తేజేశ్వర్ రెడ్డి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## హిందూపురంలో కోతుల పట్టివేత

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో గత కొన్ని వారాలుగా కోతుల బెడద తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను అపహరించడం, చిన్నారులు, వృద్ధులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు బుధవారం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో త్యాగరాజు నగర్, మోతుకపల్లి, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కోతులను పట్టుకునే కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 92 కోతులను పట్టుకుని బంధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టుకున్న కోతులను అటవీ శాఖ మార్గదర్శకాల ప్రకారం అడవిలో విడిచిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు మున్సిపాలిటీ చర్యలను అభినందించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలు కూడా కోతులకు ఆహారం వేయకుండా, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్ పెక్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు పూర్తి కావాలి : ఏపీ జెన్కో ఎండీ పీ పుల్లారెడ్డి

### జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు పరిశీలించిన జెన్కో ఎండీ

ప్రజాభూమి ప్రతినిధి,పోలవరం:

పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాలని ఏపీ జెన్కో ఎండీ పీ పుల్లారెడ్డి అన్నారు. పోలవరం నీటిపారుదల ప్రాజెక్ట్ పూర్తి అయ్యే సమయానికి జల విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం కావాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు చేపట్టాలని నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ కు సూచించారు. పనుల పురోగతిని అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, అనుకున్న ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయో లేదో సమీక్షించాలన్నారు. బుధవారం పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ ప్రాంతాన్ని జెన్కో థర్మల్, హైడెల్ డైరెక్టర్స్ ఎం. సుజయ్ కుమార్, పీ. అశోక్ కుమార్ రెడ్డి, సివిల్ విభాగం చీఫ్ ఇంజనీర్ పీ రవీంద్ర రెడ్డి, హెచ్పీసీ చీఫ్ ఇంజనీర్ ఎస్ విశ్వేశ్వర రావు, ఎస్ఈ లు చంద్ర శేఖర్, సి హనుమ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం జెన్కో అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష, జెన్కో సీఎండీ పర్యటనలో ఎం ఈ ఐ ఎల్ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ప్రసేన్ జిత్ మజుందార్, జెన్కో అధికారులు భీమాదానారావు, రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం, రామ్ మోహన్, రమేష్ నాయుడు, వ్యాప్కోస్ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కొలగాని మూర్తి పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ తో పాటు, జల విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆయన వివరించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు. తానూ కూడా ప్రాజెక్ట్ పురోగతిని ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణం సమయంలో ఏవైనా అవాంతరాలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జల విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తి అయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరుతుందని, పంటలు, పరిశ్రమలకు పుష్కలంగా విద్యుత్ అందించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుతో పాటు, జల విద్యుత్ కేంద్రం ఒకే సమయంలో పూర్తి కావాలనే పట్టుదలతో ఉన్నారని అన్నారు. అందుకు అనుగుణంగా అందరూ పని చేయాలని అన్నారు. ఇప్పటి వరకు పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం జరుగుతున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా పుల్లారెడ్డి జల విద్యుత్ కేంద్రం ఎగువ భాగం, అప్రోచ్ ఛానల్, ఇంటేక్ పూల్ , నీటితో పాటు వచ్చే తేలియాడే ఘన వ్యర్థాలను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన ఇనుము గ్రిల్స్ పనులు, నీటి ప్రవాహాన్ని నియంత్రించి, పెన్‌స్టాక్ , స్పైరల్ కేసింగ్ వైపు మళ్లించే సివిల్ హైడ్రో-మెకానికల్ నిర్మాణాలు , జల విద్యుత్ కేంద్రం దిగువ భాగం, భారీ యంత్ర పరికరాల దిగుమతి, నిల్వ , అమరిక కోసం కేటాయించిన విభాగం, టర్బైన్ , జనరేటర్ యూనిట్ల నిర్వహణ, మరమ్మత్తుల కోసం వినియోగించే విభాగం, విద్యుత్ ఉత్పత్తి చేసే 11 యూనిట్స్, టర్బైన్ రన్నర్‌కు సమానంగా నీరు పంపిణీ చేయడానికి రూపొందించిన ప్రవేశ భాగం, స్పైరల్ కేసింగ్ , జనరేటర్ బ్యారెల్స్ , ఎలక్ట్రికల్ ప్యానెల్స్, కంట్రోల్ సిస్టమ్స్ అనుబంధ యంత్రాల కోసం చేపట్టిన నిర్మాణాలు, టర్బైన్ ద్వారా ఉపయోగించిన నీరు తాత్కాలికంగా నిల్వ ఉండే ప్రాంతం, ఉపయోగించిన నీటిని ప్రధాన నదీ ప్రవాహంలోకి తిరిగి పంపించే కాలువ నిర్మాణం మొదలైన వాటిని సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ల ఆవిష్కరణ..



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం రాఘవేంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (రైపర్ - అటానమస్) ఎన్.ఎస్.ఎస్ విభాగం, మై భారత్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. యువతలో నాయకత్వ లక్షణాలను, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీలను రైపర్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 'మై భారత్' పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్న విద్యార్థులు అందరూ మార్చి 5వ తేదీన ఉదయం నిర్ణీత సమయానికి రైపర్ కళాశాలలోని పోటీ వేదికకు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డిడిఓ శ్రీనివాస్, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పద్మనాభ రెడ్డి, రైపర్ వైస్ ప్రిన్సిపాల్ డా. జె.రవీంద్ర రెడ్డి, జేఎన్టీయూఏ ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, మై భారత్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిసతి భరత్, మై భారత్ అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, రైపర్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.నాగశుభ తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ వైర్ వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న రైతులు



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలో వరుస కేబుల్ వైర్లచోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. కేబుల్ వైర్లతో పాటు, దేవాలయాలు, ఇళ్లలో కూడా దొంగతనాలు జరుగుతూ ఉన్నాయి. దీంతో రైతులతోపాటు ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. దీంతో దొంగలు పోలీసులకు సవాల్ విసిరినట్లు అవు తుంది. ఈ వారం రోజుల్లోనే దేవాలయం తో పాటు రైతుల పొలాల్లో కేబుల్ వైర్లు దొంగతనం జరిగాయి. సోమవారం రాత్రి పుట్లూరు మండల కేంద్రంలోని ఇద్దరు రైతుల పొలాల్లో, మంగళవారం పీ చింతలపల్లి గ్రామంలో ఒక రైతుకు చెందిన కేబుల్ వైర్ తో పాటు ప్రభుత్వానికి చెందిన త్రాగునీటి మోటార్ యొక్క కేబుల్ వైరు చోరీ చేయడం జరిగినది. పుట్లూరు పోలీస్ స్టేషన్ లో ఉండవలసిన కానిస్టేబు ళ్లు తక్కువగా ఉండడంతో ఉన్న కొంతమందినీ బందోబస్తుల కని వివిధ కారణాలతో బయటికి పంపుతూ ఉండడంతో దొంగలపై నిగా పెట్టడం తగ్గిపోతున్నది. దీంతో దొంగలు రెచ్చిపో తున్నారు. శివరాత్రి రోజు ఒక మహిళ మెడలో నుంచి చైన్ స్నాక్ చేయడం జరిగినది. అయితే ఆ మహిళ మెడలో ధరించినది బంగారు కాకపోవడంతో మహిళ ఊపిరి పీల్చుకున్నది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీసు సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని రైతులు మరియు ప్రజలు కోరుతున్నారు.



## ధనలక్ష్మి రహదారి 40 అడుగుల నిర్మాణానికి శ్రీకారం

### -చైర్మన్, కమిషనర్ సమక్షంలో కొలతలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో ధనలక్ష్మి రహదారి విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు 40 అడుగుల విస్తరణ పనులకు మునిసిపల్ అధికారులు అధికారికంగా మార్కింగ్ చేపట్టారు. ఈ ప్రాంత వాసులు రోడ్డు విస్తరణలో తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిని అందించారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున సమక్షంలో స్థానికులతో కలిసి మునిసిపల్ యంత్రాంగం, రోడ్డు మధ్య భాగాన్ని నిర్ణయించి ఒక వైపు 20 అడుగులు, మరో వైపు 20 అడుగులతో నిర్మాణం జరిగే విధంగా మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా డి.యల్ రోడ్డు విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో పాటు ఆధునిక లైటింగ్, సమగ్ర డ్రైనేజ్ సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పనులకు అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరైనట్లు వెల్లడించారు. ఆస్తి యజమానులకు ఎలాంటి అపోహలు లేకుండా పూర్తి వివరాలు తెలియజేసి, పారదర్శకంగా మార్కింగ్ ప్రక్రియ నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, నాగేంద్రబాబు, టీడీపీ నాయకులు బాచి, నెట్టప్ప, జనసేన నాయకులు ఆదర్శ, నిమ్మకాయల రాము, టి.పి.ఓ అబ్దుల్ సత్తార్, సర్వేయర్ సురేష్, సచివాలయం ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల విస్తరణకు సహకరించండి

### -మేళాపురం రహదారి విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్




హిందూపురం పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రహదారుల విస్తరణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాల యంలో మేళాపురం రహదారిని 80 అడుగులకు విస్తరణ చేసేందుకు మేళాపురం, ముద్దిరెడ్డిపల్లి, సింగరెడ్డిపల్లి ప్రజా ప్రతినిధులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రహదారుల విస్తరణకు రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. పట్టణంలో రహదారుల విస్తరణకు నిర్ణయించి, ఈ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. రహదారులను విస్తరించడం వల్ల భావితరాలకు మంచి భవిష్యత్తుఉంటుందని పేర్కొన్నారు. హిందూపురం అభివృద్ధి లో భాగంగా మేళాపురం నుండి ముద్దిరెడ్డిపల్లి మీదుగా సింగిరెడ్డిపల్లి సిరా హై వే కి అనుసంధానం చేస్తూ 80 అడుగులు విస్తరణ చేయాలని ప్రతిపాదించగా, అందుకు ఆ ప్రాంత వాసులు వివిధ రకాల అభిప్రాయాలు తెలిపారు. ఇందుపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భారతి, మహాలక్ష్మి, నాగమణి, టిపిఓ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

# బీసీలను అభివృద్ధి చేసిందీ మేమే - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి



: 'అయిదేళ్లలో వెనుకబడిన తరగతులకు జగన్ చేసింది శూన్యం, బీసీలకు పునాదులు మేమే... వారిని అభివృద్ధి చేసింది కూడా మేమే..'అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తర సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. 2014-19లో వడ్డెర్లకు, రజకులకు, మత్స్యకారులతో ఇతక బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వంలోనూ బీసీలకు పెద్దపీట వేస్తున్నామని, వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. గతంలో ఆదరణ, ఆదరణ 2.0 పథకాలను ప్రారంభించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. త్వరలో ప్రారంభించబోయే ఆదరణ 3.0లో వడ్డెర్లకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లకు మైనింగ్ లీజు కేటాయింపుల్లో 15 శాతం రిజర్వేషన్లు, సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని, వాటికి సంబంధించిన ఫైళ్లు ఆర్థిక శాఖ వద్ద ఉన్నాయని తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధం కాలంలో మత్స్యకారులకు(పల్లెకారులు) ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇలా రాష్ట్రంలో ఉన్న 1.20 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. మత్స్య కారులు చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల వరకూ బీమా చెల్లిస్తున్నామన్నారు. మత్స్యకారుల మర పడవులకు వినియోగించే లీటర్ డీజిల్ పై రూ.9లు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. మత్స్య కారుల పిల్లల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నామన్నారు. మత్స్య కారుల పడవలు మరమ్మతులకు రూ.30 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు.

**ఆదరణ 3.0లో రజకులకు వాషింగ్ మెషిన్లు**

దేశంలో మొట్టమొదటిసారిగా 2014-19 మధ్య రజకల ఆర్థిక వృద్ధి కోసం ధోబి ఘాట్లు నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబుదేని మంత్రి సవిత తెలిపారు. రాబోయే ఆదరణ 3.0 పథకంలోనూ రజకులకు వాషింగ్ మిషన్లు, ఆధునిక పరికరాలు అందజేయబోతున్నామన్నారు. వడ్డెర్లను, మత్స్యకారులను, రజకులను, వాల్మీకీలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చే అంశం పరిశీలిస్తున్నామని, ఆయా కమిటీల నివేదికలు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ జాబితాలో కొత్త కులాలను చేర్చే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని, ఈ విషయం సభ్యులకు కూడా తెలుసని మంత్రి సవిత తెలిపారు.

బీసీలకు జగన్ చేసింది శూన్యం : వైసీపీ ప్రభుత్వ హయాంలో అయిదేళ్ల పాటు బీసీలకు జగన్ చేసిందేమీ లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. 2014-19 మధ్య ఆయా కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చడానికి అధ్యయన కమిటీలను అప్పట్లో తమ ప్రభుత్వమే నియమించిందన్నారు. తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా కమిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వడ్డెర్లతో పాటు అన్ని బీసీ కులాలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. బీసీలకు పునాదులు, వాళ్లకు అభివృద్ధి చేసిందీ తామేనని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## ఏపీ మార్క్ ఫైడ్ , ఎస్ సి సి ఎఫ్ ఆధ్వర్యంలో పప్పు శనగకొనుగోలు

ప్రజాభూమి, పుట్లూరు

పుట్లూరు మండల కేంద్రంలో ఏపీ మార్క్ ఫైర్ మరియు ఎస్ సి సి ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పప్పు సేనగా కొనుగోలును సింగిల్ విండో ప్రెసిడెంట్ గోవర్ధన్ రాజు, సి ఓ గోవిందు ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగినది. ప్రభుత్వం పప్పుశనగకు మద్దతు ధర క్వింటాకు 5875 రూపాయలుగా ప్రకటించడం జరిగినది. రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసి, ఈ కేవైసీ చేసిన రైతులు మాత్రమేపప్పు శనగను తీసుకురావాలని సి ఓ గోవిందు తెలిపారు. ఒక ఎకరాకు పది క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.బుధవారం ఐదు మంది రైతులకు సంబంధించి 105.5 క్వింటాలను కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

# అంగన్వాడీ మహిళల పట్ల ప్రభుత్వ తీరు అమానుషం- డాక్టర్ ఎన్ తులసి రెడ్డి



ప్రజా భూమి, కడప సిటీ :
అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు విజయవాడ ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ మహిళలపై కూటమి ప్రభుత్వం ప్రవర్తించిన తీరు అమానుషం, అమానవీయం,ఆటవికం, అనాగరికం అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో మగ పోలీసులు వచ్చి శిబిరాన్ని ధ్వంసం చేయడం శోచనీయమన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి ఎడమ చేయి విరగడం,మరికొందరు గాయాలపాలు కావడం, బ్యాగులు, సెల్ఫోన్లో పోగొట్టుకోవడం దురదృష్టకరమన్నారు.దాదాపు 1000 మంది అంగన్వాడీ మహిళలను అరెస్ట్ చేశారు అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయమని మాత్రమే అంగన్వాడీ మహిళలు అడుగుతున్నారు.కనీస వేతనాలు నెలకు రు 26000 ఇవ్వాలని, పదవి విరమణ తర్వాత గ్రాచ్యూటీ ఇవ్వాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంట్రల్ గా మార్చాలని,ఖాళీగా ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు కూడా అమలు చేయాలని అంగన్వాడీ మహిళలు చేస్తున్న డిమాండ్లు సహేతుకమైనవి.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి అంగన్వాడీ మహిళల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని,అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని, కేసులు పెట్టవద్దని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్య బాధితుల సమస్యలపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు 10 లక్షల 43 వేల మంది అగ్రిగోల్డ్ ఖాతాదారులకు ప్రభుత్వం రు 906 కోట్లు ఇచ్చింది.ఇంకా 9. 50 లక్షల మంది ఖాతాదారులకు 3080 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉంది.అగ్రిగోల్డ్ ఆస్తులు దాదాపు రు 24 వేల కోట్ల వరకు ఉంటాయి. చట్టపరంగా అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తొమ్మిదిన్నర లక్షల మంది ఖాతాదారులకు 3080 కోట్ల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# అనాధ పిల్లల ఆశ్రయానికి అడ్డంకులు సృష్టించడం సరికాదు

- రహదారి అవసరాలకు అంగీకరిస్తాము గాని మొత్తం భూమి అంటే ప్రతిఘటిస్తాం
- దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ సభ్యులు



ప్రజాభూమి, పులివెందుల
అనాధ పిల్లలకు ఆశ్రయాన్ని కల్పిస్తూ ధార్మిక విద్యను అందించే మదరసాను రహదారి అభివృద్ధి పనుల నిమిత్తం పూర్తిస్థాయిలో ప్రభుత్వం స్వాధీన పరచుకునే చర్యలను స్వాగతించబోమని ప్రతిఘటించి తీరుతామని దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ పెద్దలు పేర్కొన్నారు. పులివెందుల నియోజవర్గ పరిధిలోని వేల్పుల గ్రామానికి సమీపంలో ఉన్న దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ ప్రాంతాన్ని విజయవాడ నుండి బెంగ ళూరు గ్రీన్ ఫీల్డ్ రహదారికి అనుబంధ రింగ్ రోడ్ కు 90 ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వం 2023 లో ప్రకటించడం జరిగిందని వాటిలో భాగంగా 90 ఎకరాలకు సంభందించిన రైతులు కోర్టును ఆశ్రయించి గత రెండు,మూడు సంవత్సరాలనుండి కోర్టులో వాదోపవాదాలు కొనసాగుతున్నప్పటికీ ఇటీవల రహదారికి సంభందించి పనులను వేగవంతం చేస్తూ అదికారులు భూసేకరణ విషయమై దారుల్ ఉలూమ్ తన్విరుల్ హుదా ట్రస్ట్ (మదరసా) పరిసరాలకు వచ్చిన అధికారులకు పలు ముస్లీమ్ పెద్దలు ట్రస్ట్ కమిటీ పెద్దలు,రైతు సోదరులు అధికారుల చర్యలను నిరసిస్తూ అడ్డుకోవడం జరిగిందని పెద్దలు పేర్కొన్నారు. ఈ విషయమై ముస్లిం నాయకుడు నూరుల్లా మాట్లా డుతూ గతంలో అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని, రోడ్డు కాలసిన భూమి ఇవ్వటానికి అనుకూలిస్తాము కానీ మొత్తం భూమి అనవసరంగా ఇచ్చేటందుకు సిద్ధంగా లేమని గత 20 సంవత్సరముల నుంచి ఈ స్థలము లో పేద అనాధ పిల్లలకు కావలసిన సదుపాయాలు చేస్తూ ధార్మిక విద్య, పిల్లలకు మంచి ప్రవర్తన నేర్పిస్తూ ఇక్కడే మసీదు, మదరసా, పిల్లల వసతుల కోసం చేసుకున్న రూముల సదుపాయాలు చుట్టూ కాంపౌండ్ గోడ సీసీ రోడ్డు వదులుకోవడా నికి సిద్ధంగా లేమని తెగేసి చెపారు. మా పెద్దలు, జమియత్-ఉలుమా-యె-హింద్ వారితో మాట్లాడి ఆ తర్వాత ఉన్నత అధికారులు ఆర్డిం,కలెక్టర్ తో సంప్రదిస్తామని చెపారు. అందుకు అధికారులు సానుకూలంగా సహకరించి వెళ్లిపోయారు ట్రస్ట్ పెద్దలు అధికారులకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టాను తబ్లీక్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ బాషా హాఫీజ్ రఫిక్, హాఫీజ్ తయీబ్, హాఫీజ్ ఇమామ్ భాషా,హాఫీజ్ అస్లం, రెడ్డి భాష హబీబుల్లాహ్, యూనుష్, హయాత్ బాషా, లతీఫ్, బాబాఫక్రు ద్దిన్, అన్సర్, అన్వర్ పాల్గొన్నారు..

# ఘనంగా టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పట్టణంలోని ప్యారడైజ్ కేఫ్ నందు బుధవారం టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గగ్గుటూరు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామముని రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి అక్కడి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ, తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. పలువురు నాయకులు ఆయన సేవలను అభినందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్, వేమకుమార్, ఫయాజ్, తెలంగాణ వలి, డక్కా రమేష్, వెంకటరామి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, అంజి, పాపిరెడ్డి, శివ, రమణ, సుబ్బయ్య, షఫీ, షేక్ సంధాని, రామాంజనేయులు, చరణ్, ఇర్ఫాన్, గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసిద్ధ తెలుగు గేమ్ షో భామలు సత్యభామలు



ప్రజాభూమి, వేంపల్లె
జెమిని టీవీలో ప్రసారమయ్యే ప్రసిద్ధ తెలుగు గేమ్ షో భామలు సత్యభామలు కామేడి ఆధారిత కార్యక్రమాన్ని స్థానిక వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించినట్లు కార్యక్రమ మేనేజర్ మణి వెల్లడించారు. మహిళా పోటిదారుల ప్రతిభను, వినోదాన్ని ప్రదర్శించే ఈ కార్యక్రమాన్ని భార్గవ్ యాంకరింగ్ నిర్వహించారు. హలమతి, హాబీబో, మనసులో మాట, ఓ శివంగి తదితర వినోదభరిత రౌండ్లతో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. అలాగే గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మేనేజర్ మణి మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకమైన షో, కుటుంబ సభ్యులతో కలిసి సరదా ఆటలు, వినోదాన్ని అందించే కార్యక్రమాన్ని వీక్షించవచ్చాన్నారు. మహిళలు తమ ప్రతిభను, హాస్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికగా నిలుస్తోందన్నారు.

# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

## - సీఐ.టి.నరసింహులు



ప్రజాభూమి, వేంపల్లె
జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ టి.నరసింహులు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా ప్రయాణించడం, ప్రయాణీకులను ఓవర్లోడ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. విధి నిర్వహణలో యూనిఫాం తప్పనిసరిగా ధరించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్పై ఉందని సీఐ. నరసింహులు గుర్తు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ లైన్ మెన్ల సేవలు అమోఘం



ప్రజాభూమి,పులివెందుల
విద్యుత్ సంస్థలో పనిచేసే విద్యుత్ లైన్ మెన్ల సేవలు అమోఘం అని కడప జిల్లా విద్యుత్ ఎస్సీ రమణ అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక డివిజన్ కార్యాల యంలో అత్యంత జాతీయ లైన్మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా విద్యుత్ కంపెనీ సంస్థ ఎస్సీ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ రమణ మాట్లాడుతూ ఇలాంటి జాతీయ లైన్మెన్ దినోత్సవం జరుపుకోవ డం చాలా గర్వకారణం అని ముఖ్యంగా విద్యుత్తు సంస్థలు పనిచేసే ప్రతి ఒక్కలైను ఇన్స్పెక్టర్, లైన్మెన్ ల సేవలు అమోఘమని విద్యుత్ సంస్థకు వీరు ముఖ్య కారుకులన్నారు.అలాగే విధి నిర్వహ ణలో ఉద్యోగస్తులతో ఎటువంటి ఇబ్బంది లేకుండా తోటి ఉద్యోగులతో కలిసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముఖ్యంగా విధి నిర్వహణలో ఎల్సీ లు తీసుకున్నప్పుడు జాగ్రత్తగా ఒకటి, రెండుసార్లు పూర్తి సమాచారం అందుకున్న తర్వాతనే ఎల్సి రిటర్న్ చేయాలని విద్యుత్తులో పనిచేసే ప్రతి ఒక్క కార్మికుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగం చేయాలని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టి తీసుకొని వస్తే తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ నిర్వహణలో ఉన్న విద్యుత్ ఉద్యోగులకు అత్యంత సేవలు అందించిన పులివెందుల వెస్ట్, టౌన్ లో పనిచేస్తున్న లైన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, లైన్మెన్ అంజి లకు 2025 ఉత్తమ ప్రతిభ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, ఏడిఈ గురు మోహన్ రెడ్డి, ఏడిఈ సుధాకర్ రెడ్డి, ఏడి నాగేంద్ర, ఏఈ జగదీష్ రెడ్డి,సబ్ ఇంజనీర్, లైనింగ్ ఇన్స్పెక్టర్ లైన్మెన్ , తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు

## మహిళా శిశు సంక్షేమ అధికారిణి పి రమాదేవి



ప్రజాభూమి, కడప సిటీ :
జిల్లా మహిళా,శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారిణి శ్రీమతి పి. రమాదేవి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా 04.03.2026 సైబర్ క్రైమ్, డిజిటల్ సేఫ్టీ పైన వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, కడప నందు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది, ఇందులో భాగంగా జిల్లా మహిళా,శిశుసంక్షేమసాధికారిత అధికారిణి పి. రమాదేవి మాట్లాడుతూ ఈ రోజుల్లో మన జీవితం డిజిటల్ ప్రపంచంతో బలంగా అనుసంధానమై ఉందిఅని మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, ఆన్లైన్ బ్యాంకింగ్, షాపింగ్ ఇవన్నీ మన దైనందిన జీవితంలో భాగమయ్యాయి అని అయితే, ఈ సౌకర్యాల వెంట కొన్ని ప్రమాదాలు కూడా వస్తున్నాయి అని. వాటిలో ముఖ్యమైనది సైబర్ క్రైమ్ మహిళలు,టీనేజర్లు ఆత్మవిశ్వాసంతో, అవగాహనతో ముందుకు సాగాలి అని. సురక్షితమైన డిజిటల్ సమాజాన్ని నిర్మించడానికి మనమందరం కలిసికట్టుగా పని చేయాలి, ఇటువంటి నేరాలను అరికట్టేందుకు తెలివిగా సమన్వయంతో ముందుకు నడవాల్సి ఉంటుంది అని మనకి లేదా మిత్రులను ఆదుకోవడానికి అయినా మీరు తక్షణమే కంప్లైంట్ ఇవ్వవలసిన నెంబర్లు 1930 పాటుగా ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 112, లీగల్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మరియు ఇతర హెల్ప్ ఉపయోగించి కూడా ఆపదల నుంచి బయటకి రావచ్చు అని విద్యార్థులకి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మిషన్ శక్తి కో-ఆర్డినేటర్ఎన్. శోభా రాణి, పిఎఫ్ఓ శ్రీమతి జ్యోతి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎన్ అశ్వని,కళాశాల కరెస్పాండంట్ మధుసూదన్ రెడ్డి, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, విధ్యార్థులు పాల్గొనడం జరిగినది.

# ఒక కోటి ఎనిమిది లక్షల పదిహేనువందల రూపాయల టార్గెట్ పూర్తి చేశాం

## బీటెక్ రవి ప్రోత్సాహంతోనే ఈ రికార్డు

## పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల మార్కెట్ యార్డుకు ఇచ్చిన టార్గెట్ ఒక కోటి ఎనిమిది లక్షల పదిహేనువందల రూపాయలు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ను రీచ్ కావడం జరిగిందని మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ అన్నారు.బుధవారం మార్కెట్ యార్డ్ ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మనకు ఇచ్చిన టార్గెట్ ను ఈ సంవత్సరం చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బుధవారానికి టార్గెట్ రీచ్ కావడం జరిగిందన్నారు.మనకు ఇచ్చిన టార్గెట్ రీచ్ కావడానికి ప్రధాన కారకులు పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి సహకారం ఎంతో ఉంది అన్నారు. బీటెక్ రవిని కలిసి మాట్లాడేటప్పుడు ఆయన మీ మార్కె ట్ యార్డుకు ఇంత టార్గెట్ అనేది ఇచ్చి ఉంటారు కదా, మీకు ఇచ్చిన టార్గెట్ ను రీచ్ అయ్యారా లేదా అని ఆయన అడగడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాల నుంచి ఇచ్చిన టార్గెట్ పూర్తి కాలేదని ఈ సంవత్సరం పూర్తి అయ్యే దానికి ప్రయత్నం చేస్తాం చేస్తామని ఆయనకు చెప్పడం జరిగిందన్నారు. పూర్తి చేసేది కాదు నువ్వ కచ్చితంగా టార్గెట్ రీచ్ అయినప్పుడే నువ్వు పని చేసినట్టు అని ఆయన మాకు సూచన లు ఇవ్వడం జరిగిందన్నారు.అభివృద్ధి పరంగా ఏ విధమైన సహకారం కావాల్సి ఉంటే నా నుంచి నీకు సంతృప్తిగా లభిస్తుందని ఆయన చెప్పడం జరిగిం దన్నారు. దానికి అనుగుణంగానే ఈరోజు మనం ప్రతి ఒక్క విషయంలో చెక్ పోస్టులు గాని, ఎన్ఎస్ఎల్ వాళ్ళ దగ్గర నుంచి గాని ప్రతిదీ మనం చేసి ఈరోజు జిల్లాలో నెంబర్ వన్గా మనం టార్గెట్ రీచ్ కావడం జరిగిందని తెలిపారు. జిల్లాకలెక్టర్ కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగిం దన్నారు. ఆయన సలహాలు సూచనలు తీసుకొని, అదేవిధంగా మార్కెటింగ్ శాఖ కమీషనర్ విజయ సునీత కూడా ఎప్పటికప్పుడు ఏం చెప్పినా కూడా దానికి సహకరించి ఈ విధంగా మనం ముందుకెళ్లే దానికి ఆమె కృషి కూడా ఉంది అన్నారు. జిల్లాల అధికారుల సూచనల మేరకు ముందుకు వెళ్లడం జరిగిందన్నారు.

# దళిత రైతులకు పట్టాలివ్వకుంటే ఉద్యమం తప్పదు

## సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం:
సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్.కే.ఆర్ నగర్ దళిత రైతుల భూములపై పెత్తందారులు చేస్తున్న దౌర్జన్యాలను సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన దళితులతో కలసి మీడియాతో మాట్లాడుతూ, 2013లో పెద్దపల్లి రెవిన్యూ సర్వే నంబర్ 937లోని 69 ఎకరాల భూమిని దళితులకు కేటాయించినా, అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ పట్టాలు అందలేదని మండిపడ్డారు. స్థానిక పెత్తందారులతో చేతులు కలిపి దళితుల భూములను కాజేయాలని చూస్తున్నారని, బాధితులకు మద్దతుగా నిలిచిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమని ఆయన ధ్వజమెత్తారు. “దున్నేవాడిదే భూమి” అన్న సిద్ధాంతంతో దళితులకు పట్టాలు మంజూరు చేసే వరకు పోరాటం ఆపబోమని, త్వరలోనే రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి, చలపాటి చంద్ర, దళిత రైతులు పాల్గొన్నారు.

# మన ఊరికోసం స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలో ఉచిత చలివేంద్రం ప్రారంభం

## చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సై హారిక




ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామం, రోడ్డు నెంబర్ 13 బస్టాండు వద్ద 'మనఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కూల్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని సిద్దవటం ఎస్సై హారిక బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మరికొందరు దాతలు ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వారికి అవసరమైన చేయూత మేము కూడా అందిస్తామని ఆమె పేర్కొన్నారు. సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో వరుసగా రెండో ఏడాది ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ సభ్యులకు, దాతలకు, ప్రారంభోత్సవానికి విచ్చేసిన యస్సై హారికకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్సై హారికను సంస్థ సభ్యులు పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అవ్వారు జానకిరామయ్య, సీనియర్ నాయకులు పుత్తా రామచంద్రయ్య, సంస్థ సభ్యులు ఉప్పల రామక్రిష్ణ, పుత్తా శ్రీనివాసులు, పుత్తా సుధీర్, దేరంగుల శ్రీకాంత్, సామల చెంగయ్య, పెంచలయ్య, జానపాటి సుబ్బరాయుడు, బోగా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా కొనసాగుతున్న జనసేన సభ్యత్వ నమోదు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్.కె.ఆర్ నగర్ ఎస్సీ కాలనీలో బుధవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సిద్ధవటం మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దేరంగుల శ్రీలేఖ భర్త, యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్ తన సొంత నిధులతో నిరుపేద దళితులకు సభ్యత్వాలు చేయిస్తూ వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ ఆదేశాల మేరకు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. నిరుపేదల పట్ల ఉన్న విశ్వాసంతో తాము స్వచ్ఛందంగా ఈ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వం వలన ప్రయట్నజనాలను దళితులకు, మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దళితులు, జనసైనికులు, నాయకులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి టైక్వాండో పోటీల్లో సిద్ధవటం విద్యార్థుల ప్రభంజనం



ప్రజాభూమి, సిద్దవటం: గుంటూరులో మార్చి 1వ తేదీన నిర్వహించిన జాతీయస్థాయి టైక్వాండో పోటీల్లో సిద్ధవటం దిగువపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించి పాఠశాలకు, సిద్ధవటం మండలానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరత్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శిక్షకులు శ్రీకృష్ణ వంశీ గౌడ్, జశ్వంతి మరియు ఎంఆర్సీ సిబ్బంది పాల్గొని విజేతలను అభినందించారు.

# మాధవరంలో స్మశాన వాటిక రహదారి పనులకు భూమి పూజ



ప్రజాభూమి, సిద్ధవటం
మండలంలోని మాధవరం-1 గ్రామంలో గల అలీ నగర్, మహబూబ్ నగర్ నివాసితుల ఏళ్లనాటి కష్టాలను కూటమి ప్రభుత్వం తీర్చిందని సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ దేరంగుల శ్రీలేఖ భర్త, దేరంగుల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన స్మశాన వాటికకు వెళ్లే రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలీ నగర్ నుండి మహబూబ్ నగర్ వరకు 350 మీటర్ల సీసీ రోడ్డు, 850 మీటర్ల మెటల్ రోడ్డు పనులను రంజాన్ పండుగలోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలో అపార అవకాశాలను వినియోగించుకోవాలి

-జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్.




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

బుధవారం ఉదయం ఏపీఎస్పీడీసీఎల్ వారి ఆధ్వర్యంలో, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ విభాగం సహకారంతో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమాన్ని తిరుపతిలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్పీడీసీఎల్ సిఎండీ లోతేటి శివశంకర్, సంస్థ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలోని విస్తృత అవకాశాలను వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. తిరుపతి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలు కలిగిన జిల్లాలలో ఒకటిగా ఎదుగుతోందని తెలిపారు. ప్రత్యేకంగా శ్రీ సిటీ లోని ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్ వంటి పారిశ్రామిక కేంద్రాల ద్వారా జిల్లాకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సుమారు 55 దేశాల నుండి వచ్చిన పెట్టుబడిదారులతో 500కు పైగా కంపెనీలు జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు, హెచ్ఆర్ మేనేజర్లు అభ్యర్థులతో నేరుగా ముఖాముఖి చర్చలు జరిపి నియామక ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ప్రారంభ వేతనం తక్కువగా ఉన్నప్పటికీ, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఒకటి నుండి రెండు సంవత్సరాల్లో మంచి వేతనంతో పాటు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని యువతకు అవగాహన కల్పించారు. విదేశీ దేశాలలో ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు కంటే ప్రైవేట్ రంగానికే అధిక ప్రాధాన్యత ఉందని, అభివృద్ధి, వేతన వృద్ధి, అంతర్జాతీయ అవకాశాలు ప్రైవేట్ రంగంలో విస్తృతంగా లభిస్తున్నాయని వివరించారు. యువత తమ మైండ్‌సెట్‌ను మార్చుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తే సంస్థలకు దీర్ఘకాలికంగా నిబద్ధత కలిగిన సిబ్బంది లభిస్తారని తెలిపారు. జిల్లాలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతి అభ్యర్థి సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, పాల్గొన్న సంస్థలు అర్హులైన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ హెచ్ఆర్డీ డైరెక్టర్ కె. గురవయ్య, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ పి. అయుబ్ ఖాన్, ఫైనాన్స్ డైరెక్టర్ రామ్మోహన్ రావు, తిరుపతి డిఎస్డివో ఆర్. లోకనాథం, సంస్థల సిజిఎంలు, జిఎంలు, ఏపీఎస్పీడీసీఎల్ మరియు ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్., ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు మరియు శక్తి టీమ్ సభ్యులు ఈ రోజు వివిధ విద్యాలయాలు, పాఠశాలలను సందర్శించి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు, టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలు మరియు వాటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై వివరణాత్మకంగా చర్చించారు. అమ్మాయిలు అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనే మనోబలాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే చెడు ఆకర్షణలకు లోనుకాకుండా చదువుతో పాటు తమ బలాలు, బలహీనతలను తెలుసుకుని వివిధ రంగాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. ఆత్మహత్య వంటి ఆలోచనలను పూర్తిగా నివారించి, ఏ సమస్య వచ్చినా చట్టపరమైన మరియు కుటుంబ సహకారంతో పరిష్కారం పొందాలని సూచించారు. బాల్య వివాహం నేరమని, దాని వల్ల బాలికల భవిష్యత్ ప్రమాద కరమైన పరిస్థితి లో పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

# ప్రభాకరన్ హత్య కేసులో ముగ్గురు అన్నదమ్ముల అరెస్ట్

## నిందితుల నుంచి రెండు కత్తులు, బైక్ స్వాధీనం

## పాత కక్షలతోనే కిరాతక హత్య: నిందితులకు రిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి తడ.

తిరుపతిజిల్లా తడ మండలం పెరియవట్టు గ్రామంలో గత నెల 28న సంచలనం సృష్టించిన ప్రభాకరన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను బుధవారం ఉదయం తడ పోలీసులు తడ రాఘవ కాంప్లెక్స్ పక్కన పాతబడిన హాస్టల్ భవనంలో నిందితులు దాకున్నట్లు సమాచారం అందడంతో వారిని అరెస్ట్ చేశారు. అనంతరం డీఎస్పీ చెంచు బాబు మీడియాతో మాట్లాడుతూ,నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నాం.హత్యా పెరియవట్టు మెయిన్ రోడ్డులో టైర్ పంచర్ షాపు నడుపుకుంటున్న ప్రభాకరన్‌తో, అదే గ్రామానికి చెందిన వి. దినేష్, వి. సతీష్ అలియాస్ అప్పు, వి. విగ్నేష్ అలియాస్ విక్కీ అనే ముగ్గురు అన్నదమ్ములకు పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో, ప్రభాకరన్‌ను అంతమొందించాలనే ఉద్దేశంతో ముగ్గురూ బైక్‌పై షాపు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ప్రభాకరన్‌పై కత్తులతో విచక్షణారహితంగా తలపై, ముఖంపై, మెడపై నరికి అతి కిరాతకంగా చంపి అక్కడి నుండి పరారయ్యారు. నిందితులపై తడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 33/2026 ప్రకారం కేసు నమోదు చేసి, వారిని రిమాండ్ నిమిత్తం సూళ్ళూరుపేట కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, సూళ్ళూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండప్ప నాయుడు మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

# సి ఎల్ ఏ. చీఫ్ సెక్రటరీ జి. జయలక్ష్మి తో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపైన రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్, మ్యుటేషన్, ఇతరులు, రిసర్వే, పీపీబి డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం సి ఎల్ ఏ) చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి తో. కలసి నిర్వహించిన రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ . బుధవారం ఉదయం ఏపీ సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్, మ్యుటేషన్, ఇతరులు, రిసర్వే, పీపీబి డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై చీఫ్ కమిషనర్ ఆఫ్ లాండ్ అడ్మినిస్ట్రేషన్ (సి సి ఎల్ ఏ) చీఫ్ సెక్రటరీ శ్రీమతి జి.జయలక్ష్మి కలసి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గారు, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి వర్చువల్ గా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ట్రైని కలెక్టర్ సందీప్ రఘు వాన్సీ,జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీఓలు తిరుపతి, సూళ్లూరుపేట రామ్మోహన్, దేవేందర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్, సంబంధిత సెక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

ప్రజా భూమి ప్రతినిధి: వరదయ్యపాలెం

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం గోవర్ధన్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థిని విద్యార్థులకు బుధవారం బిఈపిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని అందించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా హాజరై విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పడంతో పాటు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న బీఈపిసి ఫౌండర్ రియాజ్ ను అభినందించారు. అనంతరం బి ఈ పి సి ఫౌండర్ రియాజ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకారం అందించిన మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, ఉపాధ్యాయులు ముద్దు కృష్ణ, కానిస్టేబుల్ శివప్రసాద్, బీఈపిసి సభ్యులు ఉమర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



# సేవకు కార్యక్రమాలకు దక్కిన గౌరవం





(ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.,)

రేణిగుంట, ఏర్పేడు మండలాలలో గత సంవత్సరం కురిసిన వర్షాల, సమయంలో ఇబ్బందులు పడుతున్న పేద ప్రజల దినస్థితిని, రేణిగుంటలోని ఆషా స్వచ్ఛంద సంస్థ, అధ్యక్షుడు జూలియన్ రాజు అమెజాన్, డొనేట్ కార్ట్ వారి దృష్టికి తీసుకొని వెళ్లారు. స్పందించిన అమెజాన్ సంస్థ 400 మంది పేదలకు సరిపడ నిత్యవసర వస్తువులు, బియ్యం, దుప్పటి లను ఆషా స్వచ్ఛంద సంస్థ ద్వారా పంపిణీ చేసేందుకు పంపించారు. పేద ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం, తమ సంస్థ పై అమెజాన్, డొనేట్ కార్డ్ వారు ఉంచిన, నమ్మకాన్ని వమ్ము చేయకుండా సకాలంలో అందరికీ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తన నిజాయితీని చాటుకున్నారు. ఆషా సంస్థ చేసిన నిస్వార్థ సేవలను గుర్తించిన అమెజాన్, డొనేట్ కార్ట్ వారు ఆషా సంస్థను అభినందిస్తూ ప్రశంస పత్రాన్ని జూలియన్ రాజు గారికి పంపించారు. దేశంలో తమ సంస్థలు వివిధ ప్రాంతాల్లో అందిస్తున్న సేవలలో ఆషా సంస్థ ది బెస్ట్ గా ఉండడంతో ఈ ప్రశంసా పత్రాన్ని అందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ 2023లో అప్పుడు కురిసిన వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో అమెజాన్, డొనేట్ కార్ట్ వారు మీ ప్రాంతంలో నిత్యవసర వస్తువులు పంపిణీ మీ ద్వారా చేయాలని నన్ను సంప్రదించారని అన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 2023లో రెండు మండలాల్లో 1000 నిత్యవసర సరుకుల కిట్ లు, పంపిణీ చేశామని తెలిపారు. అప్పుడు నిస్వార్థంగా పంపిణీ చేసిన ,విధానాన్ని మెచ్చి 2025లో కురిసిన వర్షాలకు, ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు అందించేందుకు 400 నిత్యవసర వస్తువుల, కిట్టులను పంపించారని పేర్కొన్నారు. రేణిగుంట మండలంలో 9 గిరిజన కాలనీలలోని ,గిరిజన కుటుంబాలకు పంపిణీ చేశామని, అదేవిధంగా డీఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు, ఏర్పేడు మండలంలోని 9 గిరిజన కాలనీలలో డీఎస్పీ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో పంపిణీ చేసామన్నారు. బుధవారం రోజు పంపిణీ చేసిన వివరాలను ఆరోజు అమెజాన్, డొనేట్ కార్ట్ వారికి, సకాలంలో అప్డేట్ చేసామన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన దానికి, అభినందిస్తూ అమెజాన్, డొనేట్ కార్ట్ వారు ప్రశంస పత్రాన్ని పంపించారని పేర్కొన్నారు. చేసిన సేవను గుర్తించి ప్రశంసించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి, సహకరించిన డిఎస్పి శ్రీనివాసరావు, 18 పంచాయతీల్లో సహకరించిన నాయకులు, అధికారులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మీ అందరి సహకారంతో ఆషాసంస్థ మరింత సేవ చేసేందుకు ముందుంటుందని తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ఆత్మీయ విందులో పాల్గొన్న కూటమి ప్రజాప్రతినిధులు







ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి పార్లమెంట్ కూటమి ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల కోసం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి శ్రీ నారా లోకేష్ .ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో నా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నారా మరియు బొజ్జల కుటుంబాల మధ్య ఉన్న దశాబ్దాల నాటి అనుబంధం ఈ భేటీతో మరోసారి గుర్తుకు వచ్చింది. ఈ సందర్భంగా మా నాన్నగారు స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి .మరియు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .మధ్య ఉన్న గాఢమైన స్నేహాన్ని, అలాగే లోకేష్ అన్నతో నాకున్న చిన్ననాటి అనుబంధాన్ని ఆత్మీయంగా చర్చించుకున్నాము. నాన్నగారు చేసిన అభివృద్ధి పనులను, నియోజకవర్గంతో ఆయనకు ఉన్న మమేకాన్ని లోకేష్ అన్న ఎంతో గౌరవంగా స్మరించుకోవడం నాకు స్ఫూర్తినిచ్చింది. శ్రీకాళహస్తి జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు లోకేష్ అన్న కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, స్వామి వారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశాను. అలాగే మన నియోజకవర్గ కళా వైభవాన్ని చాటిచెప్పే "శ్రీ విష్ణు మత్స్యావతారం" ప్రతిమ మరియు ప్రసిద్ధ గుడిమల్లం టెంపుల్ బుక్ ను లోకేష్ అన్నకు జ్ఞాపికగా బహూకరించడం జరిగింది. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కలయిక కేవలం ఒక విందు మాత్రమే కాదు, ఇది కూటమి కుటుంబాల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు ప్రతీక. ప్రజల క్షేమమే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తున్న లోకేష్ అన్న నాయకత్వంలో మన రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# సామాజిక న్యాయ పోరాట చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా సాయికుమార్ ఏకగ్రీవం.



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

నియామక పత్రం, ఐడి కార్డు అందజేసిన (ఆర్టిఐ) ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకులు పొన్నా రవికుమార్. చంద్రగిరి నియోజకవర్గంలో అవినీతిపై పోరాడేందుకు మరియు సామాజిక న్యాయం సాధించేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకులు పొన్నా రవికుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గ (ఆర్టిఐ) సామాజిక న్యాయ పోరాట ఇన్‌ఛార్జ్‌గా రెండవ సారి సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పొన్నా రవికుమార్ సాయికుమార్‌కు నియామక పత్రం గుర్తింపు కార్డు , బాధ్యతలను ధృవీకరించే సర్టిఫికేట్‌ను స్వయంగా అందజేశారు.పొన్నా రవికుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పట్ల అవగాహన, నిబద్ధత కలిగిన సాయికుమార్ ని అందరి అంగీకారంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఇకపై చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై సాయికుమార్ నేతృత్వంలో (ఆర్టిఐ) ద్వారా నిరంతర నిఘా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పొన్నా రవికుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని ఒక ఆయుధంగా మలచి, ప్రతి సామాన్యుడికి న్యాయం జరిగేలా, అవినీతి రహిత చంద్రగిరి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# ఏపీ పురం ప్రాథమిక పాఠశాలలో బడి ఈడు కార్యక్రమం

## అంజూరు పరిధిలోని ఏపీ పురం ప్రాథమిక పాఠశాల నందు బడి ఈడు పిల్లలు 100% నమోదు కార్యక్రమం




ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం మండలంలోని అంజూరు పరిధిలో ఎ పీ పురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాడు 2026-2027 అకాడమిక్ ఇయర్ గాను బడి ఈడు కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి ఆర్ రవికుమార్ మరియు అంజూరు సి ఆర్ సి ప్రధానోపాధ్యాయులు పి వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో జరపడం జరిగింది. ఎన్రోల్మెంట్లో భాగంగా పీవీ పురం హెడ్మాస్టర్ 2026-20227 విద్యా సంవత్సరానికి గాను 6 మంది పిల్లలను అడ్మిషన్లు చేయడం జరిగింది . కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలోనే పిల్లలు చేర్పించాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యముగా తెలపడం జరిగింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ సమర్థవంతంగా ఉందని అలాగే విద్యను బలోపేతం చేసే కార్యక్రమాలు మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ వలన ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి ఎక్కువగా ఉందని కావున ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించవలసిందిగా కోరడం జరిగింది. అలాగే మండలంలోని ప్రతి ఒక్క ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తమ పరిధిలో ఉన్నటువంటి బడి ఈడు పిల్లలను ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేసి పిల్లలను పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్యోతి, అంగన్వాడి టీచర్ పోలమ్మ , సిఆర్పి రవి, పాల్గొనడం జరిగింది.

# నవ మాసాలు మోసిన తల్లి... నరరూప రాక్షసి గా మారింది...

## రోజురోజుకి మానవత్వం మంట కలిసి పోతుంది....



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

అప్పుడే పుట్టిన పసికందును ముళ్లపొదల్లో పడేయడానికి ఆ తల్లికి మనసు ఎలా ఒప్పింది. ఆ తల్లికి హృదయం తల్లడిల్ల లేదా.... అసలు హృదయం ఉందా....10 నిమిషాల సుఖ సంతోషాల కోసం... ఒక నిండు ప్రాణాన్ని బలిచ్చే అధికారం ఎవరిచ్చారు మీకు....తిరుపతి జిల్లా, నాయుడుపేట, చంద్రబాబు నాయుడు కాలనీ లో మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అప్పుడే పుట్టిన ఆడ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో పడేసి వెళ్లిపోయారు.... పసికందు ఆర్తనాదాలు విన్న కొందరు అక్కున చేర్చుకుని పాప ప్రాణం కాపాడారు....విషయం తెలుసుకున్న ఆశ వర్కర్స్ పాపను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.... ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పసికందుకు అన్ని పరీక్షలు చేసి పాప సంపూర్ణ ఆరోగ్యంగా ఉందని తెలియజేశారు....పసికందు మౌన వేదన....నాకు జన్మనిచ్చిన వ్యక్తిని ఏమనాలో కూడా నాకు తెలియదు... అమ్మ అని పిలవాలి అంటే ప్రపంచంలో ఏ తల్లి తన బిడ్డను ముళ్లపొదల్లో పడవేయరు...మీ సుఖం కోసం నన్ను ఎందుకు బలి చేస్తున్నారు... నేను చేసిన పాపం ఏమిటి... తప్పు ఏమిటి... ఆడపిల్లగా పుట్టడం నా తప్పు... ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి... నన్ను ఎవరు పెంచుతారు... జన్మలో నాకింకా నాతల్లి ప్రేమ దొరకదు కదా... రాత్రి ముళ్లపదల్లో పడవేశారు ... అప్పుడు వీధి కుక్కలు నా మీద దాడి చేస్తాయని నీకు గుర్తు రాలేదా అమ్మ.... చీమలు నామీద దండయాత్ర చేస్తాయని మరచిపోయావా.... నవ మాసాలు మోసి... కన్నీ... పడేయడానికి నీకు మనసు ఎలా ఒప్పింది. జాలి.. దయ... కరుణ లేని నువ్వు నన్ను పెంచకపోవడమే మేలు.

# భూ సంబంధిత అంశాలు త్వరిత గతిన పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు : రీ సర్వే రెవెన్యూ భూ సంబంధిత అంశాలు ప్రజలతో ముడిపడి ఉంటాయని, వాటిని సకాలంలో పరిష్కరిస్తే చాలా వివాదాలు ఉండవని, పీజీ ఆర్ ఎస్ తదితర గ్రీవెన్స్ ల ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో అందిన పలు భూ సంబంధిత మ్యూటేశన్, సర్వే, పాస్ పుస్తకం, సర్వే నంబర్ సబ్ డివిజన్ తదితర అంశాలపై వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యత గా చేపట్టి సకాలంలో బియాండ్ ఎస్ఎల్ఏ కి వెళ్లకుండా పరిష్కరించాలని, సదరు అంశాన్ని ఉన్నత స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, మరింత బాధ్యతగా అధికారులు పని చేయాలనీ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పి జి ఆర్ ఎస్, రీ సర్వే,సంబంధిత రెవెన్యూ అంశాలపై జిల్లాలోని అందరు ఆర్డీవో లు, తహశీల్దార్లు, సర్వేర్లతోరెవెన్యూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్, డిఆర్ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరెవెన్యూ అంశాల్లో ప్రభుత్వ ఆదేశాల అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ రికార్డుల నమోదు ప్రక్రియను గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ గడువులు దాటకుండా ప్రతి దరఖాస్తును సమయపాలనతో పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల భావన 80 శాతం పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులను నిర్వహించడం అనేది రెవెన్యూ సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే సదుద్దేశ్యంతో చేపట్టడం జరిగిందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ హక్కు పత్రం, మ్యూటేషన్, 22ఎ నిషేధిత భూములు, సర్వే నంబర్ సబ్ డివిజన్, తదితర భూ సంబంధిత పెండింగ్ అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు కేసుల్లో సకాలంలో స్పందించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటినుంచే కాదు, గత సంవత్సరం నుంచే జరుగుతోంది. పి జి ఆర్ ఎస్ లో వచ్చిన వినతులు ఎక్కువ మేరా భూ సమస్యలపై ఉన్నదని తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్లో వచ్చిన వినతులను సంబంధిత ఎమ్మార్వోలు ఎండర్స్మెంట్ చేసి కింద విఆర్ఓకి అందజేస్తారు సమస్య పరిష్కరించారా లేదా తిరస్కరణకు గురైన కారణాలు తెలుపుతూ నివేదికలు ఉండాలని ఆదేశించారు. సంబంధిత ఎమ్మార్వోలుఎ=ాలతో సమీక్ష సమావేశాలు నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.వెబ్‌ల్యాండ్స్‌లో ఉన్న సర్వే నంబర్లు మరియు ఇతర రికార్డులు సరిపోతున్నాయా చూడాలి. గ్రామాల వారీగా వివరాలు పరిశీలించాలి. పి జి ఆర్ ఎస్ వచ్చిన వినతులపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్ఓఆర్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు, పలమనేరు డివిజన్లో 29, చిత్తూరు డివిజన్లో 174, నగిరి డివిజన్లో 53, కుప్పం డివిజన్లో 20, మొత్తం జిల్లాలో 276 ఆర్ ఓ ఆర్ కేసులు ఉన్నాయని తెలిపారు,వివిధ భూ సమస్యలకు సంబంధించిన కోర్టులు కేసులకు సంబంధించిన ఫైల్స్ లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలి ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించాలని తెలిపారు . విలేజ్ సర్వేర్ లాగిన్ చాలా ఇంపార్టెంట్ తెలిపారు కోర్టులకు సంబంధించిన ప్రతి కేసు ఫైళ్లను సంబంధిత హెచ్ డి లు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉన్నదని తెలిపారు. ఈ క్రింది సబ్జెక్టులనురెవెన్యూ క్లినిక్,మ్యుటేషన్ల్స్రాదీ కరెక్షన్ మాడ్యూల్ - లావాదేవీల కోసం మ్యుటేషన్,జీరో ఖాతాలు,పునరుజ్జీవనకుల సుయో-మోటో న్యాయ/క్వార్టర్ల కోసం గుర్తించబడిన భూముల స్థితి , సురక్షిత నిల్వాూమీ పెండింగ్ కేసుల తొలగింపు మరియు నవీకరణ, కేసులు కోర్టు కేసులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, కుప్పం, నగిరి ఆర్డీవోలు శ్రీనివాసులు, విజయలక్ష్మి, అనుపమ, సర్వేర్ డిడి జయరాజు, వివిధ మండలాల ఎమ్మార్వోలు, డిప్యూటీ తాసిల్దార్లు, సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించుటకు పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.




రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు..బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) జరిగిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సింగిల్ డెస్క్ విధానంలో డిసెంబర్ 2025 నుండి 2440 పరిశ్రమలకు గాను 2323 అనుమతులు ఇచ్చామని మరో 116 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలు పరిశీలన కమిటీకి అందిన మేరకు 16 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 4.52 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 4, విద్యుత్ సబ్సిడీ 8, సేల్స్ టాక్స్-1, స్టాంప్‌డ్యూటీ -3,యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి, కలంకారీ క్లస్టర్, శ్రీకాళహస్తి, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించి వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు వివరిస్తూ నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ మరియు ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి రాష్ట్ర స్థాయి ఆమోదం పొంది ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపారని తెలిపారు. పరిశ్రమలకు సంబందించిన అనుమతులు వివిధశాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశలలో వున్నాయని,ఇంకా ప్రారంభించని వాటిని త్వరిత గతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ అమరయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్లు ఏపిఐఐసి తిరుపతి, నెల్లూరు విజయ భరత్ రెడ్డి, శివకుమార్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, శ్రీ సిటీ ప్రతినిధి భగవాన్, కార్మిక శాఖ అధికారి చిన్న లాలప్ప, డి ఆర్ డి ఏ పిడి శోభన్ బాబు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవి కుమార్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్,ఎ పి డి డి ఆర్ డి ఎ ప్రభావతి, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో రహదారులు అభివృద్ధికి నిధులు మంజూరు

## 8 ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి రూ.10 కోట్లు- ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో రహదారులకు మహర్దశ

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం





చంద్రగిరి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల మంజూరు చేసింది. నియోజక వర్గంలో దీర్ఘకాలికంగా ( పాతికేళ్లగా ) అభివృద్ధికి నోచుకోక గుంతల మయమైన ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాల పర్యటన సందర్భంగా గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రోడ్లు భవనాలశాఖమంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి 8 ఆర్ అండ్ బి రహదారులకు సుమారు 10 కోట్ల రూపాయలు మంజూరు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చంద్రగిరి నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి రహదారులకు నూతన శోభ సంతరించుకోబోతున్నది. రహదారుల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి, రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని రహదారుల ఆధునీకరణ, అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారని ఆయన తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని కృషితో సుమారు 10కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రహదారులకు మహర్దశ కలిగిందన్నారు . రహదారులే కాకుండా ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం:-(1) తిరుపతి- తిరుచానూరు రహదారి నుండి చల్లవారిపల్లి (తనపల్లి వెంకటరామపురం మార్గంగా) కి.మీ. 0/292 నుండి 0/417 వరకు అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు. (2) పుదిపట్ల- రంగంపేట వద్ద కి.మీ. 28/40 నుండి 28/60 మరియు 31/40 నుండి 31/70 వరకు రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ 80 లక్షలు. (3) ఎన్.హెచ్. 205 కి.మీ. 1/8 నుండి 4/8 వరకు రైల్వే ఫీడర్ రోడ్ (రెడ్డివారిపల్లి, నాగయ్యగారి పల్లి మార్గంగా) అభివృద్ధి పనులు మరియు చంద్రగిరి రైల్వే ఫీడర్ రోడ్ కి.మీ. 3/530 నుండి 410 వరకు అభివృద్ధి పనులకు రూ 40.00 లక్షలు. (4) చంద్రగిరి నుండి అనుపల్లి రహదారి (బొప్పరాజుపల్లి, గంగుడుపల్లి మార్గంగా) కి.మీ. 1/8 నుండి 1/10 వరకు రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ 33.00 లక్షలు.(5) డి.పి రోడ్ నుండి డి.ఎన్ రోడ్ వరకు ( వయా కృష్ణాపురం ) కిమీ 8/2-4 మధ్య రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ.20.00 లక్షలు. (6) మొండికల్వ అప్రోచ్ రోడ్లు కిమీ 0/6 నుండి 2/7 వరకు రహదారి మెరుగుదల పనులు- రూ.40.00 లక్షలు. (7) నరసిగాపురం లింక్ రోడ్ (సిటిఎండి-032)లో కిమీ 0/0 నుండి 1/6 వరకు రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులు.(అ) నరసిగాపురం గ్రామ రోడ్ (సిటిఎండి-031)లో కిమీ 0/0 నుండి 11842 వరకు రహదారి రైడింగ్ సర్ఫేస్ మెరుగుదల పనులకు రూ.250.00 లక్షలు. (8) తొండవాడ - రామాపురం రోడ్లో కిమీ 5/0 నుండి 7/0 మరియు 8/5 నుండి 10/3 వరకు రహదారి రైడింగ్ మెరుగుదల పనులకు రూ.250.00 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజానాయక్ తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి ఈ పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వ పాలకులకు ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) కి నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# బి.ఎన్.కండ్రిగ పోలీసుల విస్తృత తనిఖీలు

## - పార్లపల్లిలో గ్రామస్తులకు భద్రతా అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలం లోని పార్లపల్లి గ్రామంలో, బి ఎన్ కండ్రిగ పోలీస్ స్టేషన్ పరిధి సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ శోధన మరియు తనిఖీ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముఖ్య ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాలు, వాహనాల నిల్వ ప్రాంతాల్లో సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలను ఆపి వాటికి సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని, నిబంధనలు ఉల్లంఘించిన



వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణపై సమగ్ర అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు వివరించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, బ్యాంకు వివరాలు పంచుకోవడం వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా మరియు సమాజానికి కలిగే నష్టాలను వివరించి యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఇక ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి అనుమానితుడు సుధర్శన్‌తో పాటు గతంలో వివిధ నేరాలలో పాల్గొన్న కొంతమంది సమస్యాత్మక వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సలహా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో నేరాలకు పాల్పడకుండా చట్టబద్ధమైన మార్గంలో జీవనం సాగించాలని హెచ్చరించారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడడం పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రజల సహకారంతో ఇలాంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు తరచూ కొనసాగుతాయని ఎస్సై హరి ప్రసాద్ తెలిపారు.

# గ్రామాల్లో ప్రజా భద్రతపై విస్తృత అవగాహన నిర్వహిస్తున్న జిల్లా పోలీసులు..!

ప్రజా భూమి ప్రతినిధి,
చంద్రగిరి:(తిరుపతి)



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ తమ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల ద్వారా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న వివిధ రకాల నేరాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగాప్రత్యేకంగా సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, అనుమానాస్పద



ఫోన్ కాల్స్, ఓటీపీ మోసాలు, లింకులు, ఆన్‌లైన్ లోన్లు, సోషల్ మీడియా మోసాలు వంటి అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని, తెలియని లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. ఏవైనా సైబర్ మోసాలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.అలాగే విద్యార్థులు మంచిగా చదువుకొని, మంచి ప్రవర్తనతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, చెడు అలవాట్లు మరియు మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని, చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలని అవగాహన కల్పించారు.మహిళల భద్రతకు జిల్లా పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంటూ, ఏదైనా వేధింపులు, సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112 కు కాల్ చేయాలని తెలిపారు. ప్రతి సమస్యకు పోలీసులు అండగా ఉంటారని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందిస్తూ, పోలీస్--ప్రజల మధ్య విశ్వాసాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

# ఆక్స్ఫర్డ్ ఎక్స్పో మరియు ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి:శ్రీకాళహస్తిటౌన్

ఆక్సిఫోర్డ్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన “ఆక్స్ఫర్డ్ ఎక్స్పో మరియు ఫుడ్ ఫెస్ట్” కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు, కళాత్మక ప్రదర్శనలు మరియు సృజనాత్మక ఆవిష్కరణల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లలు తయారు చేసిన వినూత్న ప్రాజెక్టులు, శాస్త్రీయ నమూనాలు, సామాజిక అంశాలపై రూపొందించిన ప్రదర్శనలు తల్లిదండ్రులను మరియు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అలాగే ఫుడ్ ఫెస్ట్ లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని రుచికరమైన వంటకాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు మరియు వారి ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల కృషిని అభినందించి, తల్లిదండ్రుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సమిష్టి కృషితో విజయవంతం చేశారు.

# రేణిగుంటలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు



(ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట)

మార్వాడీలకు అత్యంత ఇష్టమైన హోలీ పండుగను బుధవారం రేణిగుంట పట్టణంలోని పురవీధులలో, పిల్లలు,యువకులు, పెద్దలు, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ , హోలీపండుగసందడి ,చేశారు. ఈ హోలీ పండుగ చెడుపై, మంచి విజయానికి ప్రతీకగా భావిస్తారు. ఈ కార్యక్రమంలో అశోక్ జాట్, త్రిలోక్, జై సింగ్ తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 8న జిల్లాస్థాయి శాప్

## టెన్నిస్, బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు.!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:(తిరుపతి)

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, తిరుపతి ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లా స్థాయి మాస్టర్స్ పురుషుల, మహిళల టెన్నిస్ మరియు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ కు జిల్లా జట్టులను ఎంపిక చేయనున్నా మని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్.శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ బ్యాడ్మింటన్( మాస్టర్స్) మరియు టెన్నిస్(మాస్టర్స్) సింగి ల్స్, డబల్స్, మిక్స్ డబుల్స్ జరగనున్నాయి. బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేవారు 35 ఏళ్ల వయస్సు దాటినవారు సింగి ల్స్, డబల్స్ (పురుషులు), సింగిల్స్ (మహిళలు) మరియు మిక్స్ డబుల్స్ లో జట్టులో పాల్గొనవ చ్చును. అలాగే 45 ఏళ్లు దాటిన పురుషులకు సింగి ల్స్, డబల్స్ విభాగాలలో పాల్గొనవచ్చును. ఈ పోటీల్లో రాణించిన వారు జిల్లా బ్యాడ్మింటన్ (మాస్టర్స్) ఈ నెల 14, 15 తేదీ ల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో మరియు టెన్నిస్ కు ఎంపికైనవారు ఈ నెల 22, 23 తేదీల్లో విజయనగరంలో జరగనున్న రా ష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో పాల్గొనవలనని తెలిపారు. ఆసక్తి గ లవారు టెన్నిస్ కు సంబంధించి డిఎస్ డి ఓ శశిధర్ ను (9948444759), బ్యాడ్మింటన్ కు సంబంధించి ఎం. నాగరాజు (9393530638) మరియు ఈ.గోపి (9177931531) సంప్రదిం చాలన్నారు. ఈనెల 8న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ (మాస్టర్స్)మరియు టెన్నిస్(మాస్టర్స్) టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ లో పాల్గొనుటకు శాప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనితెలిపారు.

# ఏఐసిటిఇ - యూహెచ్ వి - నోడల్ సెంటర్ గా సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎంపిక

## - కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్ రాజు

ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం

దేశంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యుకేషన్ పాలసీ 2020 అకాడమిక్స్ లో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్( యు హెచ్ వి ) కోర్సును నేర్చుకోవాలని అందుకోసం జాతీయస్థాయిలో 27 ఇంజనీరింగ్ కళాశాలను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎంపిక చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ నుండి మూడు కళాశాలలను ఎంపిక చేయడం జరిగిందని ఆ మూడింట్లో పుత్తూరు సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎంపికైనందుకు కళాశాల చైర్మన్ అశోకరాజు హర్షం వ్యక్తం చేశారు. సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యుహెచ్ వి నోడల్ కేంద్రంగా 2025 - 27 వరకు పనిచేస్తుందని ఈనెల 27వ తేదీన న్యూఢిల్లీలో ఏఐసిటి ఇ ఉన్నతాధికారుల ద్వారా మంజూరు పత్రాన్ని అందుకుంటామని,రాబోయే రెండు సంవత్సరాల కాలంలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల నోడల్ కేంద్రంగా యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ కార్యకలాపాలను ఏఐసిటి ఇ సూచనల మేరకు దిగ్విజయంగా కొనసాగుతుందని ఇది సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చరిత్రలో ఇది మైలురాయిగా నిలుస్తుందని చైర్మన్ డాక్టర్ అశోక్ రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జనార్ధన్ రాజు, మధు, రమేష్, హెచ్ ఓడిలు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు.

# మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ విజేత నరేష్ కు ఘనంగా సత్కారం



ప్రజా భూమి
ప్రతినిధి,చంద్రగిరి:(తిరుపతి):

సీనియర్ మిస్టర్ ఇండియా బాడీ బిల్ డింగ్ పోటీలలో బ్రాంజ్ మెడల్ అందుకున్న తిరుపతికి చెందిన టి. నరేష్ ను తిరుపతి బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ అండ్ మోడలింగ్ అసోసియేషన్ బుధవారం ఘనంగా సత్కరించింది.ఫిబ్రవరి 25, 26,27వ తేదీలలో ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ నగరంలో సీనియర్ మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో ఎంపికైన తిరుపతికి చెందిన టి. నరేష్ 65 కేజీలు విభాగంలో పాల్గొని మూడవ స్థానాన్ని కైవసం కైవసం చేసుకుని బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. అలాగే క్లాసిక్ బాడీ విభాగం పోటీలలో మూడో స్థానం, మెన్ ఫిజిక్ లో నాలుగవ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా బుధవారం తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ అండ్ మోడలింగ్ అసోసియేషన్ చైర్మన్, తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ బుధవారం తన నివాసంలో నరేష్ ను దుశ్యాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఎక్కడ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించిన విజేతగా నిలిచి తిరుపతి గౌరవాన్ని పెంచే విధంగా నరేష్ కు తగిన సహాయ సహకారాలు అందజేస్తానని గిరిధర్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బాడీ బిల్డింగ్ స్పోర్ట్స్ అండ్ మోడలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. శివప్రసాద్ రాయల్, కోశాధికారి ఏ. చేతన్ రాయల్, రెఫరీ ఏ. భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారత వారోత్సవాలు

## - జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ ఐపీఎస్

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2026 పురస్కరించుకొని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్, ఆదేశాల మేరకు జిల్లా అంతటా మహిళా సాధికారత వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా పోలీసులు మహిళ సాధికారత వారోత్సవాలు భాగంగా పాఠశాల మరియు కళాశాల విధ్యార్ధులకు చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహణ.**
**సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్.**

ప్రజా భూమి, కడప సిటీ :



అంతర్జాతీయ మహిళా దినోత్సవం -- 2026 ను పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి యొక్క ఉత్తర్వుల ప్రకారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు మార్చి 1 నుండి 8 వరకు జిల్లాలో మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, మార్చ్ 4 తేదీన బుధవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్తేషన్ల పరిధిలో మహిళ సాధికారత వారోత్సవాలలో భాగంగా పాఠశాల, కళాశాల విధ్యార్ధులకు చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాస రచన, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలతో పాటు విద్యార్థుల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, హక్కుల గురించి అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థినులకు పోలీసులు లేదా పోలీస్ స్టేషన్ల పై వున్న అభద్రతాభావం తొలగిపోయి, వారికి ఏమైనా సమస్యలు వుంటే ఆ సమస్యలను స్నేహపూర్వక వాతావరణంలో పోలీసు అధికారులకు సులభంగా తెలియజేసేందుకు అవకాశం వుంటుందని, తద్వారా వారి భద్రతకు మరింత మెరుగైన చర్యలు తీసుకునేందుకు అవకాశం వుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాఠశాలు,కళాశాలు సందర్శించి, విద్యార్థినులకు వ్యాసరచన,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "మహిళా భద్రత - సమిష్టి బాధ్యత, నేరాలను నిరోధించడంలో సమాజం, బాలికలకు ఆత్మరక్షణ ప్రాముఖ్యత,డిజిటల్ వేధింపులకు వ్యతిరేకంగా మాట్లాడండి, సురక్షితమైన గృహాలు, సురక్షితమైన పాఠశాలలు, సురక్షితమైన వీధులు వంటి కీలక విషయాలపై వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించగా తమ అభిప్రాయాలను వ్యాస, మాటలరూపంలోవ్యక్తపరిచారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతగా నిలిచిన వారికి బహుమతులు ప్రధాన చేశారు. అనంతరం పోలీసు అధికారులు సైబర్ క్రైమ్, ఫోక్సో,గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్ధాలు,ఆకతాయిల వేధింపుల,ర్యాగింగ్ నుండి రక్షణ,సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కార్యక్రమములు నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల కోసం "చలో విజయవాడ" ఉద్యమం



ప్రజాభూమి, కడప సిటీ:

సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్ట్ ఆధారంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించాలనే కోరికతో మార్చి 6న "చలో విజయవాడ" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మైదుకూరు మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష ఉద్యోగుల మాస్ లీవ్ మంజూరు చేయాలని వినతి పత్రం స్వీకరించారు. క్లస్టర్ రిసోర్స్ ఒ మొబైల్ టీచర్స్ (సిఆర్ఎమ్టి), కంప్యూటర్ ఆపరేటర్స్, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్స్, ఐ.ఆర్.టి టీచర్స్ తదితర సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని, వారి వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, రెగ్యులర్ చేయడం, డిఎస్సి వెయిటేజ్ వంటి ముఖ్య సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ఎంటీఎస్ విధానం తక్షణమే అమలు చేయాలని, గౌరవ సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుని ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. మాస్ లీవ్ మంజూరు చేయడం ద్వారా ఈ చలో విజయవాడ కార్యక్రమంలో ఎక్కువ మంది ఉద్యోగులు పాల్గొనగలిగారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈ ఉద్యమం ద్వారా తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆశిస్తున్నారు.

# క్రాప్ డైవర్షన్‌కు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ...రైతుల ఆదాయవృద్ధే లక్ష్యం

## - హార్టికల్చర్ హబ్ దిశగా 15 లక్షల హెక్టార్లలో క్రాప్ డైవర్షన్ ప్రణాళిక

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

రాష్ట్రంలో వరి పంట సాగు విస్తీర్ణాన్ని సమతుల్యం చేస్తూ రైతులను లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు దారితీసే స్పష్టమైన విధానాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో తెలిపారు. క్రాప్ డైవర్షన్, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ, 2025--26 క్రాప్ ఇయర్‌కు రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న రైతులు మొత్తం 38.97 లక్షల మంది ఉన్నారని, అందులో ఖరీఫ్ 26.94 లక్షలు, రబీ 12.03 లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. అధిక వరి సాగు ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల వంటి పంటలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సాంకేతిక మార్గదర్శకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2025--26 సంవత్సరానికి సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి ప్రణాళిక అమలు చేస్తున్నామని, ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విత్తనాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు.

# గుడిమల్లంలో ఏప్రిల్ 18 నుండి 23 వరకు మహా కుంభాభిషేకం..

## ఈనెల 8 నుండి బాలాలయంలోకి గుడిమల్లం పరశురామేశ్వర స్వామి






ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

: భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం శ్రీ పరుశు రామేశ్వర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు వైభవంగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో చిన్న మరమ్మతు పనులు చేయడానికి ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ గుడిమల్లం లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. చారిత్రాత్మక పుణ్యక్షేత్రం, శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వర స్వామి వారి ఆలయంలో మార్చి 8 తేదీన స్వామివారు బాలాలయంలోకి వెళ్ళనున్నారు.. బాలాలయం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం గుడిమల్లం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయ పాలకమండలి చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈఓ కె. రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ, పాలకమండలి సభ్యులు వివరాలు వెల్లడించారు. కేంద్ర పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఆలయ పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ఆగమ శాస్త్రం ప్రకారం ఈ బాలాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ గిరి నాయుడు తెలిపారు..

ఎందుకు ఈ బాలాలయం?

ప్రస్తుతం ఆలయంలోని రాజగోపురంతో పాటు ఇతర కీలక ప్రాంతాలలో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. శాస్త్రం ప్రకారం గర్భాలయంలో పనులు జరుగుతున్నప్పుడు, మూలవిరాట్ శక్తులను తాత్కాలికంగా అత్తి చెక్కతో చేసిన ప్రతిమలోకి (నమూనా) ఆవాహన చేసి, ప్రత్యేకంగా నిర్మించిన బాలాలయంలో



ప్రతిష్ఠిస్తారు. పనులు పూర్తయ్యే వరకు స్వామివారికి నిత్య పూజలు అక్కడే జరుగుతాయి.

రెండు రోజుల కార్యక్రమ వివరాలు:

మార్చి 7, శనివారం:

ఉదయం 8:30 నుండి: విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, నవగ్రహ దేవతల కలశ స్థాపన మరియు హోమాలు.

మధ్యాహ్నం 12:00 గంటలకు: పూర్ణాహుతి, దీపారాధన.

సాయంత్రం 4:00 నుండి: వాస్తు శాంతి, అంకురార్పణ, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ మరియు యాగశాల పూజలు.

రాత్రి 10:00 గంటలకు: మొదటి కాల పూర్ణాహుతి. జరుగుతుంది.

మార్చి 8, ఆదివారం:

ఉదయం 6:00 నుండి: వల్లభ గణపతి పూజ, సూర్య పూజ, మండలారాధన మరియు విశేష హోమాలు.

ఉదయం 9:15 గంటలకు: యాగశాల నుండి కలశాల ఊరేగింపు (బాలాలయానికి ప్రయాణం).

ఉదయం 9:45 నుండి 10:00 వరకు: శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వర స్వామి వారికి బాలాలయం మహాకుంభాభిషేకం.

ఉదయం 10:00 గంటలకు: మహా దీపారాధన మరియు భక్తులకు ప్రసాద వితరణ.

ఈ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు న. వంశీకృష్ణ శర్మ గారి ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులందరూ ఈ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

దాతల సహాయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం బత్తల గిరి నాయుడు.

శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో గుడిమల్లం ఆలయం ఎంత అభివృద్ధి చెందుతూ ఉందని గిరినాయుడు స్పష్టం చేశారు. గుడిమల్లం ఆలయానికి శాశ్వతమైన వనరులు ఏర్పాటు కోసం అవసరమైన స్థల సమీకరణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు దాతలు ఆలయ అభివృద్ధికి ముందుకు వస్తున్నారని అయితే శాశ్వత కట్టడాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులు దాతల సహాయంతో చేపట్టి తరువాత శాశ్వత కట్టడాలు ఇతర సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మూడు కోట్ల రూపాయలతో గుడిమల్లం కు రోడ్డు తో పాటు నూతన రైల్వే స్టేషన్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరం గుడిమల్లం ఆలయానికి రహదారి ఏర్పాటు కి జిల్లా కలెక్టర్ ఎన్ వెంకటేశ్వర్ చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు. అంతేకాకుండా గుడిమల్లం ఆలయం కు సంబంధించి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. గుడిమల్లం కు వచ్చే రహదారి మహా కుంభాభిషేకం నాటికి ప్రారంభం చేయనున్నట్లు ఆయన తెలిపారు. గుడిమల్లం ఆలయంలో ఉన్న ఏ చిన్న కట్టడం ధ్వంసం కాకుండా మహా కుంభాభిషేకం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు..

ఆలయ అభివృద్ధి ప్రధాన ఎజెండా ఈవో కే రామచంద్రారెడ్డి..

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టేందుకు ప్రత్యేకమైన అజెండాతో ముందుకు వెళుతున్నట్లు ఆలయ ఈవో కే.రామచంద్ర రెడ్డి తెలిపారు. దాతల సహాయంతో స్థలాలు కొనుగోలు చేసి ఆలయము అభివృద్ధి చేస్తామని తెలిపారు. మాస శివరాత్రి వంగ ఫేమస్కంతమూర్తి కి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవమూర్తుల ఏర్పాటు తోపాటు ప్రత్యేక పూజలకు భక్తులకు అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గుండ్ల కంద్రిక పంచాయతీలో గుడిమల్లం ఆలయానికి 18 ఎకరాల 32 సెంట్లు భూమి ఉన్నట్లు తెలిపారు. పూలవానికుంట పేరుతో భూమి ఉందని వివరించారు. ఆ భూమి కూడా కొందరి ఆక్రమణలో ఉందని త్వరలో వాటిపై కూడా దృష్టి పెట్టి ఆలయానికి వచ్చే విధంగా ఆలయ కమిటీతో కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఆలయంలో ప్రవేశపెట్టిన వస్త్ర సేవ కార్యక్రమం ద్వారా సంవత్సరానికి 60000 ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు .

40 మంది రిత్వికులతో మహా కుంభాభిషేకం ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ.

ఆలయ మరమ్మతు పనులు పూర్తయిన తర్వాత ఏప్రిల్ 19 నుంచి 23వ తేదీ వరకు మహా కుంభాభిషేకం 40 మంది రిత్వికులచే చెప్పటనన్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ తెలిపారు. ఏప్రిల్ 19వ తేదీ పరశురామేశ్వర స్వామి జయంతి సందర్భంగా మహా కుంభాభిషేకం ప్రారంభమై 23వ తేదీ వరకు జరుగుతుందన్నారు. 42 రోజులు దర్శనం బాలాలయంలోనే జరుగుతాయని ప్రధాన అర్చకులు తెలిపారు.

# సహజ వ్యవసాయ కొనుగోలు--అమ్మకందారుల నెట్‌వర్కింగ్ సమావేశం

## ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారం--రైతు ఆదాయం రెండింటి పెరుగుదల సాధ్యం

## సహజ పద్ధతుల విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి - జిల్లా కలెక్టర్. డా ఎస్. వెంకటేశ్వర్




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో సహజ వ్యవసాయ ఉత్పత్తులకు రాష్ట్ర స్థాయిలో బలమైన మార్కెట్ వేదికను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొనుగోలు--అమ్మకందారుల నెట్‌వర్కింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోవడం, ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం అవసరం మరింతగా పెరిగిందని అధికారులు పేర్కొన్నారు. సహజ వ్యవసాయం అనుసరించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు స్థిరంగా ఉంటాయని వివరించారు. యూరియా, రసాయన ఫర్టిలైజర్లు, పెస్టిసైడ్ల వినియోగం తగ్గించడం వల్ల నేలలో జీవ వైవిధ్యం పెరిగి, తేమ నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన అవశేషాలు లేని ఆహారం ప్రజలకు అందించడం ద్వారా ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సహజ పద్ధతిలో ఉత్పత్తి చేసిన ధాన్యాలు, పండ్లు, కూరగాయలకు మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సహజ వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ రైతు సాధికార సంస్థ (ఆర్ వై ఎస్ ఎస్) ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పూర్తిగా సహజ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో చేసిన పరిశీలనల్లో ఒకే భూమిలో సగం భాగంలో సహజ వ్యవసాయం, మిగతా భాగంలో సాంప్రదాయ పద్ధతులు పాటించినప్పుడు సహజ పద్ధతిలో సాగు చేసిన పంటలు ఎక్కువ నిలకడగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. ముఖ్యంగా తేమ నిల్వ, కీటక నిరోధక శక్తి, భూమి గట్టితనం వంటి అంశాలలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు. సహజ ఉత్పత్తులకు సరైన ధర లభించేందుకు రైతు--కొనుగోలు దారుల నేర అనుసంధానం అవసరమని పేర్కొన్నారు. మధ్యవర్తులను తగ్గించి ప్రత్యక్ష మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అలాగే సర్టిఫికేషన్ ప్రక్రియను విస్తరించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు, మెరుగైన ధరలు సాధ్యమవుతాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో డ్రిప్ ఇరిగేషన్, తక్కువ నీటితో సాగు, పంటల విభిన్నీకరణ (డైవర్సిఫికేషన్) అవసరమని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అధిక శాతం మామిడి పంట సాగవుతున్న నేపథ్యంలో ఇతర తోటల పంటలు, ఫ్లోరికల్చర్, మిల్లెట్స్ వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని కోరారు.




దేశంలోనే పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉన్న నేపథ్యంలో సహజ వ్యవసాయాన్ని విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని మరింత పెంచవచ్చని తెలిపా రు. రైతు సాధికార సంస్థ సీఈఓ బి. రామారావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సహజ వ్యవసాయం రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించి, రైతులు మరియు వినియోగదారుల మధ్య బలమైన డిమాండ్--సరఫరా వ్యవస్థ ఏర్పడుతుంది. రైతులకు స్థిరమైన మార్కెట్, న్యాయమైన ధర లభించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, రసాయన రహిత ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. ఇటువంటి నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు సహజ వ్యవసాయాన్ని ఆర్థికపరంగా స్థిరంగా నిలబెట్టేందుకు దోహదపడతాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. ప్రసాదరావు, డి పి యం షణ్ముగం ఏ ఎన్ జి ఆర్ ఏ యు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. వి. సుమతి, డాక్టర్ వైఎస్ఆర్ హెచ్ యు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ బి. గోవిందరాజులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, రాష్ట్ర =ఖూూ బృంద సభ్యులు, వివిధ జిల్లాల అధికారులు జశ్వంత్ మిల్లెట్స్, గురునాథ్ మిల్లెట్స్, శ్రీ సర్వలక్ష్మి నేచురల్స్, విశ్వభారతి నేచురల్స్, పలమనేర్ ఫార్మ్స్, సస్టైన్ ఈట్స్ (నెల్లూరు), ఐటీసీ ప్రతినిధులు, గో సహజ నేచురల్ ఫార్మ్స్, రైతు నేస్తం , జస్ట్ మిల్లెట్స్, ప్రకృతి రేఖ తదితర కొనుగోలు దారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీదేవి కాంప్లెక్స్ గేటు వద్ద ఇద్దరు ముద్దయిలు అరెస్ట్

**- దొంగిలించిన మొబైల్ ఫోన్లు, బంగారు నగలు స్వాధీనం.**
**- తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపిఎస్ ఆదేశాల మేరకు,**

ప్రజా భూమి ప్రతినిధి: తిరుపతి



తిరుపతి టౌన్ డీఎస్పీఎం. భక్తవత్సలం ఆధ్వర్యంలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ కె. శ్రీనివాసులు, ఎస్ఐలు ఓ. రామస్వామి,టీ. ఇమామ్ హుస్సేన్ బాబా,ఈస్ట్ పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టి ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. అరెస్ట్ కాబడిన ముద్దాయిల వివరాలు: ఇంద్రావత్ పవన్ కుమార్ నాయక్ (24 సంవత్సరాలు), తలుపుల మండలం, అనంతపురం జిల్లా. ఎరగ అశోక్ (23 సంవత్సరాలు), కురబలకోట మండలం, అన్నమయ్య జిల్లా. నేరం జరిగిన విధానం: అనంతపురం జిల్లా కు చెందిన ఏ1 ఇంద్రావత్ పవన్ కుమార్ నాయక్ మరియు అన్నమయ్య జిల్లాకు చెందిన ఏ2 ఎరగ అశోక్ కలిసి తిరుపతిలోని విష్ణు నివాసం, శ్రీనివాసం, బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. చార్జింగ్‌కు పెట్టి నిద్రపోతున్న వారి మొబైల్ ఫోన్లను అపహరించడం, గది తలుపులు సరిగా వేయకుండా నిద్రిస్తున్న వారి గదుల్లో అర్ధరాత్రి సమయంలో ప్రవేశించి బంగారు నగలు, నగదు ,మొబైల్ ఫోన్లు దొంగిలించడం వీరి విధానంగా, దొంగిలించిన ఆస్తులను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అరెస్ట్ మరియు స్వాధీనం వివరాలు: ఇటీవలి కాలంలో విష్ణు నివాసం మరియు బస్ స్టాండ్ ప్రాంతాల్లో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో, 04-03-2026 తేదీ ఉదయం 11.00 గంటలకు తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ గేటు వద్ద దొంగిలించిన బంగారు నగలు మరియు సెల్ ఫోన్లు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పోలీసులకు రాబడిన సమాచారంతో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకోని వారి వద్ద నుండి: రూ.2,50,000/- విలువగల 14 మొబైల్ ఫోన్లు రూ. 3,00,000/- విలువ గల 30 గ్రాములబంగారునగలు. స్వాధీనం చేసుకున్నారు. విరిపై కేసు నమోదు చేసి నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచారు. ప్రజలు బస స్టాండ్లు, లాడ్జీలు, యాత్రికుల నివాసాల్లో అప్రమత్తంగా ఉండి తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు.

# శ్రీ మహా మండలేశ్వర స్వామి వారి ఆలయం శంకుస్థాపన

ప్రజా భూమి ప్రతినిధి,
రామచంద్రాపురం



రామచంద్రాపురం మండలం ఛాయాపురంలో ఉంగరాల సుబ్రహ్మణ్య శర్మ శ్రీ మహా మండలేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయల చెరువు పంచాయతీ ఛాయాపురంలో శ్రీ శనీశ్వర స్వామి ఆలయ



ధర్మకర్త ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ శ్రీ మాండలేశ్వర స్వామి వారి ఆలయానికి బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు మేన లగ్నంలో ఆలయ శంకుస్థాపనకు వేదమంత్రాలుతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రపురం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్ష తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి వారు క్రుషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం పీఠాధిపతులు శ్రీ కమలానంద సరస్వతి స్వామివారు, పిఠాపురం ఆస్థాన పండితులు సుబ్రహ్మణ్య శర్మ స్వామి వారు, పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి ఏఐఎఫ్ఇటిఓ జాతీయకార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం

ప్రజాభూమి పోరుమామిళ్ల :



దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోక పెండింగులో ఉన్న మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎఫ్ఇటిఓ(ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్) జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి,ఎస్టీయు జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నరసాపురం లోని ఏపీ మోడల్ స్కూల్ నందు ఇటీవల ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పి.రమణారెడ్డికి అభినందన సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటుచేసిన మోడల్ స్కూల్స్ లో పనిచేసే టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనపరుస్తుందన్నారు. సర్వీస్ రూల్స్ లేని కారణంగా పలురకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలనీ, కారుణ్య నియామకాలకు నోచుకోని మోడల్ స్కూల్ టీచర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఏపీఎంఎస్ ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ లోని ఖాళీలను భర్తీ చేసి,యాక్షన్ ప్లాన్,పరీక్షల నిర్వహణ,విద్యాశక్తి తదితర కార్యక్రమాలతో తీరిక లేకుండా పని చేస్తున్న వారిపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు.శాశ్వత బదిలీల చట్టంలో మోడల్ స్కూల్ టీచర్లను కూడా చేర్చి,బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు.వీరి పోస్టులు జోనల్ పోస్టులు అయినందున అంతర జోనల్ బదిలీలు చేపట్టి దూర ప్రాంతాలలో పనిచేస్తున్న వారికి అవకాశం కల్పించాలన్నారు.టీజీటీలకు పీజీటీలు గాను,పీజీటీలకు జూనియర్ లెక్చరర్లు గాను పదోన్నతులు చేపట్టాలన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచి,రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విపరీతమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న హిందీ మరియు తెలుగు పోస్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.హాస్టల్ యందు ఉన్న పిల్లలకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య,వైస్ ప్రిన్సిపాల్ చంద్ర, సీనియర్ ఉపాధ్యాయులు బాలిరెడ్డి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు తదితర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డెలివరీ బాయ్ దిలీప్ హత్య మానవ హక్కుల ఉల్లంఘనే - నిందితులకు కఠిన శిక్ష విధించాలి : హ్యూమన్ రైట్స్ సభ్యులు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కాశినాయన మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన కందుల దిలీప్ ఫ్లిప్కార్ట్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దాదాపు రెండు వారాల క్రితం గుర్తుతెలియని దుండగులు దిలీప్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను తొలుత పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి, అనంతరం కడప (రిమ్స్) ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగానే గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మార్చి రెండవ తేదీన "దిలీప్‌కు న్యాయం జరగలేదు" అంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ ఎదుట శవాన్ని ఉంచి ఆందోళనకు ఇక నిమిషం కూడా తెలిసిందే. ఈ ఘటనపై పోరుమామిళ్ల ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణిరావు, ప్రెస్ సెక్రెటరీ ప్రవీణ్ స్పందిస్తూ ఒక పేద కుటుంబానికి ఆధారమైన యువకుడిని సజీవదహనం చేయడం మానవ హక్కులపై జరిగిన దాడి అన్నారు. ఇది కేవలం హత్య కేసు మాత్రమే కాదు… సమాజానికి హెచ్చరికగా మారిన ఘటన. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి కఠిన శిక్ష విధించాలి. చట్టం ముందు ధనికుడు -- పేదవాడు అనే తేడా ఉండకూడదు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం, ఉద్యోగ భరోసా కల్పించాలి." అని స్పష్టం చేశారు. దిలీప్ మరణించే ముందు ఇచ్చిన వాగమూలాన్ని బట్టి తన ఫోన్ డేటాలో ఎవరెవరి నంబర్లు ఉన్నాయో డీటెయిల్స్ తీసుకొని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిజమైన నిందితులను బయటకు తీసుకురావాలని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని హ్యూమన్ రైట్స్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

# డిగ్రీ జీవితం విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది - డా. పువ్వాడి వేణు

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర మరియు తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ సహాయ ఆచార్యులు డా. పువ్వాడి వేణు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ జీవితం విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి, మంచి ఉద్యోగ అవకాశాలకు కీలక దశ అని పేర్కొన్నారు. విద్యా మరియు వృత్తి పరమైన అభివృద్ధికి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పరిశోధన పట్ల ఆసక్తి పెంపొందించుకుంటే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ పరిశోధనా సంస్థల నుంచి నిధులు పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. డిగ్రీ స్థాయిలోనే సరైన మార్గదర్శకత్వం లభిస్తే విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో సీట్లు సంపాదించడమే కాకుండా జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరవచ్చని, భాష ఏదైనా కావొచ్చు, దేశీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరై ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో ఉన్నత విద్యాపట్ల అవగాహన పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# రాజంపేటలో ఉధృతంగా జనసేన సభ్యత్వ నమోదు


## స్వయంగా పాల్గొన్న సమన్వయకర్త అతికారి కృష్ణ



ప్రజాభూమి, రాజంపేట: జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాజంపేట నియోజకవర్గంలో జనసేన 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ బుధవారం భువనగిరిపల్లె, ఊటుకూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, స్వయంగా సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు.అతికారి కృష్ణ గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించారు. భువనగిరిపల్లె మరియు ఊటుకూరు పరిధిలోని యువకులు, మహిళలు మరియు కార్యకర్తలకు ఆయన స్వయంగా సభ్యత్వాలను అందజేశారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే భరోసా గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా క్రియాశీలక సభ్యులకు (ఉద్యమి) లభించే రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, ఇతర పార్టీ పరమైన ప్రయోజనాలను ఆయన నొక్కి చెప్పారు "మెంబర్ షిప్ నుండి లీడర్ షిప్"అనే నినాదంతో సామాన్యులను కూడా నాయకులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జనసేన సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు పార్టీ తరఫున ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల బీమా సౌకర్యం. శాశ్వత పూర్తి వైకల్యానికి రూ. 5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ. 2.5 లక్షల వరకు సాయం అందచేస్తారని వివరించారు. ప్రమాద సమయంలో తక్షణ వైద్య సాయం కింద రూ. 50,000 వరకు నగదు భరోసా. రాబోయే రోజుల్లో పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పదవుల్లో సభ్యత్వం ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. మార్చి 10వ తేదీ వరకు ఈ సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని అతికారి క్రిష్ణ పిలుపునిచ్చారు.

# ఘనంగా ట్రిపుల్ ఐటీలో ఆధ్య హ్యాకథాన్ 2026

ప్రజాభూమి, వేంపల్లె



ఆర్జీయూకేటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో బుధవారం ఆధ్య హ్యాకథాన్ 2026 ఘనంగా నిర్వహించారు. సి-ఎస్-ఇ విభాగాధిపతి డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 50కి పైగా టీమ్స్ పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటీతో పాటు, ఇతర విద్యా సంస్థల విద్యార్థులు కూడా హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో ఇంకా చురుకుగా పాల్గొని తమ ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రస్తావించారు. హ్యాకథాన్‌లో గెలిచిన విద్యార్థులకు రూ. 12,000 నగదు బహుమతిగా అందించారు. నగదు ప్రోత్సాహకంగా సి-ఎస్-ఇ డిపార్ట్మెంట్ మాజీ విద్యార్థులు ప్రవీణ్ కుమార్ మరియు శివప్రసాద్ అందించారు. పూర్వ విద్యార్థుల ప్రోత్సాహాన్ని విభాగాధిపతి డాక్టర్ రత్నకుమారి అభినందించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ పాలు పాల పదార్థములపై అవగాహన కార్యక్రమం - అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రామచంద్ర

ప్రజాభూమి, కడప సిటీ:

కడప నగరములో పాలు, పాల పదార్థాల యొక్క కల్తీని నివారించుటకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత, మెడికల్ ఆఫీసర్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో పాలు, పాల పదార్థముల కల్తీను గుర్తించు విధానంపై అవగాహన సదస్సు కార్యక్రమం డిఎల్టిసి కాలేజ్ నందు ఐటిఐ సర్కిల్ నందు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మాట్లాడుతూ కల్తీ పాలు,ఇతర కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే సంచాలకులు 08645-2410295,జాయింట్ ఫుడ్ కంట్రోలర్ 944037975 5 నెంబర్ల కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.పాల వ్యాపారులు వారి స్వలాభం కోసం పలు రకాల ప్రమాదకరమైన రసాయనాలు, యూరియా,డిటర్జెంట్ పౌడర్, నూనె,సింథటిక్ పాలనుతయారుచేస్తున్నారని,ఇవి తాగిన వారికి అజీర్ణం, వాంతులు, జీర్ణకోశ సంబంధిత సమస్యలు మొదలైనవి వస్తాయని తెలిపారు. ఇలాంటి కల్తీ పాలు ఇతర కల్తీఆహారపదార్థములు తయారీకి పాల్పడితే వారిపై ఎఫ్ఎస్ఎస్ఐ యాక్ట్ 2006 ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తామని ఫుడ్ కంట్రోలర్ అధికారులుహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు పాల విక్రయదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయానికి రూ.లక్ష వితరణ

## - ఆలయ వ్యవస్థాపకుడు ఎమ్. రవికుమార్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని సాయినగర్ లో నూతనంగా వెలసిన శ్రీ దుర్గమ్మ ఆలయానికి దాత శ్లోక పాఠశాల కరస్పాం డెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి రూ.లక్ష వితరణ చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పీటీసీ సభ్యుడు ఎమ్. రవికుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్స వాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు రవికుమార్ రెడ్డి తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దుర్గమ్మ కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. అలాగే వేద పండితులతో విశేష, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామన్నారు.

# అన్ని దానాలలోకన్నా విద్యాదానం శ్రేష్ఠం

## - జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

అన్ని దానాలలో కన్నా విద్యాదానం అత్యంత శ్రేష్ఠమని కడప జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. యూఎల్ఎల్ఏఎస్ (అక్షరాంధ్ర) కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల సందర్భంగా మండలంలోని పాములూరు గ్రామం మరియు వేంపల్లె 4వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా చదవడం, రాయడం అభ్యసించి నిరక్షరాస్యతను నిర్మూలించాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు విద్యను అభ్యసించడం ద్వారా వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి కుళ్లాయమ్మ మాట్లాడుతూ మహిళలు విద్యను అభ్యసించడం ద్వారా మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఏపీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 3,077 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు బుధవారం పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. మహిళలు చదువుకుంటే కుటుంబాలు సంతోషంగా, ఆర్థికంగా బలపడతాయని అన్నారు. కార్యక్రమంలో సీసీలు రామలింగయ్య, అనిల్, జయలక్ష్మి, బాబు, రెడ్డయ్య రెడ్డి, సదాశివుడు, ప్రసాద్, గ్రామ సమాఖ్య అసిస్టెంట్‌లు, వాలంటీర్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ



ప్రజాభూమి, రాజంపేట: రాజంపేట లోని స్థానిక ఉస్మాన్‌నగర్ పరిధిలో వున్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ రాజంపేట వారి ఆధ్వర్యంలో ఎగ్జామ్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ హాజరై, విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మార్చి 16 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ కష్టపడి చదివి, మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు యస్.వి రనణ (గీతాంజలి విద్యాసంస్థలు) , లాయర్ లక్ష్మి నారాయణ, క్రిష్ణ కుమార్, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ సుధాకర్ బాబు, రాజశేఖర్ నాయక్, సింగిల్ విండో అధ్యక్షుడు మాడా జయక్రిష్ణ, సుదర్శన్ థియేటర్ అదృష్ట మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి కన్వీనర్ రామముని రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాభూమి, వేంపల్లె



తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రామముని రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామముని రెడ్డిని శాలువాతో సత్కరించి, ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతం కోసం ఆయన సేవలు మరింత విస్తరించాలని నాయకులు పేర్కొన్నారు. అనంతరం రామముని రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల సమక్షంలో తన జన్మదినాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల అండదండలతో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్లు విస్మరించిన కూటమి ప్రభుత్వం

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అన్వర్ మండిపాటు



ప్రజాభూమి పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న కొత్త పెన్షన్లను మంజూరు చేయకపోవడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ మండిపడ్డారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ డబ్బా కొట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం, కొత్త పెన్షన్ల అమలులో వైఫల్యం చెందిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బోగస్ పెన్షన్ ల ఏరివేత పై ఉన్న మక్కువ కొత్త పెన్షన్ల చేరివేతపై లేకపోవడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం చివరి రెండుసంవత్సరాల కాలం నుంచి, ఇప్పుడు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేయకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. పెంచిన నాలుగు వేల రూపాయల పెన్షన్ ని ప్రతినెలా చూపిస్తూ,భర్త చనిపోతే ఆ పెన్షన్ భార్యకిస్తూ (స్పౌస్ పెన్షన్) సంబరపడుతున్న కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇప్పటివరకు మంజూరు చేయకపోవడం చాలా దారుణమని, ఎంతోమంది వృద్ధులు ఎలాంటి ఆసరా లేక కనీసం మందులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులు రాష్ట్రంలో కోకొల్లలుగా ఉన్నాయని ఇప్పుడైనా మేలుకొని ఇలాంటి వారికి ప్రభుత్వసాయం అందేలా కొత్త పెన్షన్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రతినెలా పెన్షన్లను వీధి వీధి తిరుగుతూ ఫోటోలకు ఫోజులు ఇస్తున్న కూటమి ప్రభుత్వం, 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ అని చెప్పి బీసీలను కూడా మభ్యపెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడైనా చెప్పిన మాట ప్రకారం బీసీలకు మరియు వృద్ధులకు కొత్త పెన్షన్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కొండ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

## ప్రత్యేక పూజలో పాల్గొన్న వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని నగిరిగుట్టలో కొలువై ఉన్న కొండ గంగమ్మ తల్లికి వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని ఇరికిరెడ్డి వీరారెడ్డి 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అభిమానులు, ఏర్పాటు చేసిన కేకు ను ఆయన కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేసి వారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ రసూల్ , దేరంగుల చంద్రమౌళి, చెన్నూరు కార్తీక్,దాసరి ఈశ్వరయ్యలుమాట్లాడుతూ వీరారెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నా రు. వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తక్కువ ధరకే మినరల్ వాటర్ ప్రజలకు అందజే యడం జరుగుతుందన్నారు. వీరారెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందుగా వీరారెడ్డిని దుశ్శాలవాతో పూలహా రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

## రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న తులసి రెడ్డి, రాఘవరెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని పులివెల్ల రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో చింతలజూటూరు అంజిరెడ్డి కుమారుడి పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్. తులసి రెడ్డి , పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టిడిపి కడప పార్లమెంటు ఉపాధ్యాక్షులు తూగుట్ల. రాఘవ రెడ్డి , టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి పూజారి. వీరభద్రా రెడ్డి, మైనారిటీ నాయకుడు ఇనయ్ తుల్లా లు నూతన వధూవరులను దీర్ఘ సుమంగళీభవ అని ఆశీర్వదిం చారు. అనంతరం అంజిరెడ్డి ఏర్పాటుచేసిన విందులో వారు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్

గురువారం, మార్చి 05, 2026





## రిలయన్స్ సౌజన్యంతో రూ.20 లక్షల ఆరోగ్య భీమా పాలసీ ప్రారంభం

ప్రజాభూమిప్రతినిధి,మచిలీపట్నం :

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పోస్టల్ శాఖ మరో ప్రజాహిత కార్యక్రమంతో ముందుకొచ్చింది. ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో, కేవలం రూ. 5,698 ప్రీమియంతో ఒక కుటుంబంలోని నలుగురికి వర్తించే రూ. 20 లక్షల ఆరోగ్య భీమా పాలసీని బుధవారం పోస్టల్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, రిలయన్స్ సౌజన్యంతో తీసుకువచ్చిన ఈ నూతన పాలసీ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. పోస్టాఫీస్ ద్వారా పాలసీ తీసుకున్న వారికి ఒక సంవత్సరం పాటు ఈ ఆరోగ్య భీమా వర్తిస్తుందని ఆయన వివరించారు. తక్కువ ప్రీమియంతో భారీ కవరేజ్ కల్పించడం ఈ పాలసీ ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రులలో పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ఈ పథకం కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది ప్రజలకు పాలసీ వివరాలను తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పోస్టల్ శాఖ పిలుపునిచ్చింది."పోస్టల్ సేవలను వినియోగించుకోండి ఆరోగ్య భద్రతను సొంతం చేసుకోండి అని అధికారులు ప్రజలకు సందేశమిచ్చారు.

## కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని పిలుపు



మచిలీపట్నం (ప్రజా భూమి ప్రతినిధి)

ఉపాధి హామీ పథకం పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి గారు తలపెట్టిన కృష్ణా జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ మేరకు బుధవారం మచిలీపట్నం లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంతేటి రామమూర్తి గారు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షర్మిల రెడ్డి గారు కృష్ణా జిల్లాలోని గుడివాడ మరియు అవనిగడ్డ ప్రాంతాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి, ప్రజల పక్షాన పోరాడటానికి ఈ కార్యక్రమం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.ముఖ్య అంశాలు:పాల్గొనే నాయకులు: ఈ సమావేశంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు కురడి నాగరాజు గారు మాట్లాడుతూ, జిల్లాలోని 7 నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, మహిళా సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.పాల్గొన్న ఇతర నాయకులు: ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సాయిన పవన్ దీర్ ,నల్లిబోతుల కుమారి, కొమ్మూరి చంద్రశేఖర్, సయ్యద్ అహ్మద్, అయాజ్, డాక్టర్ జమాని బేగం, చిలుకోటి ప్రసాద్, గరికపాటి శంకర్ రావు, ప్రసాద్ చౌదరి, సోమిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్ర భవిష్యత్తు కోసం, పేదల ఉపాధి హక్కుల కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## సీఎం కార్యదర్శి మిశ్రా పై జిల్లా ప్రజల ఆగ్రహం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం ప్రతినిధి:

కలెక్టర్ అంటే జిల్లాకు పెద్ద. ఎస్పీ అంటే జిల్లా పోలీస్ బాస్. కలెక్టర్ కావడం అంటే మామూలు విషయం కాదు. అందుకోసం దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్ష సివిల్స్ లో టాపర్గా నిలవాలి. ఈ పరీక్షలో విజయం సాధించడమంటే, వారు దేశంలోనే అత్యంత ప్రతిభావంతులుగా కీర్తించబడతారు. సివిల్స్ కు ఎంపికైన వారు కేవలం వ్రాత పరీక్ష లో విజయం సాధిస్తే సరిపోదు, వారి యొక్క సమయస్ఫూర్తి, ఖచ్చితత్వం, చురుకుదనం, మాటతీరు, భావ వ్యక్తికరణ అన్నింటా వడపోసి మరీ సివిల్స్ అధికారిని ఎంపిక చేస్తారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పోస్టు ఐఏఎస్ (సివిల్స్).ఐఏఎస్ అధికారికి ఎలాంటి షూ ధరించాలి, ఎలా ప్రవర్తించాలి అని చెప్పడ మం టే... అలా చెప్పిన వారిని ఖచ్చితంగా ఒక దురహంకారపూరితమైన వ్యక్తి అని అనక తప్పదేమో! అలాంటి అమర్యాదపూర్వక చర్య ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా - కృష్ణా జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ, జిల్లా ఎస్పి వి వి విద్యాసాగర్ నాయుడు మధ్య చోటు చేసుకుంది. దాంతో ఒక ఐఏఎస్ అధికారితో మరో ఐఏఎస్ అధికారి అనుచితంగా వ్యవహరించడం తీవ్ర చర్చనీయంశమైంది. కృష్ణా జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ, కృష్ణా జిల్లా ఎస్పి వి వి విద్యాసాగర్ నాయుడు పట్ల ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ మిశ్రా అనుచితంగా వ్యవహరించినట్లు ఒక ప్రముఖ దిన పత్రిక వార్త ప్రచురించింది. పత్రికా కథనం ప్రకారం ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర పర్యటన ముగిసిన అనంతరం అధికారులంతా గన్నవరం ఎయిర్పోర్టు లాంజ్ లో ఉండగా అక్కడికి సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా వచ్చారు. కృష్ణా కలెక్టర్ డీకి బాలాజీని పిలిచి... టై కట్టుకోవడమేమిటి? కోటు అలాగేనా వేసుకునేది, లేస్ ఉన్న షూస్ వేసుకోలేదంటూ మండిపడ్డారు. అనూహ్య ఘటనతో బాలాజీ ఒక్కసారిగా విస్తుపోయారు. అదేం లేదు సార్, అంటూ నవ్వుతూ సర్దుకుపోయే ప్రయత్నం చేశారు. ఏం నవ్వుతున్నావ్? తమాషాగా ఉందా? అంటూ మరింత గా మిశ్రా రెచ్చిపోయారు. ఆగకుండా ఐదారు నిమిషాల పాటు అందరూ వినేలా నోటికి పని చెప్పారు.అంతటితో శాంతించకుండా పక్కనే ఉన్న కృష్ణా జిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడిని తన దగ్గరికి వచ్చాక సిదా ఖడో (సరిగ్గా నిల్చో) అంటూ హుకుం జారీ చేశారు. సర్, నేను సరిగ్గానే ఉన్నాను అని అంటుండగా ఏమిటి నోరు లేస్తోంది తమాషాలు చేయకు అని అరిచారు. హుందాగా వ్యవహరించవలసిన సీనియర్ అధికారి ఇష్టారీతిన వ్యవహరించడంతో అక్కడున్న అధికారులు విస్తు పోయారు. ఆయన అంతటితో ఊరుకోకుండా... కలెక్టర్ కు కొరియర్ లో' లేస్ ఉన్న బూట్లు పంపినట్లు తెలిసింది. ఈ వార్త కృష్ణా జిల్లా అధికార యంత్రాంగంతో పాటు, జిల్లా పోలీస్, జిల్లా ప్రజలను కోపోద్రిక్తుల్ని చేసింది. సీఎం కార్యదర్శి అంటే స్కూల్ హెడ్మాస్టర్ అనుకుంటున్నారా? తన తోటి అధికారులు స్కూలు పిల్లలు అనుకుంటున్నారా? ఐఏఎస్ అధికారి కి డ్రెస్ కోడ్ గురించి, షూ గురించి చెప్పడం, ఐపీఎస్ అధికారికి ఎలా నిలబడాలో చెప్పడం హాస్యాస్పదంగా ఉంది అంటూ జిల్లా అధికారుల నుండి, జిల్లా ప్రజల నుండి తీవ్ర అసహనం, వ్యతిరేకత వినిపిస్తుంది.డి కె బాలాజీ శైలి సౌమ్యుడిగా, నిరాడంబరుడిగా, కష్టపడే అధికారిగా, వివాదరహితుడిగా పేరున్న బాలాజీ, తన విలక్షణమైన పనితీరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చేత పలు సందర్భాలలో ప్రశంసలు పొందడమే కాకుండా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు సైతం దక్కించుకున్నారు. గత సంవత్సరం ముసోలినీలో జరిగిన కలెక్టర్ల శిక్షణలో సైతం టాపర్ గా నిలిచారు. అవార్డులతో పాటు తన పనితీరుతో ప్రజల నుండి సైతం మెప్పు పొందుతూ ముందుకు సాగుతున్నారు. అలాగే యువ ఐపీఎస్ అధికారి విద్యాసాగర్ సైతం తనదైన శైలిలో శాంతి భద్రతల పరిరక్షణలో దూకుడుగా వ్యవహరిస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతున్నారు. అలాంటి అధికారులను ముఖ్యమంత్రి కార్యదర్శి మిశ్రా నిష్కారణంగా అవమానించడం తగదు. జిల్లా కలెక్టర్ ను అవమానించడమంటే జిల్లా ప్రజలను అవమానించినట్లే అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతుంది. దీనిపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి మిశ్రా పై శాఖాపరమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.



## మునిసిపల్ సూపర్ స్ట్రక్చర్ పన్ను దేనికైనా వర్తిస్తుంది:జిల్లా కలెక్టరు

ప్రజాభూమిప్రతినిధి,మచిలీపట్నం :

వచ్చే మే నెల ఒకటో తేదీ నుండి చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు దొరలకుండా సజావుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గణన చార్జ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మొదటి దశ ఇండ్ల జాబితా, ఇండ్ల గణన జిల్లా చార్జ్ స్థాయి అధికారుల శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మాదిరిగా ఈ ఇండ్ల గణన కార్యక్రమాన్ని కూడా చాలా తీవ్రంగా పరిగణించి శ్రద్ధతో చేయాలన్నారు. ఈ గణన కార్యక్రమంలో సరైన వివరాలు నమోదు చేయడం అందరి బాధ్యత అన్నారు.కొందరు ఇంటి యజమానులు కింది అంతస్తు నిర్మించుకున్న తర్వాత మొదటి అంతస్తు కొత్తగా నిర్మించుకుంటారని వాటికి నంబరు తీసుకోకుండా ఉంటారని చెప్పారు. అలాగే కొన్నిసార్లు అసైన్మెంట్, ప్రభుత్వ భూములకు ఇంటి స్థలాలుగా ఇచ్చి ఉన్న వాటికి నంబరు ఇవ్వవచ్చా లేదా అనే చాలామంది మీమాంసలో కూడా పడతారన్నారు. వాస్తవంగా మున్సిపల్ చట్టం ప్రకారం సూపర్ స్ట్రక్చర్ పన్ను దేనికైనా వేయవచ్చున్నారు. ప్రతి ఇంటి పన్ను చెల్లింపుదారునికి నంబర్ తప్పనిసరిగా ఎన్యుమరేటరు ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు.ప్రతి ఒక్కరూ ఇండ్ల జాబితా గణన ఎలా చేయాలో పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. అప్పుడే వారు ఎన్యూమరేటర్లకు సరైన శిక్షణ ఇవ్వగలుగుతారన్నారు. ఎన్యూమరేటర్లను నియామకంపై త్వరలో స్పష్టత వస్తుందని ఆ తదుపరి వారిని నియమించుకుని వారికి కూడా శిక్షణా తరగతులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.ప్రతి ఎన్యూమరేటరు వారికి ఇచ్చిన ఇండ్ల జాబితా బ్లాక్ లో ఏ ఏ ఇండ్లు ఉన్నాయో సరి చూసుకోవాలన్నారు వారికి ఒక ఎక్సెల్ షీట్ అందజేసి వారి పరిధిలో ఉన్న 700 నుంచి 800 ఇండ్లకు సంబంధించి నంబర్లు జాబితా ఇస్తే త్వరగా పని పూర్తవుతుందన్నారు.అందరితో కలిపి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తామని ఎవరికైనా ఏమైనా అనుమానాలు ఉంటే అందులో తెలియజేస్తే వివరణలతో నివృత్తి చేస్తామన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ చంద్రశేఖర రావు, మచిలీపట్నం గుడివాడ ఆర్డీవోలు సాంబశివరావు, బాలసుబ్రమణ్యం, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, జడ్పి సిఈఓ కన్నమనాయుడు, డిపిఓ అరుణ, పలువురు తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## ఒడిశాలో వీల్‌చైర్ క్రికెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం

### తూర్పుగోదావరి క్రీడాకారుల ప్రతిభకు అభినందనలు తెలిపిన తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి




ప్రజాభూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

దివ్యంగ్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అఫ్ ఇండియా ఆధ్వర్యంలో, సమీర్ దివ్య సాహిత్య ట్రస్ట్ నిర్వహణలో ఒడిశా రాష్ట్రంలో ఫిబ్రవరి 21 నుండి 23 వరకు జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది.

ఈ జట్టులో మొత్తం 8 మంది క్రీడాకారులు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు కావడం విశేషం.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి క్రీడాకారులను అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభతో రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిపాలన తరఫున అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శేషగిరి, యోగా కోచ్ నాగేంద్ర, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, చెస్ కోచ్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.




## సహజ వ్యవసాయానికి జిల్లా పరిపాలన ప్రాధాన్యం

### కలెక్టరేట్‌లో అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహణ...

### కలెక్టర్ కీర్తి చేకూరి



ప్రజాభూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్, బొమ్మూరు నందు సహజ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం ద్వారా కలిగే ఆరోగ్య, పోషణ ప్రయోజనాలపై అవగాహన – శిక్షణా కార్యక్రమం ఘ నంగా నిర్వహించబడింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు అనుబంధంగా పనిచేస్తున్న ఏపీ సీ ఎన్ ఎఫ్ రైతు సాధికార సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్య అతిథిగా హాజరై అధ్యక్షత వహించారు.రసాయన వ్యవసాయానికి దూరంగా, ఆరోగ్యకర జీవనానికి సహజ వ్యవసాయం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి రసాయన వ్యవసాయం, పురుగు మందులు, యూరియా వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని స్పష్టంగా పేర్కొన్నారు. సహజ వ్యవసాయం ద్వారా పండించిన ఆహారాన్ని వినియోగించడం వల్ల కుటుంబ ఆరోగ్యం కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాలకు సురక్షితమైన జీవన విధానం అందించవచ్చని తెలిపారు. ఇంటి వద్ద స్థలం ఉన్న వారు హౌస్ గార్డెన్స్, టెర్రస్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోవాలని, సహజ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, పండ్లు, ధాన్యాలు శరీరానికి అవసరమైన పోషకాలను సమృద్ధిగా అందిస్తాయని అధికారుల ద్వారా వివరించారు.అంగన్‌వాడీ, పాఠశాలల ద్వారా సహజ ఉత్పత్తుల వినియోగం పెంపువంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు అందిస్తే సమాజంలో ఆరోగ్య స్థితి మెరుగుపడుతుందని జిల్లా స్థాయి అధికారులు అభిప్రాయపడ్డారు.ఈ అంశంపై ప్రకృతి వ్యవసాయ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పీఎం పిఎఫ్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు.

**మహిళా సంఘాల పాత్ర కీలకం ప్రణాళికల సమీక్షకు ఆదేశాలు**

ప్రాజెక్ట్ డైరెక్టర్, డి ఆర్ డి ఎ బి నాగేష్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు కమిటీలుగా ఏర్పడి గ్రామ స్థాయిలో సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రోత్సహించాలని, ఉత్పత్తుల వినియోగంపై ప్రతి సంఘ సభ్యురాలికి అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు తమ తమ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగాన్ని పెంపొందించే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, వాటి అమలును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమం సందర్భంగా రైతుల స్టాళ్లు ఏర్పాటు చేసి సహజ వ్యవసాయ ఉత్పత్తులు, ఆకుకూరలు, కూరగాయలు మరియు అవసరమైన ఇన్‌పుట్స్ ప్రదర్శించారు. రైతులు తమ అనుభవాలను పంచుకుంటూ, సహజ వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గి, వినియోగదారుల ఆదరణ పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి నాగేష్ జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ. దుర్గేష్, జిల్లా ఉద్యానవన అధికారి ఎన్. మల్లికార్జున రావు, ఏపీ సి ఎన్ ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి బి. తాతా రావు, డి ఆర్ డి ఏ.ఏపిడి సత్యం నాయుడు , సహాయ జిల్లా ప్రాజెక్టు అధికారి ఎస్. మహబూబ్ వాలి, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ కే . అరుణ కుమారి, సెక్రటరీ డి. లక్ష్మి పార్వతి , ట్రెజరర్ ఎస్కే ఫాతిమా , డి ఆర్ డి ఏ, డీపీఎం లు, ఏపీఎం లు, ఏపీ సిఎన్ ఎఫ్ జె పి ఈ లు, ఎన్ ఎఫ్ ఏ లు, మండల సమాఖ్య అధ్యక్షులు, హెల్త్ సబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కౌమార (టీనేజ్) గర్భధారణను ఐదు శాతానికి తగ్గించడమే లక్ష్యం






**శాఖల సమన్వయంతో టీనేజ్ గర్భ గర్భధారణకు ముగింపు పలుకుతాం....**

**ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక వ్యూహం...**

**గ్రామస్థాయి నుండే నివారణకు చర్యలు....**

**వృత్తి విద్యా కోర్సులతో బాలికలకు భరోసా....**

**ఏపీ ఉమెన్ కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ**

విజయవాడ ప్రజాభూమి ప్రతినిధి

కౌమార (టీనేజ్) గర్భధారణను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో బుధవారం రాష్ట్రంలో టీనేజ్ (కౌమార) దశలో గర్భం దాల్చడాన్ని నివారించేందుకు మహిళాభివృద్ధి, శ్రీ శిశు సంక్షేమం,పోలీస్, గిరిజన, వైద్య ఆరోగ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో (State level consultation on M Sectoral Strateg ies to Prevent Teenage Pregnancies in Andhra Pradesh") అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు లో ఏపీ స్టేట్ ఉమెన్స్ కమిషన్ చైర్ పర్సన్ డా .రాయపాటి శైలజ మాట్లాడుతూ కేవలం ఒకే శాఖపై ఆధారపడకుండా, వివిధ శాఖలు (మల్టీ-డిపార్ట్‌మెంటల్) కలిసి పనిచేయడం వల్ల సమస్యను వేగంగా పరిష్కరిష్కరించవచ్చునన్నారు.బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలను అరికట్టేందుకు కేవలం పిల్లలకే కాకుండా, వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించడం చాలా అవసరమని అన్నారు.వృత్తి విద్యా కోర్సుల ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధిని (Skill Development) కల్పించడంపై దృష్టి పెట్టాలని, తద్వారా వారు ఉపాధి పొందేలా చూడాలని అన్నారు. గ్రామ,మండల స్థాయి కమిటీలలో సర్పంచ్‌లను, స్థానిక నాయకులను భాగస్వా మ్యం చేసి, వారికి బాధ్యతలను అప్పగించాలని సూచించారు.టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను 'హెల్త్ మాడ్యూల్స్' ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు.సమావేశంలో చర్చించిన అన్ని అంశాలను ఒక నివేదికగా (Report) రూపొందించి, పాల్గొన్న వారందరికీ పంపిణీ చేయాలని, భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాల పద్ధతులను మార్చుకుంటూ, సమన్వయంతో పనిచేయాలని చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులతో చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ మాట్లాడు తూ.....రాష్ట్రవ్యాప్తంగా టీనేజ్ గర్భధారణలను అరికట్టడానికి విద్య, వైద్య, ఆరోగ్య, పోలీసు, మహిళా & శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు.టీనేజ్ గర్భధారణలు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ నమోదు కావటం జరుగుతుందని,ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలున్న పాడేరు, తర్వాత కర్నూలు జిల్లాల్లో సమస్య కొంత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు.అవగాహన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వ్యూహాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.పాఠశాల స్థాయిలో పిల్లలకు SRH (Sexual and Reproductive Health) హక్కులు , వ్యక్తిగత భద్రతపై అవగా హన కల్పించడం. పాఠశాల మధ్యలో మానేసిన (Dropouts) పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వల్ల సమస్య పరిష్కరించవచ్చునన్నారు.15 నుండి 16 ఏళ్లు పైబడిన బాలికలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇప్పించడం, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం, వారి సమయాన్ని ఉత్పాదక కార్యకలాపాల వైపు మళ్లించడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించామన్నారు.ఆరోగ్య శాఖ ద్వారా రిప్రొడక్టివ్ హెల్త్ మరియు మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై ప్రత్యేక ఆరోగ్య మాడ్యూల్స్ రూపొందించి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అభద్రతా స్థితిలో ఉన్న బాలికలను గుర్తించి, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో (Homes)చేర్పించి వారికి రక్షణ కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.గ్రామ స్థాయిలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ, సమస్యలను గుర్తించి, సమర్థవంతంగా అరికట్టాలని సూచించామన్నారు.టీనేజ్ గర్భధారణలను పూర్తిస్థాయిలో అరికట్టడంలో భాగంగా కనీసం ఐదు శాతం లోపుకు తగ్గించడమే లక్ష్యంగా, అన్ని శాఖల సమన్వయంతో ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నామని కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ తెలిపారు.అవగాహన సదస్సులో రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ పార్వతి, రాష్ట్ర మహిళా కమిషన్ అడ్వైజర్ రావూరి సూయజ్, చైల్డ్ రైట్స్ ఎడ్వోకసి ఫౌండేషన్ (సిఆర్ఏఎఫ్) ప్రోగ్రాం డైరెక్టర్ డా.పి.ఫ్రాన్సిస్ తంబి, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

గురువారం 5, మార్చి 2026


## పీఏసీ సభ్యుడు గొల్లపల్లి సూర్యారావును కలిసిన జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా: రాష్ట్ర ప్రజా ఖాతాల కమిటీ (పిఎసి) సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సూర్యారావు కి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ భేటీలో పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, సూర్యారావు పిఎసి సభ్యుడిగా బాధ్యతలు చేపట్టడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత చేరువ కావడం వంటి అంశాలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సూర్యారావు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## బొత్స సత్యనారాయణను పరామర్శించిన మాజీ ఎంపీ చింతా అనురాధ



ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ని పరామర్శించిన అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ.

# వెయ్యి లీటర్ల ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన కెనరా బ్యాంక్ దానికి అనుబంధంగా ఉన్న హోం లోన్స్ డిపార్ట్మెంట్ శాఖ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ( సామజిక బాధ్యత) భాగంగా స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ద్రాక్షారామ చదువుతున్న 550విద్యార్థినీ విద్యార్థులకు సుమారు 1000 లీటర్లు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ అందజేయడం జరిగింది. దీనికిసుమారు నాలుగు లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించారు. ఏ విధమైన విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపయోగపడే విధంగా 8 కె.వి సోలార్ విద్యుత్ ప్లాంట్ ను కూడా సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు . స్థానిక ద్రాక్షారామకు చెందిన కడలి హరీష్ కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ లిమిటెడ్ మేనేజర్ గా పనిచేస్తూ,తను పుట్టిన ఊరుకు ఎదో సేవ చెయ్యాలన్న ఆలోచనకు ఆచరణ రూపంలో పెట్టి గ్రామస్తులు చేత అభినందనలు అందుకున్నారు. లక్షల విలువైన ఈ ప్రణాళికను సిద్ధం చేసి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పేరిచర్ల శేఖర్, స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, అని శ్రీను ఉమాపతి హరీష్ అభినందిస్తూ చిన్న వయసులోనే ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా భవిష్యత్తులో ఉన్నతశిఖరాలు ఎదగాలని అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో స్కూలుకు కావలసిన ఏ సహాయ సహకారమైనా అందచేస్తానని తెలిపారు ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులతో ఈ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను, సోలార్ ప్లాంట్ ను సందర్శించి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ప్లే క్రాఫ్ట్ ఛాలెంజ్‌తో అంగన్వాడీలలో సృజనాత్మకతకు నాంది

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు ప్రీ-స్కూల్ కార్యకలాపాలను మెరుగుపరచే లక్ష్యంతో "ప్లే క్రాఫ్ట్ ఛాలెంజ్" అనే వినూత్న కార్యక్రమాన్ని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు నూజివీడు పరిధిలో ప్రారంభించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. నాలుగు మండలాల్లో సొంత భవనాలు ఉన్న తొమ్మిది అంగన్వాడీ కేంద్రాలను ఎంపిక చేసి, అక్కడి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించామని పేర్కొన్నారు.మండల అభివృద్ధి అధికారులు, గ్రామస్తుల సహకారంతో కేంద్రాల్లో పిల్లలు బయట ఆటలు ఆడుకునేందుకు అవసరమైన ప్లే మెటీరియల్‌ను అంగన్వాడీ



కార్యకర్తలే స్వయంగా తయారు చేశారని తెలిపారు. నెల రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం అనంతరం తుది పరిశీలనలో భాగంగా సబ్ కలెక్టర్ నాలుగు మండలాల్లోని తొమ్మిది కేంద్రాలను సందర్శించి తయారు చేసిన ప్లే మెటీరియల్‌ను పరిశీలించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కేంద్రాలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి ఆగిరిపల్లి మండలానికి లభించగా, రెండవ బహుమతి చాట్రాయి మండలానికి, మూడవ బహుమతి నూజివీడు మండలానికి దక్కింది. భవిష్యత్తులో మరిన్ని కేంద్రాలను ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేసి ప్రీ-స్కూల్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయ్ కుమారి, ఆగిరిపల్లి మండల సూపర్వైజర్లు గుర్రం రాగమయి, కమలాబాయి, ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సిహెచ్ పుల్లమ్మ, సిహెచ్ రాజకుమారి, డీవీ రమాదేవి, దుర్గ, సూర్యకళ, రజిని రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర ప్రీ ఫైనల్ పరీక్షల సందడి

**-2400 మంది వయోజనుల హాజరు**



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి గ్రామంలోని ఉర్దూ పాఠశాలలో బుధవారం నిర్వహించిన అక్షరాంధ్ర ప్రీ ఫైనల్ పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలాం, వెలుగు ఏపీఎం దయాల రాజశేఖర్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్షరాంధ్ర కార్యక్రమం ముగింపు దశకు చేరుకుందని, అభ్యర్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.దయాల రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 240 వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలో పదిమంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్‌ను నియమించామని తెలిపారు. డిజిటల్ లిటరసీ, ఫైనాన్స్ లిటరసీ వంటి అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలో గుర్తించిన 2400 మంది నిరక్షరాస్యులకు గత ఐదు నెలలుగా అక్షరాస్యత తరగతులు నిర్వహించామని, అందులో భాగంగా బుధవారం జరిగిన ప్రీ ఫైనల్ పరీక్షకు 2400 మంది హాజరయ్యారని వెల్లడించారు.కార్యక్రమంలో సీసీ దివ్య, విఓఏలు షేక్ సుభాన్, బీసీహెచ్ అరుణ, వాలంటీర్లు మరియు పరీక్ష రాసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఏపీ పర్యాటక రంగం.... ఇక 'రాష్ట్ర ఆర్థిక వృద్ధి యంత్రం'

- **శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**
- **నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో నూతనోత్తేజం - 20 నెలల కాలంలోనే రూ.19,693 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ**
- **27కు పైగా ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు జారీ .. తద్వారా 1.22 లక్షల కొత్త ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం**
- **నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పునరుద్ధరణకు శ్రీకారం - కళాకారులకు వెన్నుదన్నుగా నిల్చేందుకు ప్రభుత్వం అంగీకారం**
- **సినిమా షూటింగ్ లకు ఏపీలో ఉచిత అనుమతులు - చిన్న చిత్రాలకు భారీ రాయితీలు**
- **తిరుపతిని గ్లోబల్ డెస్టినేషన్ హబ్‌గా, విశాఖను, అమరావతిని మెగా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన**

ప్రజా భూమి ప్రతినిధి-అమరావతి

గత ఐదేళ్ల విధ్వంసం నుంచి పర్యాటక, సాంస్కృతిక రంగాలను గట్టెక్కించి ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం శాసనసభలో పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖలపై జరిగిన చర్చకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు.ఏపీ పర్యాటక రంగం ఇక 'రాష్ట్ర ఆర్థిక వృద్ధి యంత్రం'గా అభివర్ణించారు.

**పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించారని, దీనివల్ల ఇన్వెస్టర్లకు జీఎస్టీ, స్టాంప్ డ్యూటీ మినహాయింపులు, క్యాపిటల్ సబ్సిడీలు లభిస్తున్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో 20 నెలల కాలంలో 117 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.19,693 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అందులో 27 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు లభించాయని తద్వారా 1,22,637 మంది యువతకు ఉద్యోగ అవకాశాలకు మార్గం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రూ.6681 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 5 ఏళ్లలో 50వేల గదులు ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్ణయించగా 2025-26 నాటికి 5,232 బ్రాండెడ్ స్టార్ కేటగిరీ గదుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 11,272 రూమ్స్ ఏర్పాటైతే మూడింట ఒక వంతు హోటళ్లు ఏపీలోనే ఏర్పాటు కావడం కూటమి ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనమని, ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. పర్యాటక శాఖను కేవలం వినోద సాధనంగా కాకుండా, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమైన 'గ్రోత్ ఇంజిన్'గా తీర్చిదిద్దామన్నారు. 2047 నాటికి ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం కోసం విదేశీ పర్యాటకుల రాకలో టాప్ -10 రాష్ట్రాల్లో ఏపీని అగ్రపథాన నిలిపేందుకు కంకణబద్ధులై ఉన్నామన్నారు. విదేశీ పర్యాటకుల గమస్థానంగా ఏపీని తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.దేశీయ పర్యాటకుల రాకలో ఏపీ 4వ స్థానంలో ఉందన్నారు.త్వరలోనే మొదటి రెండు స్థానాల్లో నిలబెట్టడమే తమ లక్ష్యమన్నారు. పర్యాటక రంగంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ గైడ్ లైన్స్, హోమ్ స్టే మరియు బ్రెడ్, బ్రేక్ ఫాస్ట్, ఉపాధి, క్యారవాన్, ల్యాండ్ అలాట్ మెంట్ తదితర పాలసీ లతో వినూత్న ఆవిష్కరణలకు నాంది పలికామన్నారు.

**థీమాటిక్ సర్క్యూట్లు - మౌలిక వసతులు..కేంద్ర ప్రభుత్వ సాయం:**

రాష్ట్రవ్యాప్తంగా 2 బుద్ధిస్ట్, 10 టెంపుల్, 5 బీచ్, 4 రివర్ క్రూయిజ్, 3 ఎకో, 2 సీ క్రూయిజ్, సీప్లేన్ టూరిజం సర్క్యూట్ తదితర 25కి పైగా థీమాటిక్ సర్క్యూట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా తొట్లకొండ, బావికొండ, నాగార్జున కొండ, ఘంటసాల వంటి ప్రాంతాలను బుద్ధిస్ట్ సర్క్యూట్ లుగా చేయాలని నిర్ణయించామన్నారు. శ్రీశైలం నుండి హెలికాప్టర్ పర్యాటక సేవలను ప్రారంభించబోతున్నామన్నారు. ఇప్పటివరకు కేంద్రం నుండి రూ.428 కోట్ల గ్రాంట్లు సాధించి శాస్కి, ప్రసాద్, స్వదేశీ దర్శన్, సీబీడీడీ తదితర స్కీమ్ ల ద్వారా అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్, అహోబిలం, అన్నవరం, సింహాచలం, బొర్రాగుహలు వంటి 8 పర్యాటక ప్రాజెక్టులు చేపట్టి ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన చేస్తున్నామన్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో రూ.115 కోట్ల వ్యయంతో 15 హరిత హోటళ్లను ఆధునీకరించి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామన్నారు.తిరుపతిని గ్లోబల్ డెస్టినేషన్ హబ్‌గా, విశాఖను, అమరావతిని మెగా టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు..పాలసీ, పార్ట్ నర్ షిప్, ప్రాసెస్ వంటి 3పీ పాలసీతో ముందుకు వెళ్తున్నామన్నారు. పాలసీ తెచ్చి ఇన్వెస్టర్లతో భాగస్వామ్యమై త్వరితగతిన అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. ఏపీ బ్రాండ్ పెరిగేలా ఏడాదంతా పర్యాటక శోభ కలిగించేలా పర్యాటక ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విశాఖ, అరకు, అనకాపల్లి ఉత్సవ్, విజయవాడ ఉత్సవ్, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్, సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్, గండికోట ఉత్సవ్, మచిలీపట్నంలో మసూలా బీచ్ ఫెస్టివల్,కోనసీమలో ప్రభల తీర్థం, రామచంద్రాపురం, ఆత్రేయపురంలో బోట్ ఫెస్టివల్ , కొండవీడు ఉత్సవాలను ఘనంగా దిగ్విజయంగా నిర్వహించామని వివరించారు. నాడు కొండవీడు కోటకు వెళ్లేందుకు ఘాట్ రోడ్డుకు సీఎం చంద్రబాబునాయుడు 50 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల నిర్వహించిన ఉత్సవం ద్వారా కొండవీటి రాజుల పరిపాలన విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించామని, త్వరలోనే కొండవీడును నిర్వహించి ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పర్యాటక ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నద్ధమై ఉన్నామని స్పష్టం చేశారు.

**జాతీయ, అంతర్జాతీయ వేదికపై పర్యాటక వాణి**

రాష్ట్రంలోని తిరుపతి, విశాఖ, విజయవాడలో, దేశంలోని ఢిల్లీ, ముంబయిలో, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ పర్యాటక గొప్పతనాన్ని తెలిపేలా రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లు నిర్వహించి ఏపీ పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని వినిపించామని మంత్రి దుర్గేష్ అన్నారు. పలువురు శాసనసభ్యుల వినతి మేరకు 28 జిల్లాల్లో 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. తగిన ప్రణాళిక, కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక పర్యాటకం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఉదాహరణకు కంభం చెరువును ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతో ఎమ్మెల్యేలు అడిగిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ ద్వారా అరసవిల్లి సూర్యనారాయణ స్వామి, మంగళగిరి పానకాల నరసింహ స్వామి ఆలయాలకు నిధులు కోరామన్నారు. లేపాక్షిని అద్భుత కేంద్రంగా తీర్చిదిద్దాలని డీపీఆర్ కేంద్రానికి ఇచ్చామన్నారు. కొండవీడుపై, మచిలీపట్నం బీచ్ అభివృద్ధిపై డీపీఆర్ లు కేంద్రానికి పంపించామన్నారు. త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. పర్యాటక రంగాన్ని కేరళను మించిన స్థాయిలో బ్రాండింగ్ చేసేందుకు బడ్జెట్ లో నిధులు ప్రతిపాదించామన్నారు.టూరిజం ఆపరేటర్లను, డ్రైవర్ కమ్ గైడ్ కార్యక్రమం ద్వారా డ్రైవర్లను అంబాసిడర్లుగా గుర్తించామన్నారు. వారి ద్వారా పర్యాటకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు.

**ఏపీకి క్యూ కట్టిన ప్రఖ్యాత సంస్థలు**

పర్యాటక శాఖ వెబ్ సైట్ లో ఎక్కడెక్కడ భూమి అందుబాటులో ఉందో స్పష్టంగా పొందుపరిచామని ప్రైవేట్ ఇన్వెస్టర్లకు సూచించారు. పెట్టుబడి పెట్టాలనుకునే ఏ ఇన్వెస్టర్ అయినా తొలుత 25,000 చెల్లిస్తే సంబంధిత కంపెనీ నెట్ వర్త్, టైఅప్ తో రావడం చూసి పర్యాటక శాఖ కేపబుల్ అని భావిస్తే ఎస్ఐపీబీలో అనుమతి పొంది సంబంధిత ప్రాజెక్టుకు ల్యాండ్ కేటాయించి స్టార్ హోటల్లు, రిసార్ట్స్ నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే తాజ్, మేఫెర్, మారియట్, అట్మోస్ఫియర్ కోర్ తదితర ఇంటర్నేషనల్ సంస్థలు సైతం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రైవేట్ ఇన్వెస్టర్లను ప్రోత్సహించి పెట్టుబడులు ఆయా ప్రాంతాల్లో పెట్టేలా ఎమ్మెల్యేలు సహకరించాలన్నారు.



**కేంద్రానికి పలు ప్రతిపాదనలు.. సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం**

లలిత కళలను ప్రోత్సహించేందుకు, యువ కళాకారులకు మద్దతుగా విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేసేందుకు విజయవాడలోని జీవీఆర్ మ్యూజిక్, డ్యాన్స్ కాలేజీలో కళాక్షేత్ర ఆడిటోరియం నిర్మాణం, రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తెలుగు భాష, సాహిత్యాన్ని, సంగీత, నృత్య, నాటక కళలను సంరక్షించేందుకు, ప్రోత్సహించేందుకు, రచయితలకు అవకాశాలు కల్పించేందుకు సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా కోరామన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సూర్యరాయ ఆంధ్ర నిఘంటువును పునర్ముద్రించాలని, భవిష్యత్ తరాలకు అందజేయాల్సిన అవసరాన్ని వివరించామన్నారు. దీనికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. కొండపల్లి, కూచిపూడి, కడియం, మంగళగిరి, చీరాల, బాపట్ల, అరకు తదితర 14 ప్రాంతాల్లో ఎక్స్పీరియన్స్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకులు ఏదైనా పర్యాటక ప్రాంతం వెళ్లి కేవలం చూసి రాకుండా అనుభూతి చెందేలా వీటిని తీర్చిదిద్దుతున్నామన్నారు. కూచిపూడి నాట్యం పుట్టిన ఊరిపేరే కూచిపూడి గ్రామంగా మారిందని అభివర్ణిస్తూ కూచిపూడికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల్లో టెంపుల్ టూరిజాన్ని, అలాగే విశాఖ, అమరావతిలో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సూచనలతో పర్యాటకం, అటవీ, ఇరిగేషన్, దేవాదాయ, ఆర్ అండ్ బీ శాఖలతో సబ్ కమిటీ ఏర్పాటైందని, ఆయా శాఖలతో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకొని పర్యాటకంగా ముందుకు వెళ్లేలా, పర్యాటక రంగాన్ని విస్తృతపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

**కళా, సాంస్కృతిక రంగాలకు పునరుజ్జీవం**

ఏవి తల్లి నిరుడు కురుసిన హిమ సమూహంలు అని ఉదహరిస్తూ గత ప్రభుత్వంలో కళలు కళావిహీనమయ్యాయని మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో కళా ఉత్సవాలు లేవని, పురస్కారాలు లేవని, కళాకారులు సంతోషంగా లేరని గుర్తించిన కూటమి ప్రభుత్వం కళాకారులకు గౌరవాన్ని తిరిగి తెచ్చిందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.ఈ క్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకు 2025లో ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా నాటక రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన 110 మంది నాటక కళాకారులకు కందుకూరి పురస్కారాలు, 200 మందికి పైగా కవులు, కళాకారులకు ఉగాది పురస్కారాలు (కళారత్న) అందించామన్నారు. 2026కు కూడా కసరత్తు పూర్తయిందని తెలిపారు. సామాజిక చైతన్యానికి ప్రతీకగా గుర్రం జాషువా, బోయి భీమన్నల పురస్కారాలను ప్రదానం చేశామన్నారు.వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి జయంతి (ఆగస్టు 29) సందర్భంగా రాష్ట్ర పండుగగా 'తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తూనే తెలుగు భాషా పురస్కారాల ప్రదానం చేశామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ నంది అవార్డుల పునరుద్ధరణపై కసరత్తు చేస్తున్నారని, త్వరలోనే సీఎం చంద్రబాబునాయుడు ఆమోదంతో తుది ప్రకటన ఉంటుందన్నారు.

**నూతన ఫిల్మ్ పాలసీ - ఫిల్మ్ టూరిజం:**

సినిమా రంగానికి ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సినిమాటోగ్రఫీ ద్వారా ఫిల్మ్ టూరిజం అభివృద్ధికి ఫిల్మ్ టూరిజం పాలసీ తెచ్చి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో సినిమా షూటింగ్ లకు ఉచిత అనుమతులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. షూటింగ్ ల ద్వారా పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తెచ్చి మరింత ప్రాచుర్యం కల్పిస్తామన్నారు. ఏపీలో రిజిస్టర్ అయిన చిన్న చిత్రాలకు 9% జీఎస్టీ మినహాయింపు మరియు ఏటా 15 లో బడ్జెట్ చిత్రాలకు రూ.10 లక్షల చొప్పున నగదు సబ్సిడీ ఇస్తున్నామన్నారు.నూతన ఫిల్మ్ పాలసీ, ఫిల్మ్ టూరిజం, సింగిల్ విండో సిస్టమ్, టికెట్ ధరల క్రమబద్ధీకరణ తదితర అంశాలతో సినిమాటోగ్రఫీలో విస్తృతమైన ప్రక్రియలకు శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో జరిగిన చర్చల అనంతరం నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రాన్ని ఏపీలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీలో సినిమా షూటింగ్ లు జరుగుతున్నప్పటికీ మౌలిక సదుపాయాల కొరత ఉందన్నారు. ఇప్పటికే ప్రొడ్యూసర్లను ఆహ్వానించామన్నారు. స్టూడియోలు, రీరికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్ల నిర్మాణం మరియు షూటింగ్ లొకేషన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు.

**సభ్యుల సూచనలపై మంత్రి దుర్గేష్ స్పందన**

ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మండలి బుద్ధ ప్రసాద్, విష్ణుకుమార్ రాజు, అయితాబత్తుల ఆనందరావుల సూచనలపై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి పక్కా భవనం, హైదరాబాద్ నుంచి ఏపీకి రావాల్సిన పురావస్తు సంపద సేకరణ, విశాఖ ఫిల్మ్ నగర్ సొసైటీ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.రాష్ట్రంలో రుషికొండ బీచ్ కు బ్లూఫ్లాగ్ బీచ్ హోదా ఉందని, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రతిపాదన మేరకు ఎస్. యానాం బీచ్ లాంటి మరికొన్ని బీచ్ ల్లో శుభ్రత, భద్రత, పర్యావరణం వంటి అంశాలకు పెద్దపీట వేసి బ్లూఫ్లాగ్ బీచ్ గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

**గత ప్రభుత్వంపై మంత్రి దుర్గేష్ ఫైర్**

గత ప్రభుత్వంలో పర్యాటక రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని చెబుతూ అభివృద్ధి కంటే విధ్వంసానికే నాడు ప్రాధాన్యతనిచ్చారని మంత్రి దుర్గేష్ సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యాటక శాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయం వచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో గత ప్రభుత్వం రూ.434 కోట్లతో రుషికొండ ప్యాలెస్ ను నిర్మించడం వల్ల పర్యాటక శాఖ ఆదాయం కోల్పోయిందన్నారు. రుషికొండ ప్యాలెస్ వంటి స్వప్రయోజన నిర్మాణాల వల్ల రాష్ట్రానికి ఆదాయం పోగా అదనపు భారం పడిందని తెలిపారు. దాని వినియోగంపై కేబినెట్ సబ్ కమిటీ త్వరలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఏపీలో కేరళను మించిన అందాలు ఉన్నప్పటికీ బ్రాండింగ్ చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 2019-24 కాలంలో పర్యాటకాన్ని గత ప్రభుత్వం నాశనం చేసిందని ఫైర్ అయ్యారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడంతో పాటు వివిధ పర్యాటక ఉత్సవాల నిర్వహణకు రూ. 150 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించామన్నారు. కేంద్ర ప్రభుత్వ'పూర్వోదయ' పథకాల ద్వారా వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని, కనెక్టివిటీని మెరుగుపరచాలని నిర్ణయించామన్నారు. ఏపీకి ఎక్కువ మంది గైడ్లు వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. వారికి శిక్షణ ఇచ్చి పర్యాటకాన్ని ప్రమోట్ చేస్తామన్నారు.ఈ సందర్భంగా కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.2019-24 మధ్య కాలంలో గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా అడుగంటిన, నత్తనడకన నడిచిన, విధ్వంసానికి గురైన పర్యాటక రంగాన్ని నేడు సీఎం చంద్రబాబునాయుడు దూరదృష్టితో, దిశానిర్దేశంతో పట్టాలెక్కించామన్నారు. సాంస్కృతిక రంగానికి పునరుజ్జీవం కల్పించామన్నారు.కళాకారులను ఆదరిస్తున్నామన్నారు. సినిమాటోగ్రఫీకి పెద్దపీట వేస్తూ ఏపీలో చలనచిత్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. పరిమిత వనరులతో అపరిమిత కార్యక్రమాలు ఎలా నిర్వహించుకోవాలన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నామని లియోనెల్ రాబిన్స్ చెప్పిన సూక్తిని పర్యాటక రంగానికి వర్తించేలా ఉదహరించారు.

# గ్యాంగ్ వర్కర్లతో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు

-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ**

గ్యాంగ్ వర్కర్లతో విస్తృతంగా డీసిల్టింగ్ పనులను చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం అజిత్ సింగ్ నగర్, పాయకాపురం, భవానిపురం, వన్ టౌన్, పటమట ప్రాంతాలలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరం మొత్తం శరవేగంగా డీసిల్టింగ్ పనులను చేస్తున్నామని, అందులో భాగంగా ప్రతి చిన్న డ్రైన్ నుంచి మేజర్ ఔటఫాల్ డ్రైన్ వరకు పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది డిసిల్లింగ్ పనులను శరవేగంగా చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలోగల డ్రైన్లు అన్నిటిని గ్యాంగ్ వర్కర్లను పెట్టి, కాలువల ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా డీసిల్టింగ్ పనులను చేస్తున్నామని తెలిపారు. మరోవైపు ప్రధాన ఔటఫాల్ డ్రైన్ లలో వాహనాల సహాయంతో వ్యర్థాలను తొలగిస్తున్నామని అన్నారు. ఒకవైపు డీసిల్టింగ్ పనులను చేయడమే కాకుండా మరోవైపు యాంటీ మలేరియా ఆపరేషన్లో చేస్తున్నామని ప్రతీ కాలువలో మలేరియా మందును వేస్తున్నాం తెలిపారు. ప్రధానంగా దోమలను నివారించడమే కాకుండా వర్షాకాలం దృశ్యం కాలవల ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా అప్రమత్తంగా ఉంటున్నామని తెలిపారు.

## ఫిట్‌గా ఉంటేనే అన్నింటా ఫస్ట్‌గా ఉంటాం..

- ఆరోగ్యవంతమైన ఉద్యోగులే సమర్థవంతమైన పాలనకు బలం
- శారీరక దృఢత్వం.. మానసిక ప్రశాతంతకు మార్గం
- మానసిక ఆరోగ్యంతోనే మంచి ఆలోచనలు వస్తాయి
- మహిళా ఉద్యోగుల సామర్థ్యానికి ప్రతీకగా క్రీడా పోటీలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ,శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు

**ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ**



శారీరక, మానసిక ఆరోగ్యం ప్రతిఒక్కరి జీవితంలో అత్యంత కీలకమని.. ఫిట్‌గా ఉంటేనే వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించగలమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఏపీ ఎన్జీజీవో మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ నిర్మలకుమారి, కన్వీనర్ పి.మాధవి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మనం చేసే పనిద్వారా మంచి ఫలితాలు సాధించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమేనని.. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం సమర్థవంతమైన పాలనకు కీలకమని.. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే ఉద్యోగులు ఉత్సాహం, ఏకాగ్రత, సానుకూల దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. మానసిక ప్రశాంతత ఉంటే నిర్ణయాలు స్పష్టంగా తీసుకోవచ్చని, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో ఏపీ ఎన్జీజీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకం, అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**ఆడాలి.. ఆనందంగా ఉండాలి: శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

మహిళా ఉద్యోగులను చైతన్యవంతులను చేసి కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లేలా చేసేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. వ్యవస్థలు సజావుగా ముందుకెళ్తున్నాయంటే అందుకు ఉద్యోగుల సమర్థతే కారణమని, సమాజ హితం కోసం నిత్యం శ్రమిస్తున్న ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యమని అన్నారు. ఇందుకు క్రీడలు, నిత్య వ్యాయామం దోహదం చేస్తాయన్నారు. ఒత్తిడిని అధిగమించి కొత్త ఉత్సాహంతో చేస్తున్న పని ద్వారా మంచి ఫలితాలు సాధించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఆరోగ్య ఆంధ్ర, క్రీడాంధ్ర సాధన దిశగా దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. గౌరవ పీఎం ఫిట్ ఇండియా ద్వారా ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేస్తున్నారని రవినాయుడు అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ క్రీడలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. భవిష్యత్తులో గౌరవ ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ తదితర అధికారులతో మూడు నాలుగు రోజులపాటు క్రీడా పోటీలను నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు రవినాయుడు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ఈ ప్రభుత్వం దృష్టిసారిస్తోందని.. ఇది ఉద్యోగులు గౌరవంగా జీవించేలా చేయాలన్న తపన ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ... క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, ఆత్మవిశ్వాసం వంటి గుణాలను పెంపొందిస్తాయని చెప్పారు. కార్యాలయ పనులతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మహిళా ఉద్యోగులు ప్రతి రంగంలోనూ ముందంజలో ఉన్నారని, క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర అవగాహన, ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా క్రీడా పోటీలను నిర్వహించడంలో భాగస్వాములమవుతున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు విద్యాసాగర్ అన్నారు. ఏపీ ఎన్జీజీవో మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ నిర్మలకుమారి మాట్లాడుతూ..ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యత సాధించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కార్యాలయాల్లో ఏర్పడే ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, ఉద్యోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉంటే పనితీరు మెరుగుపడుతుందని, మానసిక ప్రశాంతతతో తీసుకునే నిర్ణయాలు శాఖ ప్రతిష్ఠను పెంచుతాయని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుతున్న ఈ సమయంలో, క్రీడా వేదికల ద్వారా వారి సామర్థ్యాన్ని మరింత వెలుగులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్మలకుమారి తెలిపారు.

# పాతతరం పశువైద్యులు ఉప్పలపాటి మృతి

**వందలాదిగ తరలివచ్చిన అభిమానులు**



**ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట**

కామవరపుకోట శివారు పాతూరు గ్రామానికి చెందిన పూర్వకాలపు పశు వైద్యులు ఉప్పలపాటి సత్యనారాయణ (91) శనివారం ఉదయం మృతి చెందారు. నాలుగు దశాబ్దాల పాటు ఆయన ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, అశ్వారావుపేట ఏరియాల్లో పశువైద్యుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పశువైద్యులు అందుబాటులో లేని సమయంలో పశువులకు సంక్రమించే అనేక వ్యాధులకు తనదైన శైలిలో ఆకు, అలము, పసరుతో వైద్యం చేసే వారిని గ్రామస్తులు ఆయన సేవలను కొనియాడారు. సత్యనారాయణ 200 ఏళ్ల నాటి ఆయుర్వేద పద్ధతులతో పశువైద్యంలో తనదైన ముద్ర వేశారు. నేటికీ పశువులకు దీర్ఘకాలిక వ్యాధులకు సత్యనారాయణ వైద్యం అందజేసే వారన్నారు. ఆయన మృతి పట్ల చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచ్ అనూష భాగ్యరాజ్, కోట సొసైటీ అధ్యక్షులు ఘంటా మాధవరావు, ఘంటా సుధీర్‌బాబు, సాయిన కనకరాజు, నెక్కలపు సూర్యనారాయణ, కోనేరు వెంకట సుబ్బారావు, కోనేరు వెంకట్రామయ్య, నూతిరాటాలు, కొయ్యగూర స్వామినాథం, కోనేరు మోహన్‌కృష్ణ, ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, వందలాదిగ తరలివచ్చిన అభిమానులు,గ్రామ పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న ఎంపీ హరీష్ బాలయోగి



**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడితిప్ప గ్రామ పరిధిలోని గోపాయిలంకలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవమునకు సిద్ధంగా వున్న శ్రీ శ్రీ శ్రీ అభయ ఆంజనేయస్వామి వారిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి దర్శించుకున్నారు.

### అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలకు

# వైయస్సార్సీపీ అండగా ఉంటుంది

- ఎన్నికల హామీల అమలు కోసం వారి తరఫున పోరాడుతాం
- పోలీస్ దాడులతో ఉద్యమాలను అణచాలనుకోవడం అవివేకం
- నలమారు చంద్రశేఖర్ రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి-తాడేపల్లి**

అంగన్‌వాడీ వర్కర్లపై పోలీసుల దాడి అమానుషమని, ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న అక్కచెల్లెమ్మలను దారుణంగా వేధించిందని వైయస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలకు వేతనాలు పెంచుతానని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన చంద్రబాబు, రెండేళ్లుగా మభ్యపెడుతూ వచ్చారని వివరించారు. టెంట్‌లో ఉండి నిరసన వ్యక్తం చేస్తున్న ఉన్న మహిళలను వేకువ జామున ఒక్కసారిగా ఈడ్చి వ్యాన్‌లలోకి తరలించడం హేయమని చర్యగా పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు వైయస్సార్సీపీ అండగా ఉంటుందని, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని నలమారు చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు.

**రెండేళ్లుగా మభ్యపెడుతున్నారు**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం అత్యంత అమానుషంగా వ్యవహరించింది. ప్రభుత్వంతో చర్చలకు పిలుస్తామని ముందురోజు రాత్రి నమ్మబలికి వేకువజామున టెంట్లు కూల్చేసి అక్రమంగా అరెస్టు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలకు వేతనాలు పెంచుతానని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతోంది.. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అనేక దఫాలు శాంతియుతంగా నిరసనలు తెలిపిన అంగన్‌వాడీలను చంద్రబాబు ప్రతిసారీ మభ్యపెడుతూ వచ్చారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో సోమవారం నిర్వహించిన 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు భారీగా పోటెత్తారు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు అందరూ నిద్రిస్తుండగా వందలాది మంది మగ పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడి అంగన్‌వాడీ మహిళలను ఈడ్చి పారేశారు. వారు తేరుకునేలోగా టెంట్లు పడేసి, ఫ్లెక్సీలు చించేసి, ప్లకార్డులు విసిరేసి, అంతా చిందరవందర చేసేశారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులు వ్యవహరించిన తీరును వైయస్సార్సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. వారికి పార్టీ అండగా ఉండి వారి తరఫున ఉద్యమిస్తుంది.

**హామీ అమలు చేయాలని కోరడం తప్పా?**

శాంతియుతంగా ఉద్యమించిన మహిళలపై కర్కశంగా వ్యవహరించింది. రోడ్డు పైనే సొమ్మసిల్లిన అంగన్‌వాడీలపై చంద్రబాబు సర్కారు పోలీసులను ప్రయోగించి విరుచుకుపడింది. అంగన్‌వాడీలు తేరుకుని ఏం జరుగుతోందో గ్రహించేలోపే మహిళలని కూడా చూడకుండా ఈడ్చి పారేసి పోలీసు వ్యాన్‌లలోకి ఎక్కించేశారు. గతంలోనూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన నీచ చరిత్ర చంద్రబాబుది. అంగన్‌వాడీలు బయటకు వెళ్లే అవకాశం లేకుండా చుట్టూ రోప్ పార్టీతో పోలీసులు దిగ్బంధించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చిన వారిని కనీసం బ్యాగులు, సెల్‌ఫోన్లు కూడా తీసుకోనివ్వకుండా నిర్బంధించారు. చేతికి దొరికిన వారిని దొరికినట్లు అరెస్టు చేసి వ్యాన్లలోకి తోసేశారు. తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారు..? ఎక్కడికి తీసుకెళు_న్నారు..? అని ప్రశ్నించిన వారికి సమాధానం చెప్పకుండా గెంటేశారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. తమను అక్రమంగా అరెస్ట్ చేసి కనీసం టాయిలెట్స్‌కు వెళ్లడానికి కూడా అనుమతించలేదని అంగన్‌వాడీ వర్కర్స్ వాపోతున్నారు. అంగన్‌వాడీ వర్కర్ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు చూసి దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోంది.

**మూల్యం చెల్లించుకోక తప్పదు**

అంగన్‌వాడీలు మాత్రమే కాదు.. టీచర్లు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు, పెన్షనర్లు ప్రభుత్వ తీరు పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఇప్పటికే అనేకసార్లు వినతులు, నిరసనలు తెలియజేశారు. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన ఉండటం లేదు. వైయస్సార్సీపీ హయాంలో ఉన్న పీఆర్సీ ఛైర్మన్ తో రాజీనామా చేయించిన చంద్రబాబు.. రెండేళ్లుగా కొత్త పీఆర్సీ కమిషన్ వేయకుండానే కాలయాపన చేస్తున్నారు. కనీసం ఒకటో తేదీన జీతాలు ఇస్తామన్న హామీని కూడా నిలబెట్టుకోలేదు. ఉద్యోగులకు రావాల్సిన దాదాపు రూ. 35 వేల కోట్ల బకాయిలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. బినామీ కంపెనీలకు 99పైసలకు వేల కోట్ల విలువైన భూములు కట్టబెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్న ప్రభుత్వం... ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకపోతే దానికి ఖచ్చితంగా మూల్యం చెల్లించుకోకతప్పదని నలమారు చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు.

### దోమలపై దండయాత్ర...

# "స్పాట్ మస్కిటో ఎలిమినేటర్" మెషిన్ తో దోమల నివారణ చర్యలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ**

నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను నివారించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ "స్పాట్ మస్కిటో ఎలిమినేటర్" మెషిన్ను ట్రయిల్ లో భాగంగా కరెన్సీ నగర్, 14వ సచివాలయంలో ఏర్పాటు చేశారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం కరెన్సీ నగర్ లో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను ఆధునిక సాంకేతికతతో నివారించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ అడుగులు వేస్తుందని అన్నారు. అందులో భాగంగా స్పాట్ మస్కిటో ఎలిమినేటర్ యంత్రం పనితీరు పరిశీలించారని, యంత్రం దోమల నివారణకు బాగా పనిచేస్తుందని, ఈ యంత్రాన్ని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల ముఖ్యమైన ప్రదేశాలలో ఎక్కడైతే దోమలు ఎక్కువగా ఉన్నాయో, అక్కడ ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మరో అడుగు ముందుకు వేస్తూ "స్పాట్ మస్కిటో సెన్సార్ ట్రాపర్" మెషిన్ను కూడా వాడేటట్టు చర్యలు తీసుకుంటున్నామని ఈ మెషిన్ ద్వారా దోమల గురించి పూర్తి విషయాలు తెలుస్తాయని, అది ఆడదోమ లేదా మగదోమా, మురికి నీళ్లలో నివసించే దోమ లేదా మంచినీరు లో ఉండే దోమ అని తెలుసుకొని ఆ దోమల వల్ల కలిగే డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, ఫైల్ ఏరియా వంటి వ్యాధులను నివారించవచ్చు అని అన్నారు. అటువంటి యంత్రాలు వివిధ ప్రదేశాలలో అమర్చడం వలన ఆ యంత్రాల పనితీరు ఒక డాష్ బోర్డు ద్వారా తెలుస్తుందని ఆ డాష్ బోర్డులో ఎన్ని మగదోమలు ఉన్నాయి ఎన్ని ఆడ దోమలు ఉన్నాయి ఎన్ని డెంగ్యూ కలిగించే దోమలు ఉన్నాయి అవి ఎక్కడున్నాయో తెలుసుకొని అక్కడ డ్రోన్ల ద్వారా స్ప్రేలు నిర్వహించి ఆ దోమలను నివారించి ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా విజయవాడ నగరపాలక సంస్థ అడుగులు వేస్తుందని తెలిపారు. దోమలపై దండయాత్ర చేసేందుకు విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బందితోనే కాకుండా ఆధునిక సాంకేతికత యంత్రాలతో దోమల నివారణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల నాయక్, బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలు, మామిడి, జీడీ మామిడి సమగ్ర సస్యరక్షణ మేలైన ఎరువులపై అవగాహన

**ప్రజా భూమి ప్రతినిధి -ఏలేశ్వరం**

ఏలేశ్వరం మండలం మద్రివీడు ,పరిమితడక జె.అన్నవరం,తూర్పు లక్ష్మీపురం , లింగంపర్తి, పేరవరం గ్రామాలలో ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలు, మామిడి , జీడిమామిడి లో సమగ్ర సస్యరక్షణ మరియు మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు గూర్చి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఉద్యాన పంటలలో పాటించవలసిన ఎరువుల యామాన్యం గురించి వివరించారు. మామిడిలో రసం పీల్చే తామర పురుగులు , తేనే మంచు పురుగులు నివారణకు, వేప నూనె 5. మిల్లీలు , కార్బన్డిజం 1 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. డైమెథోయేట్ 2 ఎం ఎల్ లీటరు నీటికి చొప్పున కలిపి పూత మొదలయ్యే సమయంలో మరియు పిందె తయారు అయ్యే సమయంలో పిచికారీ చేయాలి .ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ , లేదా లామడా సైహలోత్రిన్ 2.0 మి.లీ ఒనీటిలో కరిగే గంధకం 3 గ్రా, పిప్రోనిల్ 2. మి లీం మాంకోజబ్ 3 గ్రా. పై మందులు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేస్తే చాలా రకాల పురుగులు నివారణ చేయబడతాయని తెలిపారు. మామిడిలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిందె గోలీకాయల సైజ్ ఉన్నప్పుడు పిచికారి చేయటం వలన అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. మామిడి కాయలకు కవర్లు (ఫ్రూట్ కవర్స్) కట్టుకోటం ద్వారా పండ్ల నాణ్యత పెరుగుతుందని వివరించారు. మామిడిలో పిందె ఏర్పడిన తర్వాత ఫిబ్రవరి రెండో వారం లో మొక్కకు 500 గ్రాముల యూరియా 750 గ్రాముల పోటాష్,500 గ్రాముల సూపర్ పాస్ఫేట్ చొప్పున ఎరువులు అందించాలని తెలిపారు.



జీడిమామిడి లో తేయాకు దోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి లీ, పూత సమయంలో లామడా సైహాలోత్రిన్ 2.0 మి.లీ , బటాణి గింజ దశలో ప్రొఫెనోఫాస్ 2 మి లీ, కార్బన్డిజం 1 గ్రా, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయిల్ పామ్ తోటలలో యాజమాన్య పద్ధతులను వివరించారు .రసం పీల్చే రుగోస్ తెల్ల దోమ నివారణకు వేపనూనె అజాదిరాచాటిన్ 10000 పి పి ఎం మందును 1 ఎం ఎల్ లీటరు నీటికి చొప్పున కలిపి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలన్నారు .నల్లకొమ్ము పురుగు నివారణకు మొవ్వులో 5-10 గ్రాములు ఫెర్టరా గుళికలు పెట్టుకోవాలని,లింగకర్షక ఎరలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అరటిలో దుంప పుచ్చు నివారణకు ప్రోపికనజోల్ మందును మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు,గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు నిఖిల్ , సువర్ణ లత, నిఖిల్ వెంకట సాయి, నానిబాబు, రాజ్ కుమార్,దీప్తి , సింహాద్రి గ్రామ రైతులు పాల్గొన్నారు.